PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 34 | విజయవాడ, గురువారం 4 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 4 September 2025 | Rs

ఏకపక్ష సంస్కరణలతో అనర్థమే

రాష్ట్రాల ఆదాయానికి 'జిఎస్‌టి' గండి

- పరిహార ప్యాకేజీ రూపొందించాల్సిందే
- ప్రతిపక్ష రాష్ట్రాల ఆర్థిక మంత్రుల డిమాండ్

7



మన్‌దీప్ మ్యాజిక్

- కొరియాతో సూపర్-4 మ్యాచ్ డ్రా

8



బీజింగ్‌లోని తియాన్మెన్ స్క్వేర్ వద్ద అత్యాధునిక ఆయుధాలతో ఆకట్టుకున్న భారీ పరేడ్

ప్రపంచానికి చైనా శాంతి సందేశం

- అత్యద్భుతంగా విక్టరీ డే పరేడ్
- ఒకే వేదికపై పుతిన్, కిమ్, జిన్‌పింగ్

బీజింగ్ : విశ్వ జనావళికి చైనా శాంతి సందేశాన్నిచ్చింది. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజింగ్‌లో అత్యాధునిక ఆయుధ సంపత్తితో చైనా భారీ పరేడ్ నిర్వహించింది. ప్రపంచం ముంగిట శాంతి, యుద్ధం అనే రెండే రెండు ఐచ్ఛికాలు మాత్రమే ఉన్నాయని, తామెల్లప్పుడూ శాంతితో కూడిన అభివృద్ధికే కట్టుబడి ఉంటామని చైనా అధ్యక్షులు జిన్‌పింగ్ ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. పరేడ్‌లో భాగంగా చైనా తొలిసారి జెట్ ఫైటర్లు, క్షిపణులు, అణ్వాయుధాలు వంటి అత్యాధునిక ఆయుధ సంపత్తిని ప్రదర్శించినా, ప్రతి విన్యాసంలోనూ శాంతి ప్రాధాన్యతను నొక్కి చెబుతూ పరేడ్ సాగింది. ఈ పరేడ్‌కు రష్యా అధ్యక్షులు పుతిన్, ఉత్తర కొరియా చీఫ్ కిమ్ జోంగ్ ఉన్‌సహా 26 దేశాల అధినేతలు హాజరయ్యారు.

శాంతియుత అభివృద్ధి మార్గమే ధ్యేయం

'చైనా శాంతియుత అభివృద్ధి మార్గాన్ని అనుసరిస్తుంది. చైనా అభివృద్ధిని ఎవరూ ఆపలేరు. ప్రపంచంలో కొనసాగుతున్న యుద్ధాల గురించి ప్రస్తావిస్తూ చరిత్రలో చైనా సరైన వైపు నిలుస్తుంది. మానవాళికి ఉమ్మడి భవిష్యత్తుతో కూడిన సమాజాన్ని నిర్మించడానికి చైనా సిద్ధంగా ఉంది. ప్రస్తుత రోజుల్లో శాంతి లేదా యుద్ధం, సంభాషణ లేదా ఘర్షణ, పరస్పర విజయం లేదా నష్టాలు అనే వాటిల్లో ఒకదాన్ని ఎంచుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. చైనా ప్రజలు శాంతి, అభివృద్ధి వైపే నిలుస్తారు. అలాగే ప్రపంచ దేశాలు సమాన హక్కులతో, శాంతియుతంగా జీవించి పరస్పర సహకారంతో ముందుకు సాగాలి. యుద్ధాలకు గల సమస్యలను పరిష్కరించుకుని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావతం కాకుండా చూడాలి' అని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు.

ఒకే వేదికపై ముగ్గురు నేతలు

మిలిటరీ పరేడ్ సందర్భంగా చైనా, రష్యా, ఉత్తర కొరియా అధినేతలు ఒకే వేదికపై ఆసీనులై తమ ఐక్యతను చాటారు. తద్వారా అమెరికాకు, ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్‌నకు బలమైన సందేశం పంపారు.

గవర్నర్లు కేవలం ప్రతీకాత్మకమే

- చట్టాల రూపకల్పనలో వారికి ప్రమేయం లేదు
- సుప్రీంలో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల వాదన
- రాష్ట్రపతి ప్రస్తావనపై కొనసాగుతున్న విచారణ

న్యూఢిల్లీ : ప్రజాప్రతినిధులతో కూడిన చట్ట సభలకే చట్టాన్ని చేసే అధికారాలున్నాయని, గవర్నర్లు కేవలం ఆ అధికారాలకు ప్రతీకాత్మక నేతలు మాత్రమేనని, చట్టాలను చేయడంలో వారికి పాత్ర ఉండదని ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాల తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాదులు సుప్రీంకోర్టులో స్పష్టం చేశారు. శాసనసభలు పంపిన బిల్లులను గవర్నర్లు తొక్కిపట్టి జాప్యం చేసే అధికారం లేదన్నారు. రాజ్యాంగంలో చాలా స్పష్టంగా బిల్లులను 'వీలైనంత త్వరగా పరిష్కరించాలి' అన్న నిబంధన ఉందని, దీనర్థం 'వెనువెంటనే లేదా తక్షణమే' అని పేర్కొన్నారు.

బిల్లులను తమ వద్దనే అట్టిపెట్టుకోవడంలో గవర్నర్లకు గల విచక్షణాధికారాలకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లు సుప్రీంకోర్టులో బుధవారం వాదించాయి. చట్టాలను చేయడంలో చట్టసభలకు పాత్ర వుంటుంది తప్ప గవర్నర్లకు అందులో ఎలాంటి పాత్ర లేదని స్పష్టం చేశాయి. గవర్నర్లకు ప్రతీకాత్మక (నామమాత్రపు) అధికారాలే వుంటాయని పేర్కొన్నాయి. గవర్నర్ల ఇష్టానుసారంమీద ప్రజల అభీష్టం లేదా సంకల్పం ఆధారపడి వుండదని పేర్కొన్నాయి. బిల్లును తన వద్దనే సుదీర్ఘకాలం అట్టిపెట్టుకోవడం లేదా దాన్ని తొక్కిపట్టి వుంచడమంటే బిల్లును ఆమోదించడానికి నిరాకరించడమేనని ఆ మూడు రాష్ట్రాలు పేర్కొన్నాయి. బిల్లులను పరిశీలించేటపుడు గవర్నర్ వంటి ఉన్నత రాజ్యాంగ అధికారి చిత్తశుద్ధితోనే వ్యవహరిస్తారని కేంద్రం భావించినట్లైతే రాష్ట్రాల శాసనసభల పట్ల కూడా అదే మర్యాద పాటించాలని, మిగతా 7లో


యూరియాకు ఇ-క్రాప్ లింక్

రాష్ట్రంలో అందుబాటులో 94,892 మెట్రిక్ టన్నులు

- కొరత లేకుండా చూసే బాధ్యత కలెక్టర్లదే
- విలేకరుల సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇ-క్రాప్ ద్వారా ఆధార్‌ను అనుసంధానం చేసి రాష్ట్రంలో రైతులకు యూరియా అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లది, వ్యవసాయాధికారులదేనని స్పష్టం చేశారు. యూరియా అంశంపై సచివాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం 94,892 మెట్రిక్ టన్నులు యూరియా



యూరియా వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న సిఎం చంద్రబాబు

అందుబాటులో ఉంచామని, కావాలని తప్పుడు ప్రచారం చేస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు.

గతేడాదితో పోల్చుకుంటే 97 వేల మెట్రిక్ టన్నులు అధికంగా సరఫరా చేశామని, 4,900 రైతు సేవా సంఘాలు, 1,890 పిఎస్‌ఎస్‌లు, 8,150 ప్రైవేట్ డీలర్ల వద్ద 70 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. ఈ నెలాఖరుకు మరో 2.71 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులోకి వస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. రబీకి కూడా 9.38 లక్షల కేటాయింపులు చేశారని తెలిపారు. ఎక్కడైనా ఎరువులు లేకపోతే అక్కడికి తానే వస్తానని, తమ వాళ్లది తప్పు ఉంటే చర్యలు తీసుకుంటానని చెప్పారు. రైతులు రైతులుగానే ప్రవర్తించాలని రాజకీయాల్లో భాగస్వాములు కావొద్దని హెచ్చరించారు.

అన్నదాత సుఖీభవ కింద ఇటీవల రైతుల ఖాతాల్లో రూ.7 వేలు చొప్పున జమ చేశామని, నీళ్లు పుష్కలంగా అందించామని, అన్ని రిజర్వాయర్లను నీళ్లతో నింపామని చెప్పారు. భవిష్యత్తులో కూడా నీటి భద్రత కోసం ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎవరికీ ఎక్కడా ఇబ్బందులు లేకుండా యూరియా, ఎరువులు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. రైతులు పంటలకు ఎక్కువగా యూరియా వాడొద్దని, దీనివల్ల ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఉంటుందన్నారు. రైతుల ముసుగులో వైసిపి కార్యకర్తలు దుష్ప్రచారంతో రెచ్చగొడుతూ రైతులను రోడ్డున పడేస్తున్నారని, వీరి రాజకీయ ఉచ్చులో రైతులు పడొద్దన్నారు. త్వరలో రైతులతో సమావేశం నిర్వహించి వాస్తవాలు వివరిస్తామన్నారు. సోషల్ మీడియా ఉందని ఇష్టానుసారంగా వాగినా, తప్పుడు వార్తలు రాసినా ఊరుకోబోమని హెచ్చరించారు. యూరియాను పక్కదారి పట్టించడం మిగతా 7లో

నష్ట పరిహారంపై స్పష్టత లేదు

- జిఎస్‌టిలో రెండు శ్లాబులే
- రేటు హేతుబద్ధీకరణకు జిఎస్‌టి కౌన్సిల్ ఆమోదం
- ఈ నెల 22 నుంచి కొత్త జిఎస్‌టి రేట్లు అమలు



జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో నిర్మలా సీతారామన్, సిఎంలు, మంత్రులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జిఎస్‌టిలో తీసుకొచ్చిన సంస్కరణలతో రాష్ట్రాలకు వాటిల్లే నష్టాన్ని పూడ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ సంస్కరణలతో రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం పడుతుందని వివిధ రాష్ట్రా ఆర్థిక మంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రతిపక్ష పాలిత రాష్ట్రా ఆర్థిక మంత్రులు లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండానే రేటు హేతుబద్ధీకరణకు జిఎస్‌టి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. జిఎస్‌టిలో ఇక రెండు శ్లాబులే ఉండనున్నాయి. బుధవారం నాడిక్కడ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగే జిఎస్‌టి కౌన్సిల్ 56వ సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల నుండి ఆర్థిక మంత్రులు, కేంద్ర ప్రతినిధులు పాల్గొన్నారు. రూ.2,500 వరకు ధర ఉన్న పాదరక్షలు, దుస్తులపై జిఎస్‌టి రేటును 5 శాతానికి తగ్గించడానికి జిఎస్‌టి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం రూ.1,000 వరకు ధర ఉన్న పాదరక్షలు, దుస్తులపై 5 శాతం పన్ను విధిస్తున్నారు. అయితే పరిమితికి మించి వస్తువులపై 12 శాతం జిఎస్‌టి విధిస్తున్నారు. 5 శాతం శ్లాబ్‌లో పాదరక్షలు, దుస్తుల పరిమితిని రూ.1,000 నుండి రూ.2,500కి పెంచాలని నిర్ణయించింది. అలాగే 12 శాతం, 28 శాతం శ్లాబులను తొలగించి, ఈ శ్లాబుల్లో ఉన్న ఎక్కువ వస్తువులను 5 శాతం, 18 శాతానికి మార్చాలని నిర్ణయించారు. . కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'నెక్స్ట్-జెన్' జిఎస్‌టి సంస్కరణలు, తప్పనిసరి ఉత్పత్తులపై పన్ను భారాన్ని తగ్గించడానికి రెండు పన్ను రేట్లు కలిగిన నూతన విధానం చర్చించారు. ప్రస్తుతం 12 శాతం, 28 శాతం పన్ను శ్లాబ్‌లలో ఉన్న ఉత్పత్తులను తక్కువ రేట్లకు మార్చడం, కొన్ని ఎంపిక చేసిన ఉత్పత్తులపై 40 శాతం ప్రత్యేక పన్ను విధించడం ఈ ప్రతిపాదనలో భాగంగా ఉన్నాయి. ఈ నెల 22 నుంచి కొత్త జిఎస్‌టి రేట్లు అమలులోకి వస్తాయి.

పన్ను రేట్ల తగ్గింపును స్వాగతించినప్పటికీ, ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాలు సంస్కరణల వల్ల కలిగే ఆదాయ నష్టాన్ని కేంద్రం భర్తీ చేయాలని తెలిపాయి. ఎనిమిది ప్రతిపక్ష రాష్ట్రాలు ఇప్పటికే ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. బిజెపి పాలిత రాష్ట్రాలు కూడా ఆదాయ నష్టం గురించి ఆందోళన చెందుతున్నాయి. జిఎస్‌టి సంస్కరణల వల్ల ఏటా ఆదాయంలో రూ. 2 లక్షల కోట్ల నష్టం మిగతా 7లో

ఏడుగురు ఐఎఎస్‌ల బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఏడుగురు ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ జిఓఆర్‌టి నెంబరు 1628ను విడుదల చేసింది. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్సు డైరెక్టర్‌గా రోణంకి కూర్మనాథ్‌ను ప్రభుత్వం నియమించింది. అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్ ప్రభాకర్‌రెడ్డిని ఆ బాధ్యతల నుంచి తప్పించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న వై మేఘస్వరూప్‌ను తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టరుగా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న అధుతోష్ శ్రీవాస్తవను గుంటూరు జాయింట్ కలెక్టరుగా, సి యశ్వంత్ కుమార్‌రెడ్డిని పార్వతీపురం జాయింట్ కలెక్టరుగా నియమించారు. అక్కడ ఉన్న జెసి శోభికను పార్వతీపురం ఐటిడిఎ పిఒగా బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న శ్రీపూజను పాడేరు ఐటిడిఎ పిఒగా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న కెఆర్ కల్పశ్రీని సిసిఎల్‌ఎ లో విజిలెన్స్ జాయింట్ సెక్రటరీగా పోస్టింగ్ ఇచ్చారు. బచ్చు స్మరణ్‌రాజ్‌ను రంపచోడవరం ఐటిడిఎ పిఒగా పోస్టింగ్ ఇచ్చారు. అక్కడ పనిచేస్తున్న కట్టా సింహాచలానికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.


'శ్రీశైలం' క్రస్ట్ గేట్లకు

ప్రొటెక్షన్ సిలిండర్లు

కెఆర్‌ఎంబి చైర్మన్ బిపి పాండే సూచన

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు

అవసరమైన చోట శ్రీశైలం క్రస్ట్ గేట్లకు ప్రొటెక్షన్ సిలిండర్లను ఏర్పాటు చేయాలని సంబంధిత ఇంజనీర్లకు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కెఆర్‌ఎంబి) చైర్మన్ బిపి.పాండే సూచించారు. శ్రీశైలం డ్యాంను ఆయన, కెఆర్‌ఎంబి సభ్యులు కెకె.జంగిడ్ బుధవారం పరిశీలించి పలు విషయాలు అడిగి తెలుసుకొని కొన్ని సూచనలు చేశారు. ముందుగా ఆనకట్ట దిగువ భాగం గ్యాలరీలో డీవాటరింగ్ విధానం, రేడియల్ క్రస్టు గేట్లు, ప్లంజ్‌పూల్ ప్రాంతాన్ని పరిశీంచారు. అనంతరం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ గేజింగ్ విభాగం వద్ద చేరుకొని జలాశయంలోని నీటి నిల్వలు, డ్యాం నీటి ప్రవాహం, నీటి విడుదల అంశాలపై సంబంధిత ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్తు కేంద్రాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీశైలం ఆనకట్ట చీఫ్ ఇంజనీర్ కబీర్ బాషా విలేకర్లతో మాట్లాడుతూ కెఆర్‌ఎంబి చైర్మన్‌గా తొలిసారి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ప్రధానమైన ప్రాజెక్టుల్లో ఒకటైన శ్రీశైలం ప్రాజెక్టు సిస్టంపై అవగాహన కోసం బిపి.పాండే వచ్చినట్లు తెలిపారు.



పలు సర్వేల మ్యాపులను పరిశీలిస్తున్న కెఆర్‌ఎంబి చైర్మన్ బిపి.పాండే, అధికారులు

గతంలో ఆనకట్టపై ప్లంజ్ పూల్‌ల్లో జరిగిన పలు సర్వేలు, అండర్ వాటర్ వీడియోగ్రఫీ, యాప్రాన్, బ్యాథమెటిక్స్, కాంక్రీట్ సిలిండర్లపై ఆయన అడిగి తెలుసుకున్నారని, శ్రీశైలం ఆనకట్టపై పనులకు సంబంధించిన ప్లాన్ కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని బాషా చెప్పారు. పోతిరెడ్డి పాడు రెగ్యులేటర్, హంద్రీనీవా సుజలస్రవంతి, బనకచర్ల, వెలుగొండ ప్రాజెక్టులను కూడా కెఆర్‌ఎంబి చైర్మన్ పరిశీలిస్తారని తెలిపారు. ఈ పరిశీలనలో కెఆర్‌ఎంబి డిఇ పవన్ నాగ్, శ్రీశైలం ఆనకట్ట ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వేణుగోపాల్ రెడ్డి, ఎఇలు మల్లికార్జున, సుదర్శన్‌రెడ్డి, సామ్యూల్ విజయ్, వినోద్, మల్లికార్జున, ఎస్‌పిఎఫ్ ఎస్‌ఐ రాజేష్ ఉన్నారు.

మద్యం కుంభకోణంలో

'సిట్' సోదాలు

- చెవిరెడ్డికి చెందిన పలు డాక్యుమెంట్లు స్వాధీనం!

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

లిక్కర్ స్కామ్ కేసులో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో బుధవారం సోదాలు నిర్వహించింది. చెవిరెడ్డి సొంత ఊరు తుమ్మలగుంటలోని ఆయన ఇంట్లో దాదాపు మూడు గంటల పాటు సోదాలు నిర్వహించారు. చెవిరెడ్డికి సన్నిహితుడైన చిత్తూరు వైసిపి నేత విజయానందరెడ్డి ఇంట్లోనూ తనిఖీలు చేశారు. సోదాల్లో పలు డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ డివైజులను స్వాధీనం చేసుకున్నట్లు, ఇతర ఆధారాలూ సేకరించినట్లు సమాచారం. హైదరాబాదులోని చెవిరెడ్డికి చెందిన సిబిఆర్ ఇన్ఫ్రా కంపెనీలోనూ సోదాలు చేసి, పలు ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. బుధవారం రాత్రి కూడా ఈ మూడు ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. లిక్కర్ కేసులో పలువురు వైసిపి సీనియర్ నాయకులను అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం సిట్ అధికారులు బృందాలుగా ఏర్పడి చిత్తూరు, తిరుపతి, హైదరాబాద్‌లలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తిరుపతి, హైదరాబాద్‌లోని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కంపెనీల్లోనూ సోదాలు చేశారు. చిత్తూరులోని చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి చెందిన ఇన్ఫ్రా కంపెనీ, బివి రెడ్డి కాలనీ, నలందా నగర్, నిఖిలానంద అపార్ట్‌మెంట్‌లోని కార్యాలయంలోనూ, హైదరాబాద్ గచ్చిబౌలిలోని ప్రశాంతి హిల్స్‌లో ఫ్లాట్ నెంబర్ 35లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి చెందిన కంపెనీలోనూ సోదాలు చేశారు. రికార్డుల్లో కంపెనీల పేరు ఒకలా, భౌతికంగా ఉన్న కార్యాలయాల పేరు మరోలా ఉన్నట్లు పరిశీలనలో తేలినట్టు సమాచారం. చిత్తూరులో రికార్డుల్లో ఉన్న సిఎంఆర్ కంపెనీ వద్దకు తనిఖీకి వెళ్లగా, అక్కడ వెల్‌టాస్క్‌ఫుడ్ అండ్ బేవరేజెస్ పేరుతో బోర్డు ఉంది. ఈ కంపెనీ విజయానంద్‌రెడ్డి సంస్థగా గుర్తించారు. ఇక్కడ తనిఖీల్లో రహస్యంగా ఉంచిన మోహిత్ రెడ్డి కంపెనీ వివరాలు, విజయానంద్ రెడ్డి కంపెనీ రికార్డులు లభ్యమైనట్టు సమాచారం. హైదరాబాద్‌లోని ప్రశాంతి హిల్స్‌లో భీంస్పేస్ కార్యాలయానికి వెళ్లగా ఇషా ఇన్ ఫ్రాం పేరుతో బోర్డు కనిపించింది. ఈ కంపెనీలో డైరెక్టరుగా సజ్జల భార్గవ రెడ్డి ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించినట్టు సమాచారం.

బిఆర్‌ఎస్ సభ్యత్వానికి, ఎమ్మెల్సీగా కవిత రాజీనామా

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ పదవికి, బిఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి కల్వకుంట్ల కవిత బుధవారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని శాసనమండలి చైర్మన్‌కు, తన తండ్రి బిఆర్‌ఎస్ అధ్యక్షులు కెసిఆర్‌కు పంపించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ తాను ఏ పార్టీలోనూ చేరేది లేదని, అందరితో చర్చించి భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపి సంతోష్ తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారని, బిఆర్‌ఎస్‌ను హస్తగతం చేసుకునే కుట్రలో భాగంగానే తొలుత తనను బయటకు పంపించారని ఆరోపించారు. రేపటి నాడు ఇదే ప్రమాదం రామన్నకు, నాన్నకూ పొంచి ఉందని అన్నారు. 'పార్టీలో ఉంటూ కేవలం డబ్బు సంపాదించుకోవాలనే వారికి మా కుటుంబం బాగుండొద్దు. మేం విచ్ఛిన్నమైతేనే వాళ్లకు అధికారం వస్తుంది' అని విమర్శించారు.

'ఉక్కు' ప్రయివేటీకరణ కుట్రలు ఆపండి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు దారుణం
- స్టీల్‌ప్లాంట్‌లో ఇఒఐల రద్దుకు విశాఖలో కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ధర్నా



విశాఖ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఇఒఐ)ల పేరుతో విశాఖ ఉక్కును ప్రయివేటీకరించే కుట్రలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలిపివేయాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నేతలు డిమాండ్ చేశారు. జెఎసి ఆధ్వర్యంలో బుధవారం జగదాంబ జంక్షన్ నుంచి విశాఖ కలెక్టరేట్ వరకూ ప్రదర్శనగా వెళ్లి అక్కడ భారీ ధర్నా నిర్వహించారు. విశాఖ ఉక్కు రక్షణ నినాదాలు హోరెత్తాయి. జెఎసి చైర్మన్ ఎం జగ్గునాయుడు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్ కనకారావు మాట్లాడారు. ఇఒఐలకు ఈ నెల తొమ్మిదిలోపు బిడ్లు వేయాలని స్టీల్ యాజమాన్యం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఆపరేషన్‌తో సహా 46 విభాగాలు ఈ ఇఒఐల్లో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రక్రియ ప్లాంటును ముక్కలుగా చేసి ప్రయివేట్‌కు కట్టబెట్టే చర్య అని, దీనివల్ల స్టీల్‌ప్లాంట్‌కు, కార్మికులకు, విశాఖకు, రాష్ట్ర, దేశ ప్రయోజనాలకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. తక్షణమే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర కుట్రలను నిలువరించి ప్లాంట్‌ను కాపాడాల్సిన టిడిపి కూటమి ప్రభుత్వంలోని విశాఖ ఎంపి, గాజువాక ఎమ్మెల్యే.. మోడీ ప్రభుత్వానికి భజన చేయడం దుర్మార్గమన్నారు. కార్మికులు ఎక్కువమంది అయిపోయారని తప్పుడు ప్రచారం చేస్తూ ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను చట్ట విరుద్ధంగా తొలగించారన్నారు. వారి స్థానంలో ఇతర రాష్ట్రాల కార్మికులను విధుల్లోకి తీసుకొని పనిచేయిస్తున్నారని తెలిపారు. అనుభవంగల కార్మికులను తొలగించడం వల్ల స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి తీవ్రనష్టం జరుగుతోందన్నారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు లేకపోవడం వల్ల నష్టాల పాలవుతోందన్నారు. ప్లాంట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్‌కెఎస్‌వి కుమార్, ఎం మన్మధరావు, బి నాగభూషణం అధ్యక్షవర్గంగా సాగిన ఈ కార్యక్రమంలో పలు కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు.

కూలి రేట్ల పెంపు కోసం కార్మికుల సమ్మె

దిగివచ్చిన అధికారులు - పెంపునకు అంగీకారం

- మిర్చి యార్డులో స్తంభించిన లావాదేవీలు

ప్రజాశక్తి గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు మిర్చియార్డులో కూలి రేట్ల పెంపు కోసం కార్మికులు బుధవారం సమ్మెకు దిగారు. దీంతో యార్డులో కోల్డ్ స్టోరేజీలు, మిర్చిగూడాలు, కారం మిల్లులలో లావాదేవీలు స్తంభించిపోయాయి. మిర్చియార్డు కాపలా ముఠా సంఘం, దిగుమతి ముఠా సంఘం, కొట్టుముఠా సంఘం ఆధ్వర్యాన సమ్మె చేశారు. కార్మికులకు సిఐటియు, ఎఐటియుసి, ఎపిఎఫ్‌టియు మద్దతు తెలిపాయి. జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ కలుగజేసుకొని కార్మిక సంఘాలు, యజమానులు, మిర్చియార్డు అధికారులతో మాట్లాడారు. కూలి రేట్లు పెంచుతూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో కార్మిక సంఘాలు సమ్మెను విరమించాయి. కాపలా ముఠాకు టిక్కీకి రూ.8.90, దిగుమతి ముఠాకు రూ.8.80, కొట్టు ముఠాకు రూ.13.50కు కూలి రేట్లు పెంచాలని నిర్ణయించారు.



మిర్చియార్డులో ఆందోళన చేస్తున్న కార్మికులు

తొలుత సమ్మె వద్ద సిఐటియు మిర్చి క్లస్టర్ కన్వీనర్ కె.నళినికాంత్ మాట్లాడుతూ.. రెండేళ్లకోసారి పెంచాల్సిన కూలి రేట్లు పెంచకపోవడం అన్యాయమన్నారు. చిన్న వ్యవసాయ మార్కెటింగ్ యార్డుల్లో సైతం కార్మికులకు యూనిఫామ్, కుట్టుకూలి, గుర్తింపు కార్డులు ఇస్తున్నారని, మార్చియార్డులో మాత్రం అవి అమలు కావడం లేదని తెలిపారు. ఎఐటియుసి నాయకులు అంజిబాబు మాట్లాడుతూ... కూలి రేట్ల పెంపునకు యాజమాన్యం సిద్ధపడకపోతే సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఎపిఎఫ్‌టియు నాయకులు పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. 20 ఏళ్ల తర్వాత మిర్చి యార్డ్ కార్మికులు ఐక్యంగా సమ్మెకు దిగారని, ఈ స్ఫూర్తితోనే కూలి రేట్లు పెంచుకోవాలని కోరారు. కొట్టుముఠా యూనియన్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, కాపుల ముఠా యూనియన్ అధ్యక్షులు నాగగౌడ, దిగుమతి ముఠా యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహానికి లోకేష్ శంకుస్థాపన

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం, స్మృతివనం, ఆడిటోరియం, మ్యూజియం నిర్మాణానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఇందుకు తుళ్లూరు - పెదపరిమి మధ్య బొమ్మలరోడ్డు వద్ద ప్రభుత్వం 6.8 ఎకరాలను కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం, పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మాణాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో లోకేష్ మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన మహనీయులు పొట్టి శ్రీరాములని, ఆయన త్యాగానికి గుర్తుగా ఈ పనులు చేపట్టామని తెలిపారు. పురపాలక శాఖ మంత్రి పి నారాయణ మాట్లాడుతూ శ్రీరాములు విగ్రహం, ఇతర నిర్మాణాలకు సిఆర్‌డిఎ సహకారం అందిస్తుందని, వచ్చే శ్రీరాములు జయంతి నాటికి విగ్రహం పూర్తి చేస్తే అమరావతిలో ఏర్పాటైన మొదటి విగ్రహంగా నిలుస్తుందని అన్నారు. మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించాలన్న ఆలోచన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేష్‌కు రావడం గొప్ప విషయమన్నారు. టిజివి గ్రూప్ తరపున రూ. కోటి విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శ్రావణ్ కుమార్, కొలికిపూడి శ్రీనివాస్, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ పాల్గొన్నారు.



అమరావతిలో పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారా లోకేష్

ఎమ్మెల్యే జయరాం వ్యాఖ్యలు అనుచితం

- ఖండించిన ఎపి రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అనుచిత ప్రవర్తనను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీలు తీవ్రంగా ఖండించాయి. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డిపై అసందర్భంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైందికాదని సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వి వెంకటేశ్వర్లు, ఎం హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుత్తి ప్రాంతంలో సోలార్ ఇండస్ట్రీ కోసం బలవంతంగా రైతుల నుంచి భూములు గుంజుకోవడానికి వ్యతిరేకంగా రైతులను చైతన్య పరుస్తూ గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రభాకర్‌రెడ్డిపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ, సోలార్ కంపెనీలకు ఏజెంటుగా ఎమ్మెల్యే జయరాం ప్రవర్తించారని తెలిపారు. ఓట్లు వేసిన రైతులను మరచి కంపెనీల తరుపున మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన ఉండాల్సిన ఎమ్మెల్యే కంపెనీల పక్కన చేరడం, రైతుల పక్షాన నిలబడిన ప్రభాకర్‌రెడ్డిని బెదిరిస్తూ బూతు పురాణం పారాయణం చేయడాన్ని ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలని కోరారు. సిఎం చంద్రబాబు ఈ ఎమ్మెల్యే అప్రజాస్వామిక చర్యను విచారించి తగిన చర్యలు తీసుకుంటారో లేక మెచ్చుకుంటారో తేల్చుకోవాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై అన్ని మండలాల్లో ఎపి రైతు సంఘాల నాయకులు, ఇతర సంఘాలను కలుపుకుని నిరసనలు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

అప్పులతో మరణించిన రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం

- రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి : వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి నాదెండ్ల (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లాలో అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలను రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు బుధవారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.పది వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అందజేశారు. నాదెండ్ల మండల కేంద్రంలో నాస్యం ఆదినారాయణ, తూబాడులో సిరిబోయిన గోపాలరావు, సత్తెనపల్లి మండలంలో మరోరైతు కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు కుటుంబాలను పరామర్శించిన వారిలో రైతు, కౌలురైతు సంఘాల రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, వై.రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.



ఆదినారాయణ కుటుంబానికి సాయం అందిస్తున్న శోభనాద్రీశ్వరరావు తదితరులు

గోదావరి తగ్గుముఖం

- భద్రాచలం వద్ద 42.09 అడుగులు

ప్రజాశక్తి - యంత్రాంగం

గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద 42.09 అడుగులకు నీటి ప్రవాహం చేరుకుంది. రాత్రికి మొదటి ప్రమాదహెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 10.70 అడుగుల నీటిమట్టం నమోదైంది. బ్యారేజీకి చెందిన 175 గేట్లను ఎత్తి 8,37,974 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. గోదావరికి వరద తగ్గినప్పటికీ ఏలూరు జిల్లాలో గత 15 రోజులుగా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వే ముంపులోనే ఉండటంతో వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలంలోని యడవల్లి వద్ద ఉన్న ఎద్దు వాగు, రుద్రంకోట రహదారి వద్ద ఉన్న సప్తా ముంపులోనే ఉండటంతో రుద్రంకోట, కోయిదా, కట్కూరు, కాకిసినూరు, తాళ్లగొంది, పూచిగొంది తదితర సుమారు 18 గ్రామాలకు రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. విఆర్.పురం మండలంలోని శ్రీరామగిరి, రామవరం, తుష్టివారిగూడెం ముంపుబారిన పడ్డాయి. కూనవరం మండల కేంద్రంలోని శివాలయం వీధికి చెందిన వరద బాధితులను ఆదుకోవాలంటూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక శివాలయం వీధి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 8,61,386 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32.020 మీటర్లు, స్పిల్‌వే దిగువన 23.400 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 32.700 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 22.900 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యాముల మధ్య 15.950 మీటర్లు నమోదైనట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు.



ధవళేశ్వరం కాటన్‌బ్యారేజీ నుంచి సముద్రంలోకి విడుదలవుతున్న వరద

శ్రీశైలం గేట్లు మూసివేత

శ్రీశైలం ఆనకట్ట రేడియల్ క్రస్ట్ గేట్లను ప్రస్తుతం మూసివేశారు. జూరాల నుంచి 1,05,001 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 68,882 క్యూసెక్కులతో కలిపి మొత్తం శ్రీశైలానికి 1,73,883 క్యూసెక్కుల నీరు వస్తోంది. నీటి నిల్వలను పాటిస్తూ, ఎగువ నుంచి వరద ప్రవాహం తగ్గడం శ్రీశైలం గేట్లను అధికారులు మూసివేశారు. రాత్రికి వరద పెరిగితే మరలా గేట్లు ఎత్తే అవకాశం ఉందన్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద తగ్గిన వరద

విజయవాడ ప్రకాశం బ్యారేజీకి 1,88,736 క్యూసెక్కులు వస్తుండగా తూర్పు ప్రధాన కాల్వకు 8731 క్యూసెక్కులు, పశ్చిమ ప్రధాన కాల్వకు 6,830 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. 69 గేట్ల ద్వారా 1,73,175 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. నీటి నిల్వ సామర్థ్యం 12 అడుగులుగా ఉంది.

పోలవరం పునరావాస పనులకు రూ.739 కోట్లతో టెండర్లు

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం పునరావాస కాలనీల ఇళ్ల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన కోసం రూ.739 కోట్లతో టెండర్లు పిలిచామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. పోలవరం నిర్మాణంతోపాటు భూసేకరణ, పునరావాసం పనులకు సమ ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ, పోలవరం పునరావాస పనులపై బుధవారం మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ.. వర్షాకాలం, భారీ వరదల్లో సైతం డివాటరింగ్ చేస్తూ పోలవరం పనులు జరుగుతుండటంపై విదేశీ నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. బట్రస్ డ్యామ్‌తో ఎగువ కాఫర్ డ్యామ్ సీపేజ్‌ను కంట్రోల్ చేసి పనులు చేయగలుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్యాప్-రాక్‌పిల్ పనులపై సంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు, అదే సమయంలో మోడల్ డ్యామ్‌ను పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఏజెన్సీతోపాటు స్వయంగా ఇరిగేషన్‌శాఖ ఏర్పాటు చేసిన క్వాలిటీ కంట్రోల్ లేబరేటరీ, నాణ్యత పరికరాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పోలవరం ఎడమ, కుడి కాల్వల కనెక్టవిటీస్‌కు గ్యాంట్రీస్ సంఖ్యను పెంచి 2026 జూన్ కల్లా పూర్తి చేసేలా ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించేలా పోలవరం ఎడమ ప్రధాన కాల్వ పనులు వేగంగా జరుగుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. జాతీయ రహదారుల క్రాసింగ్ దగ్గర వంతెనల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ జి సాయిప్రసాద్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనరు రామ్‌సుందర్‌రెడ్డి, అడ్వైజరు వెంకటేశ్వరరావు, ఇఎన్‌సి నరసింహమూర్తి, ఎస్ఇ, ఇఇలు, ఏజెన్సీ ప్రతినిధులు హాజరయ్యారు.

సిసి పుటేజిల డివిఆర్ తనిఖీకి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

పోలీస్ స్టేషన్లలో సిసి కెమెరాల పుటేజీ భద్రం చేసిన డిజిటల్ వీడియో రికార్డర్ (డివిఆర్)ను తనిఖీ చేసేందుకు అడ్వకేట్ కమిషన్‌కు అనుమతినివ్వాలని గుంటూరు, కృష్ణా జిల్లాల ఎస్‌పిలకు హైకోర్టు ఆదేశించింది. ఎస్‌పిల ఆఫీసుల నుంచి నిర్దిష్ట అధికారిని సంబంధిత స్టేషన్లకు పంపించాలంది. రెండు జిల్లాల్లోని ఏ స్టేషన్లకైనా అడ్వకేట్ కమిషన్ వెళ్లి తనిఖీలు చేసేందుకు అనుమతినిచ్చింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 18 నెలల సిసిటివి పుటేజ్ భద్రం చేయాల్సి వుందని తెలిపింది. పోలీస్ స్టేషన్లతోపాటు మరో రెండుచోట్ల పుటేజ్‌లను భద్రం చేయాల్సి వుంటుందని గుర్తు చేసింది. విచారణను సెప్టెంబరు 23కు వాయిదా వేస్తూ జస్టిస్ రఘునందన్‌రావు, జస్టిస్ టిసిడి శేఖర్‌తో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది. రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలనే పిల్‌లో హైకోర్టు ఉత్తర్వులు అమలు కాలేదంటూ లాయర్ తాండవ యేగేష్ కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. దీనిపై పోలీసులు అన్ని పిఎస్‌లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని చెప్పారు. దీనిపై హైకోర్టు.. అడ్వకేట్ కమిషన్ వేసింది. సిసి పుటేజీ పరిశీలనకు అనుమతినివ్వడం లేదని కమిషన్ చెప్పడంతో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

చిరుత దాడిలో మృతిచెందిన చిన్నారి కుటుంబానికి మరో రూ.15 లక్షల పరిహారం : టిటిడికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల నడక దారిలో జరిగిన చిరుత దాడిలో మరణించిన చిన్నారి తల్లిదండ్రులకు మరో రూ.15 లక్షల పరిహారం అందజేయాలని టిటిడికి హైకోర్టు విజ్ఞప్తి చేసింది. ఈ మొత్తం చెల్లించడం వల్ల టిటిడికి నష్టమేమీ ఉండదని అభిప్రాయపడింది. బాధిత కుటుంబంలో మార్పుకు వీలుంటుందని చెప్పింది. తిరుపతి నుంచి తిరుమలకు అలిపిరి కాలినడక మార్గంలో యాత్రికుల రక్షణకు తీసుకున్న చర్యలకు టిటిడి సిఫార్సుల అమలు తీరును తెలుసుకునేందుకు కమిటీ వేస్తామంది. వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, అటవీశాఖ, టిటిడి అధికారులతో జాయింట్ యాక్షన్ కమిటీ నివేదిక ఇచ్చింది. యాత్రికుల రక్షణ గురించి కమిటీ దీర్ఘకాలిక, స్వల్పకాలిక సిఫార్సులు ఏ మేరకు అమలు చేసిందో తెలుసుకునేందుకు కమిటీ వేస్తామని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది.

తిరుమల కాలినడక మార్గంలో ఇరువైపులా ఇనుప ఫెన్సింగ్ వేసేలా ఉత్తర్వులివ్వాలంటూ భాను ప్రకాశ్‌రెడ్డి (ప్రస్తుత టిటిడి బోర్డు మెంబర్) వేసిన పిల్‌ను బెంచ్ విచారించింది. నవంబర్‌లో జాయింట్ యాక్షన్ కమిటీ సిఫార్సుల అమలును పరిశీలించేందుకు కమిటీ వేస్తామని ప్రకటించింది.

క్యూలైన్లలో పడిగాపులు పడినా అందని యూరియా

- ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యూరియా కోసం రైతులు క్యూలైన్లలో నిలబడి పడిగాపులు పడుతున్నా ఎలాంటి ఫలితం కనిపించడం లేదని, దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రం అంతటా యూరియా కొరతతో రైతులు అగచాట్లు పడుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణా జిల్లాలో అనేక మండలాల్లో యూరియా కొరత రైతులను పట్టి పీడిస్తుందన్నారు. యూరియా కోసం తెల్లవారుజాము నుంచి క్యూలైన్లలో ఉన్నా ఒక్క కట్ట మాత్రమే లభిస్తుందని చెప్పారు. మొవ్వ మండలం చినముత్తేవి గ్రామంలో దారిమళ్లుతున్న యూరియాను రైతులు అడ్డుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అనేకచోట్ల ఇలాగే ఉంటుందన్నారు.

సవరణ

తేదీ 03.09.2025న పత్రిక మొదటి పేజీలో పతాక శీర్షిక 'తూర్పు తీరానికి లాజిస్టిక్ గేట్' అని ప్రచురితమైంది. 'తూర్పు తీరానికి లాజిస్టిక్ గేట్ వే' అని చదువుకోగలరు. పొరపాటుకు చింతిస్తున్నాము.

ప్రమోషన్ ఛానెల్ నోటిపై కోసం ఎదురుచూపులు

- ఆందోళనలో గ్రామ సర్వేయర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రమోషన్ ఛానెల్ విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిర్ణయం వెలువడకపోవడంతో గ్రామ సర్వేయర్లు ఆందోళన చెందుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సహచరులకు ప్రమోషన్ ఛానెల్‌పై స్పష్టతనిచ్చిన ప్రభుత్వం తమ పట్ల ఎందుకు నాన్చివేత ధోరణి అవలంభిస్తుందోననే ఆందోళన సర్వేయర్లలో వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు ఇందుకు సంబంధించి జిల్లాల వారీ ఎన్ని పోస్టులు ఉన్నాయి? అనే సమాచారాన్ని కూడా ప్రభుత్వం సేకరించలేదనే వాదన కూడా వినబడుతోంది. దీంతోపాటు నేటికీ ప్రొబేషన్ డిక్లేర్ కాక రూ.15 వేలు వేతనంతో పనిచేస్తున్న గ్రామ విలేజ్ సర్వేయర్ల పట్ల ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను గ్రామ సర్వేయర్లు కలిసి వినతిపత్రాలు అందజేసినట్లు సమాచారం. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇంక్రిమెంట్లు ఇప్పటికీ ఇవ్వలేదని వారు ఆందోళన చెందుతున్నారు.

చీటీల పేరుతో రూ.2.39 కోట్లు టోకరా

- చిట్ ఫండ్ కంపెనీ ప్రతినిధుల అరెస్ట్

ప్రజాశక్తి-పిఠాపురం

కాకినాడ జిల్లా పిఠాపురంలో చీటీల పేరుతో రూ.2.39 కోట్లకు చిట్‌ఫండ్ కంపెనీ టోకరా వేసింది. 94 మంది ఖాతాదారులను మోసగించిన కేసులో శ్రీసత్య శివాని చిట్‌ఫండ్ కంపెనీ ప్రతినిధులను అరెస్టు చేసినట్లు సిఐ జి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీసత్య శివాని చిట్‌ఫండ్ కంపెనీని 2014లో కుర్రా సత్యనారాయణ, పక్కుర్తి వరహాలరావు, లోకారెడ్డి భాస్కరరావు ప్రారంభించారు. 2023లో చీటీలు పాడుకున్న వారికి సొమ్ములు చెల్లించకపోవడంతో ఖాతాదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంపెనీ ప్రతినిధులు కొర్రా సత్యనారాయణ, లోకారెడ్డి భాస్కరరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ పేర్కొన్నారు.

కరేడులో బలవంతపు భూసేకరణ ఆపాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్

ప్రజాశక్తి-కందుకూరు

నెల్లూరు జిల్లా కరేడులో ఇండోసోల్ కంపెనీ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న బలవంతపు భూసేకరణను వెంటనే నిలుపుదల చేయాలని, ఆందోళనకారులపై పెట్టిన కేసులు, 30 యాక్ట్ ఎత్తివేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కటారి అజయ్ కుమార్ మాట్లాడుతూ గిరిజన మహిళలపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి వారిని జైలుకు పంపించడం దుర్మార్గమన్నారు. కరేడు గ్రామ రైతుల తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం గౌరవించి భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని, రైతులు, ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ...అభివృద్ధి పేరుతో రైతుల నుంచి భూములు సేకరించి ఎటువంటి కంపెనీలు ఏర్పాటు చేయడం లేదన్నారు. ఎదురుతిరిగిన రైతులపై అక్రమ కేసులను బనాయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎం లలిత కుమారి, కరేడు భూ పోరాట నాయకులు మిరియం శ్రీనివాసులు, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఆర్ మోహన్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి సిహెచ్ సాగర్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కనపర్తి శివరాం తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలు సొంత ఆదాయం పెంచుకోవాలి

- ఆర్థిక సంఘం సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్థానిక సంస్థలను వాటి ఆదాయం ఆధారంగా వివిధ కేటగిరీలుగా గుర్తించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. వాటి ఆదాయ వనరులను కూడా పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. 5వ రాష్ట్ర ఆర్థిక సంఘంపై బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు.

స్థానిక సంస్థలకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చే నిధులకు అదనంగా సొంత ఆదాయాన్ని పెంచుకునే దిశగా కూడా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే వెనుకబడిన, తలసరి ఆదాయం తక్కువగా ఉన్న వాటిని గుర్తించడం ద్వారా వాటి ప్రత్యేక సాయం అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఇలా స్థానిక సంస్థల వర్గీకరణను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. దీనికి చట్టసవరణ కూడా చేయాల్సి ఉంటుందని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ప్రతియేటా పంచాయతీలకు అందుతున్న ఉపాధి హామీ నిధులతోపాటు, ఇతర రూపాల్లో అందే నిధులను క్రోడీకరించాలని అధికారులకు సూచించారు. అలాగే పంచాయతీలకు కావాల్సిన అవసరాలను కూడా గుర్తించాలని, తద్వారా వాటికి ఎంతవరకు నిధులు సమకూర్చాలన్నది కూడా తెలుస్తుందన్నారు.

ఉపాధి నిధులపై ఆరా

కేంద్రం నుంచి పంచాయతీలకు భారీగా ఉపాధి హామీ నిధులు వస్తాయని, వాటితో ఎటువంటి ఆస్తుల కల్పన జరుగుతోందో లేదోనన్న విషయాలను గుర్తించాలని సూచించారు. దీనిని నిరంతరం అధ్యయనం చేస్తూ స్థానిక సంస్థలు స్వయం సమృద్ధి సాధించేలా చూడాలని పేర్కొన్నారు. అలాగే పట్టణ స్థానిక సంస్థలు కూడా ఆర్థికంగా బలోపేతమయ్యేలా చూడాలన్నారు. వాటికి కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించాలన్నారు. కేంద్రం ఇచ్చే నిధులకు రాష్ట్ర వాటా నిధులను కూడా మరింత ఎక్కువగా అందించేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థల అభివృద్ధికి అక్కడి ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు కూడా కష్టపడాలని హితవు పలికారు.

ఆదాయ వ్యయ లెక్కలు తేల్చాలి : పవన్

రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థలకు సంబంధించి 2019-2024 మధ్య కాలంలో ఆదాయంపై లెక్కలు తేల్చాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. ఎంత వరకు ఆస్తి పన్ను వసూళ్లు జరిగాయి, ఇంకా ఎంత బకాయిలు ఉన్నాయన్నది తేల్చాలని స్పష్టం చేశారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నుల వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. గ్రామాల్లో పౌల్ట్రీ పరిశ్రమపై అధ్యయనం చేయాలని సూచించారు.

ఆర్థిక సంఘం నివేదిక సమర్పణ

స్థానిక సంస్థలకు సంబంధించిన ఆదాయం లోటుపై ఆర్థిక సంఘం తన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించింది. 2023-24 సంవత్సరంలో ఆదాయం కన్నా వ్యయం 111 శాతం అధికంగా ఉన్నట్లు అధికారులు నివేదికలో పేర్కొన్నారు. జీతాలు, పింఛన్లు, వడ్డీలకు అదనపు వ్యయం అవుతోందన్నారు. 2025-26 నుంచి 2029-30 వరకు పంచాయతీ వ్యవస్థల్లో లోటు రూ.7,033 కోట్లు ఉంటుందని, పట్టణ స్థానిక సంస్థల్లో లోటు రూ.2,016 కోట్లు ఉంటుందని గుర్తించారు. ఆస్తి పన్ను వసూళ్లలో డిమాండ్, వసూళ్ల మధ్య భారీగా వ్యత్యాసం ఉందని నివేదికలో పేర్కొన్నారు. పంచాయతీలకు గత ప్రభుత్వ హయాంలో రూ.5,851 కోట్ల వరకు విద్యుత్ బకాయిలు చెల్లించలేదని నివేదికలో పొందుపరిచారు. ఈ సమావేశంలో ఆర్థిక సంఘం ఛైర్‌పర్సన్ రత్నకుమారి, సభ్యులు కృపారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సిలో 152 మంది మైనార్టీ అభ్యర్థుల ఎంపిక

- మంత్రి ఫరూక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోటీ పరీక్షలకు హాజరయ్యే మైనార్టీ అభ్యర్థులకు సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ (సిఇడిఎం) ఆధ్వర్యాన ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ తెలిపారు. మెగా డిఎస్‌సిలో సిఇడిఎం ఆధ్వర్యాన శిక్షణ పొందిన 152 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైనట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీ సంక్షేమశాఖ నేతృత్వంలో కేంద్ర, రాష్ట్ర స్థాయిలో భర్తీ చేసే వివిధ ఉద్యోగాలకు జరగబోయే పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే మైనార్టీ విద్యార్థులకు ప్రముఖ కోచింగ్ సెంటర్లలో నైపుణ్యం కలిగిన సిబ్బందితో శిక్షణ ఇస్తున్నామన్నారు. మెగా డిఎస్‌సి పరీక్షలకు సిఇడిఎం పర్యవేక్షణలో 1,780 మంది మైనార్టీ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో 1,200 మంది అభ్యర్థులు అర్హత కంటే ఎక్కువ మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఉచిత శిక్షణను సమర్థవంతంగా వినియోగించుకుని విజయం సాధించి ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన 152 మందిని ఆయన అభినందించారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎక్కువ మందికి సులభంగా సేవలు చేరేందుకు ఆన్‌లైన్ విధానంలో శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.



రబీలో నల్లబర్లీ సాగుపై నిషేధం

- త్వరలో జిఓ 740 విడుదల : మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రబీ సీజన్‌లో నల్లబెర్లీ పొగాకును ఎవరూ పండించకూడదని, ఇందుకు జిఓ 740ను విడుదల చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. కంపెనీలతో ఎంఒయు చేసుకున్న రైతులు మాత్రమే తెల్లబర్లీ పొగాకును పండించాలన్నారు. నల్లబర్లీ పంటకు ప్రత్యామ్నాయంగా మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న వంటి పంటలను వేయాలని రైతులకు సూచించారు. వెలగపూడిలోని సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో పొగాకు, పత్తి కొనుగోళ్లపై సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులు పండించిన నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పొగాకు కొనుగోళ్లు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్‌లో సమయానికి పంట కొనుగోళ్లు జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలో నల్లబర్లీ పొగాకు 80 మిలియన్ కిలోలు పండించారని, ఇప్పటి వరకూ 22 కంపెనీలు 40 మిలియన్ కిలోలు కొన్నారని, అదే విధంగా 15 మిలియన్ కిలోలు ఎపి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసినట్లు చెప్పారు. మిగిలిన పొగాకులో 20 మిలియన్ కిలోలు ప్రైవేటు సంస్థలు, 5 మిలియన్ కిలోలు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఖరీఫ్‌లో పండించిన పత్తి కొనుగోళ్లపై కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) దృష్టి సారించాలని సూచించారు. పత్తి సాధారణ విస్తీర్ణం 5.28 లక్షల హెక్టార్లు ఉండగా, 4.02 లక్షల హెక్టార్లలో సాగు చేశారన్నారు. దాదాపు 7.12 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి ఉంటుందని అంచనా వేసినట్లు చెప్పారు. అక్టోబరు ఒకటి నుంచి కాటన్ సిసిఐ కనీస మద్దతు ధరకు రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయాలన్నారు. ఈ సమీక్షలో వ్యవసాయ, మార్క్‌ఫెడ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

లోకాయుక్తను నియమించకపోవడంపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో లోకాయుక్తను నియమించకపోవడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను హైకోర్టు బుధవారం విచారించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. గతేడాది సెప్టెంబర్ 16 నుండి లోకాయుక్త పోస్టును ప్రభుత్వం భర్తీ చేయలేదంటూ న్యాయవాది తాండవ యేగేష్ దాఖలు చేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిఎడి కార్యదర్శులకు నోటీసులిచ్చింది. లోకాయుక్త నియామకం అంశంపై ప్రభుత్వం చట్ట సవరణలు చేసిందని ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పారు. వాటి వివరాలు అందజేస్తామన్నారు. పిటిషనర్ న్యాయవాది వాదిస్తూ, లోకాయుక్త పదవీ కాలం ముగింపునకు ఆరు నెలల ముందే కొత్త లోకాయుక్త నియామక ప్రక్రియ జరగాల్సి వుందన్నారు.

కొనసాగుతోన్న అల్పపీడనం

- ఉత్తరాంధ్రలో మోస్తరు వర్షాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వాయువ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ఉత్తర ఒడిశా తీరంలో కేంద్రీకృతమై ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఇది రాబోయే 24 గంటల్లో పశ్చిమ - వాయువ్య దిశగా, ఉత్తర ఒడిశా, దానిని ఆనుకుని ఉన్న ఝార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గడ్ వైపు కదిలేందుకు అవకాశం ఉందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీని ప్రభావంతో గురువారం శ్రీకాకుళం, విజనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. మరోవైపు గోదావరి వరద ప్రవాహం స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 40.7 అడుగులు, ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 8,67,660 క్యూసెక్కులు నమోదైందని తెలిపారు. కృష్ణానది వరద తగ్గుముఖం పట్టిందని, ప్రకాశం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 76,216 క్యూసెక్కులుగా ఉందని పేర్కొన్నారు.

8 మందికి డిఎస్‌పిలుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 8 మంది సిఐలను డిఎస్‌పిలుగా ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. ఈ మేరకు డిజిపి హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో ఏలూరు రేంజ్ నుంచి పి శ్రీనివాస్, పి ఈశ్వరుడు, కర్నూలు రేంజ్ నుంచి బివి శ్రీనివాసులు, బివి మధుసూదనరావు, గుంటూరు రేంజ్ నుంచి ఎం వెంకట సుబ్బారావు, కె వెంకటేశ్వర్లు, బెల్లం శ్రీనివాసరావు, సిహెచ్ చంద్రమౌళి ఉన్నారు.

ఉల్లి రైతులకు నష్టాల ఘాటు

- గతేడాది కంటే భారీగా ధర పతనం
- ప్రభుత్వం రూ.1200కు కొన్నా నష్టమే
- గిట్టుబాటు ధర కల్పించాలని వేడుకోలు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి



దేవనకొండ మండలంలో ఉల్లిని గ్రేడింగ్ చేస్తున్న రైతులు

ఉల్లి రైతులను నష్టాల ఘాటు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ధర భారీగా పతనమైంది. మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాలు ఉల్లిని రూ.1,200 చొప్పున కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ధరకు ఇప్పటికే కొంత సరుకును కొనుగోలు చేసింది. అయితే, ఈ ధర తమకు ఏ మాత్రమూ గిట్టుబాటు కాదని రైతులు చెప్తున్నారు. పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉందని, తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో ఉల్లి సాధారణ సాగు 43,817 ఎకరాలు కాగా, ఈ ఏడాది 26,696 ఎకరాల్లో సాగైంది. ఎకరం విస్తీర్ణంలో ఉల్లి సాగుకు రూ.1.50 లక్షల పెట్టుబడి అవుతోంది. ఇటీవల వరకు వర్షాలు కురవడంతో పంట పాడవుతుందని రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ఉల్లిని దాచుకోవడానికి, అమ్ముకోవడానికి ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం వర్షాలు తెరిపివ్వడంతో వెంటనే విక్రయించుకుంటున్నారు. మళ్లీ వర్షాలు పడితే ఉల్లి కుళ్లిపోతుందనే భయం వారిని వెంటాడుతుండడంతో కోతలపై దృష్టి పెట్టారు.

గతేడాది ఆగస్టులో 17,102 క్వింటాళ్ల ఉల్లి కర్నూలు మార్కెట్‌కు రాగా, ఈ ఏడాది ఆగస్టులో 40,785 క్వింటాళ్ల పంట వచ్చింది. గతేడాది గరిష్టంగా క్వింటాలుకు రూ.3,989 రాగా, ఈ ఏడాది రూ.1,599 మాత్రమే లభించింది. గతేడాది కనిష్టంగా క్వింటాలుకు రూ.679 రాగా, ఈ ఏడాది రూ.501కు పడిపోయింది. ఉల్లి రైతుల కష్టాలు, నష్టాలపై పత్రికల్లో వచ్చిన కథనాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాలు రూ.1,200 చొప్పున కొనుగోలు చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ కర్నూలు మార్కెట్ యార్డ్‌లో మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోలును ప్రారంభించారు. సెప్టెంబర్ నెల మొత్తం ఈ సంస్థ ద్వారానే ఉల్లిని అదే ధరకు కొనుగోలు చేస్తామని ప్రకటించారు. ఎకరాకు 70 క్వింటాళ్ల ఉల్లి దిగుబడి వస్తోంది. క్వింటాలు రూ.1,200 లెక్కన కొంటే రైతుకు రూ.84 వేలు మాత్రమే లభిస్తుంది. ఎకరా ఒక్కంటికీ రూ.66 వేల నష్టం వస్తోంది. తమకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు. సెప్టెంబర్ మధ్యలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు ఆపేసినా, అక్టోబర్‌లో కొనుగోలు చేయకపోయినా రైతుకు నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు నిర్ణయం ఆలస్యం కావడంతో కొందరు రైతులు అప్పటికే తమ పంటను మరింత తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చింది.

తర్వాతే డబ్బులు జమ

మెత్తబడిన, తడిసిన, కుళ్లిన ఉల్లిని వేరు చేసి తేవాలని మార్క్‌ఫెడ్ అధికారులు చెప్తున్నారు. రైతులు ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ నంబరు, ఇ-పాస్ రిసిప్ట్ ఇస్తే సరుకును తీసుకొని రశీదు ఇస్తున్నారు. వారం రోజుల్లో డబ్బులు జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు. సకాలంలో ప్రభుత్వం డబ్బులు జమ చేయకపోతే ధాన్యం బకాయిలులాగ ఉల్లి బకాయిలూ మిగిలిపోయే అవకాశం ఉందనే ఆందోళన రైతుల్లో ఉంది.

క్వింటాలుకు రూ.3 వేలు ఇవ్వాలి



గతంలో ఇస్తామన్న బోనస్ ఇవ్వకుండా టిడిపి కూటమి ప్రభుత్వం మోసగించింది. క్వింటాలుకు రూ.1,200 ధర ఇచ్చినట్లు సంకలు గుద్దుకుంటోంది. క్వింటాలుకు రూ.2 వేల ఇచ్చినా గిట్టుబాటు కాదు. సుంకాలు తగ్గించి ఎగుమతులు పెంచాలి. కనీసం రూ.3 వేలకు ఉల్లిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

- జి.రామకృష్ణ, ఏపి రైతు సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి

రూ.3 లక్షలు నష్టం వచ్చింది



నేను మూడు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాను. రూ.4.50 లక్షలు పెట్టుబడి అయింది. ఎకరాకు 70 క్వింటాళ్ల చొప్పున 210 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం రూ.1,200తో కొంటుందని ప్రకటించకముందు క్వింటాలు రూ.550 చొప్పున అమ్మేశాను. మొత్తంగా రూ.1,15,500 మాత్రమే వచ్చింది. రూ.3 లక్షలకుపైగా నష్టం వచ్చింది.

- కౌలుట్లయ్య, కప్పట్రాళ్ల, దేవనకొండ మండలం



మాట్లాడుతున్న పుణ్యవతి

మహిళా హక్కుల సాధనకు ఐక్యమవ్వాలి

- ఐద్వా జాతీయ నాయకులు పుణ్యవతి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తమ హక్కులను సాధించుకునేందుకు మహిళలు ఐక్యమవ్వాలని ఐద్వా జాతీయ నాయకులు పుణ్యవతి పిలుపునిచ్చారు. అనతంపురంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. తీసుకున్న అప్పులు చెల్లించలేదని మైక్రోఫైనాన్స్ ఏజెంట్లు పెడుతున్న ఇబ్బందులకు మహిళలు ఆత్మహత్యలు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. దీనిపై దేశ వ్యాప్తంగా ఐద్వా సర్వే నిర్వహించిందని చెప్పారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆగడాల నుంచి రక్షణ కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 13, 14, 15వ తేదీల్లో అనంతపురం నగరంలో ఐద్వా రాష్ట్ర మహాసభ జరగనుందని, జయప్రదం చేయాలని కోరారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

లిడ్‌క్యాప్ భూముల అభివృద్ధి

- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉన్న లిడ్ క్యాప్ భూములను పిపిపి మోడ్‌లో అభివృద్ధి చేసేందకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. వెలగపూడిలోని సచివాలయంలో లిడ్ క్యాప్ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లిడ్ క్యాప్ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని అధికారులను ఆదేశించారు. తిరుపతి, విజయవాడ నగరాల్లో ఉన్న లిడ్ క్యాప్ భూముల్లో మల్టీపర్పస్ కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణంపై ముఖ్యమంత్రితో చర్చించిన అనంతరం విధి విధానాలను రూపకల్పన చేయనున్నట్లు చెప్పారు. తిరుపతి ఎస్‌వి ఆటోనగర్‌లో 4.5 ఎకరాలు, విజయవాడ జవహర్ ఆటోనగర్‌లో ఎకరం లిడ్ క్యాప్ భూముల్లో మల్టీపర్పస్ కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేసే అంశంపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్, లిడ్ క్యాప్ ఎమ్‌డి ప్రసన్న వెంకటేష్, ఇడి టివిఎస్ ప్రసాదరావు, సునీల్‌రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మా భూముల జోలికొస్తే ఖబడ్దార్

- హైడ్రో ప్రాజెక్టు కోసం పాతిన దిమ్మలను పగలకొట్టిన ఆదివాసీలు
- జిఒ 51 రద్దు తర్వాతనే మాడగడ పండుగకు పవన్ రావాలని డిమాండ్

ప్రజాశక్తి - అరకులోయ (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లా అరకులోయ మండలం బస్కీ పంచాయతీలోని 12 గ్రామాల పరిధిలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం నవయుగ సంస్థ ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మలను ఆదివాసీలు తమ సంప్రదాయ ఆయుధాలతో బుధవారం ధ్వంసం చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులకు అనుమతులిస్తూ జారీ చేసిన జిఒ నెంబర్ 51ను రద్దు చేసిన తరువాతనే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అరకు లోయలోని మాడగడ బలి పండగకు రావాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల పేరిట తమ భూముల జోలికొస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అరకులోయ వైస్ ఎంపిపి కిల్లో రామన్న అధ్యక్షతన జరిగిన సభలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, బస్కీ సర్పంచ్ పాడి రమేష్, ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు రామారావు, మాజీ ఎంపిటిసి సభ్యులు దశరథ్ మాట్లాడారు.



హైడ్రో ప్రాజెక్టు కోసం ఏర్పాటు చేసిన దిమ్మను పగలకొడుతున్న ఆదివాసీలు

స్థానికంగా నిర్మిస్తున్న హైడ్రో ప్రాజెక్టుతో బస్కీ పంచాయతీ పరిధిలోని దేవరపల్లి, బొడగూడ, ఇరుకుగుడ, గిర్లిగూడ, బంవుసుగుడ, గొందిగూడ, బస్కీ, జకారవలస, పిరిపోదోర్, గొందన, బిజ్జగూడ, బరెంగిబంధ, కొంత్రయిగూడ, కొర్రగూడ గ్రామాల్లోని సుమారు 900 ఆదివాసీ కుటుంబాల జీవితాలు ఛిద్రమవుతాయన్నారు. వేల ఎకరాల జిరాయితీ సాగుభూములు, అటవీ భూములు, కాఫీ, మిరియాల తోటలు జలసమాధి అవుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా జిఒ నెంబర్ 51ని విడుదల చేసి నవయుగ, అదాని కంపెనీలకు ఐదో షెడ్యూల్ ఏరియాలో ఆదివాసీల హక్కులు, చట్టాలను ఉల్లంఘించి అడవులు, భూములను కట్టబెట్టడం దారుణమన్నారు. కార్యక్రమంలో బస్కీ మాజీ సర్పంచ్ కామరాజు, మాజీ ఎంపిటిసి సభ్యులు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలు డోర్ డెలివరీ

- మంత్రి సవిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంప్రదాయ వస్త్రాలతోపాటు రెడీమేడ్ చేనేత దుస్తుల అమ్మకాలు నేరుగా వినియోగదారుల ఇళ్లకే డోర్ డెలివరీ చేసే విధానాన్ని తీసుకొచ్చామని బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత తెలిపారు. ఇందులో భాగంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జియోమార్ట్ సంస్థలతో అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. రోజురోజుకూ చేనేత వస్త్రాల వినియోగం పెరిగిందన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. నేతన్నలకు 365 రోజులు ఉపాధి లక్ష్యమని పేర్కొన్నారు. నేతన్నల అభివృద్ధికి ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరోవైపు చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. పోచంపల్లి, ధర్మవరం, మంగళగిరి పట్టు చీరలతోపాటు రెడీమేడ్ దుస్తులను కూడా ఆప్కో షోరూమ్‌లతో పాటు ఆన్‌లైన్‌లోనూ ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందన్నారు.



టిటిడికి బస్సును అందజేసిన దాతలు

టిటిడికి విద్యుత్ బస్సు విరాళం

ప్రజాశక్తి - తిరుమల:

టిటిడికి బుధవారం విద్యుత్తు బస్సు విరాళంగా అందింది. చెన్నైకి చెందిన స్విచ్ మొబిలిటీ ఆటోమోటివ్ లిమిటెడ్ సిఇఒ గణేష్ మణి, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వెంకటరమణ రూ.1.33 కోట్ల విలువైన విద్యుత్తు బస్సును ఇచ్చారు. ఈ మేరకు శ్రీవారి ఆలయం ఎదుట వాహనం తాళాలను అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణ, తిరుమల డిఐ వెంకటాద్రి నాయుడు పాల్గొన్నారు.



పామర్రులో ఎరువుల కోసం ఎదురుచూస్తున్న రైతులు

ఎరువుల కోసం రైతుల పడిగాపులు

ప్రజాశక్తి - విజయవాడ

కృష్ణా జిల్లాలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోపిదేవిలో బుధవారం తెల్లవారుజాము నుండే యూరియా కొరకు రైతులు పడిగాపులుకాశారు. ఒక్కో రైతుకూ రెండు యూరియా కట్టలు మాత్రమే అధికారులు పంపిణీ చేశారు. మధ్యాహ్నానికి యూరియా అయిపోవడం వల్ల చాలామంది రైతులు వెనుతిరగాల్సి వచ్చింది. పామర్రులోని గ్రోమోర్ ఎరువుల విక్రయ కేంద్రం వద్దకు అధిక సంఖ్యలో రైతులు చేరుకుని ఎరువుల కోసం బారులుతీరారు. కొందరు మహిళల రైతులు కూడా యూరియా కోసం క్యూలో నిల్చున్నారు. రద్దీ పెరగడంతో తోపులాట చోటుచేసుకుంది. ట్రైనీ ఎస్ఐ సత్యకళ తన సిబ్బందితో అక్కడకు వచ్చి రైతులను వరుస పద్ధతిలో నిలబెట్టారు. వ్యవసాయ అధికారిణి శివ నాగవాణి తన సిబ్బందితో ఎరువుల విక్రయ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఒక్కోక్క రైతుకి ఒక యూరియా కట్ట చొప్పున పంపిణీ చేశా రు. ఉయ్యూరు మనగ్రోమోర్ షాపునకు యూరియా లోడు వచ్చినట్టు సమాచారం మేర మండల పరిధి గ్రామాల రైతులు ఉదయాన్నే పెద్దఎత్తున తరలివచ్చి క్యూలో నిల్చున్నారు. మండల వ్యవసాయ అధికారి నిస్సీగ్రేస్, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో క్యూలో ఉన్న రైతులకు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం చూసి కూపన్లు ఇచ్చి ఎకరాకు అరకట్ట చొప్పున యూరియా పంపిణీ చేశారు.. మన గ్రోమోర్‌కు 35 టన్నుల యూరియా వచ్చిందని, ఎకరానికి అరకట్ట చొప్పున 20 ఎకరాలు అంత కంటే ఎక్కువ పొలం సాగుచేస్తున్నవారికి ఎనిమిది కట్టలు మించకుండా పంపిణీ చేస్తున్నామని నిస్సీగ్రేస్ తెలిపారు.

యూరియా కూడా ఇవ్వలేకపోతున్నారు

- వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో/పులివెందులటౌన్



జగన్‌ను కలసి సమస్యలు వివరిస్తున్న వైసిపి నాయకులు

భవిష్యత్తుకు గ్యారంటీ ఓటేయాలని కోరిన కూటమి నాయకులు అధికారంలోకి రాగానే రైతులకు యూరియా కూడా ఇవ్వలేకపోతున్నారని, అధ్వానంగా ప్రభుత్వాన్ని నడుపుతున్నారని వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు బుధవారం సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ రెండేళ్లపాటు రైతులకు వరుసగా ఎరువుల కష్టాలు వచ్చాయని తెలిపారు. క్యూలో నిలబడే దారుణ పరిస్థితిని సృష్టించారని పేర్కొన్నారు. ఉల్లి, చీనీ, మినుము ధరలు కూడా పతనమై రైతులు లబోదిబోమంటున్నారని అన్నారు. ఏటా ఎంత పరిమాణంలో ఎరువులు కావాలనేది సమాచారం ఉన్నా సమస్య ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. కిందిస్థాయిలో టిడిపి నాయకులు ఎరువులను దారి మళ్లించి అదనపు ధరకు అమ్ముకుంటున్నారని తెలిపారు. అక్రమ నిల్వలపైనా తనిఖీలు లేవని, పిఎసిఎస్, ఆర్‌బికెలకు కేటాయింపులూ లేవని ఆరోపించారు. పంటలకు గిట్టుబాటు ధరలేక లబోదిబోమంటు న్నారని పేర్కొన్నారు. ధరలు పతనమైనప్పుడు వైసిపి హయాంలో ప్రభుత్వమే జోక్యం చేసుకుని గిట్టుబాటు ధర కల్పించిందని తెలిపారు. ఐదేళ్ల కాలంలో రైతులకు ఇలాంటి కష్టకాలం వచ్చినప్పుడు 9,025 టన్నుల ఉల్లిని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు తోడుగా నిలబడిందని పేర్కొన్నారు. చీనీ ధర టన్ను రూ.6 వేల నుంచి రూ.12 వేలకు పడిపోయిందన్నారు. ధరల స్థిరీకరణ నిధికి ఎగనామం పెట్టారని పేర్కొన్నారు. వైసిపి హయాంలో రూ.7,802 కోట్లు ఖర్చుచేసి రైతులకు తోడుగా నిలబడితే ఆ విధానానికి మంగళం పాడారన్నారు.

జగన్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలి : సజ్జల

వైసిపి నిర్మాణంలో జగన్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని, ఐటి వింగ్ క్రియాశీలక పాత్ర పోషించాలని ఆ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. సాంకేతికతను వాడుకుంటూ ఏ విధమైన మెకానిజం ఉండాలన్న దానిపైనా ఆలోచన చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైసిపి ఐటి వింగ్ అధ్యక్షులు పోశంశెట్టి సునీల్, చిట్యాల విజయ్‌భాస్కరరెడ్డి, గుడివాడ అమర్‌నాథ్, లేళ్ల అప్పిరెడ్డి, పూడి శ్రీహరి, ఆలూరి సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చేవన్నీ మంచి రోజులే : వైఎస్ జగన్

కొద్ది రోజులు ఓపిక పట్టండి... వచ్చేవన్నీ మంచి రోజులే అని వైసిపి నాయకులకు మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం తన నివాసం వద్ద నియోజకవర్గంలోని పలువురు ముఖ్య నేతలు ఆయనను కలిశారు. టిడిపి కూటమి నాయకుల దౌర్జన్యాలు, అరాచకాలు ఎక్కువయ్యాయని జగన్ దృష్టికి వారు తీసుకువచ్చారు. బాధలు, కష్టాలు, సమస్యలు కొద్ది రోజులేనని, తాను ఉన్నానంటూ ధైర్యం చెప్పారు.

ముగిసిన పర్యటన

పులివెందులలో మూడు రోజుల పర్యటన బుధవారంతో ముగిసింది. తన తండ్రి 16వ వర్ధంతి సందర్భంగా పులివెందులకు వచ్చిన ఆయన మొదటిరోజు ప్రజా దర్బార్ నిర్వహించారు. రెండో రోజు ఇడుపులపాయకు వెళ్లి తన తండ్రి సమాధికి నివాళులర్పించారు. అనంతరం తాళ్లపల్లి గ్రామంలో ఉల్లి పంటను పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఆ తర్వాత అంబకపల్లి గంగమ్మ కుంటలోని కృష్ణా జలాలకు హారతి ఇచ్చి , క్యాంపు కార్యాలయానికి వచ్చి రాత్రి వరకు ప్రజాదర్బార్ నిర్వహించారు. మూడో రోజు బుధవారం పలువురు ముఖ్య నేతలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బెంగళూరుకు వెళ్లిపోయారు.

చేతబడి నెపంతో వృద్ధుని హత్య

ప్రజాశక్తి - పలాస

మూఢనమ్మకాలకు వృద్ధుడు బలైన ఘటన శ్రీకాకుళంలో చోటుచేసుకుంది. చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో పలాస మండలం కేశపురానికి చెందిన ఉంగ రాములు (80)ను అదే గ్రామానికి చెందిన కొందరు రాళ్లు, కర్రలతో దాడి చేసి చంపారు. పోలీసులు, మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు... కేశపరానికి చెందిన ఎ.తులసీరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబసభ్యులు సంతబొమ్మాళి మండలం బోరుభద్రకు చెందిన ఓ మంత్రగాడిని సంప్రదించారు. తులసీరావుతో పాటు గ్రామంలో మరికొంతమంది అనారోగ్యానికి గ్రామంలోని రాములు చేతబడే కారణమని మంత్రగాడు చెప్పాడు. రాములుపై అనుమానంతో తులసీరావు కుటుంబసభ్యులు, బంధువులు మంగళవారం అర్ధరాత్రి ఆయనపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. దీంతో రాములు అక్కడికక్కడే మృతి చెందారు. రక్తపుమడుగులో పడి ఉన్న మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించి.. నిందితులను పోలీసులు విచారిస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-యర్రగొండపాలెం (ప్రకాశం)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..పాలుట్ల గ్రామానికి చెందిన రైతు దేశవత్ రాములు నాయక్ (40) గత ఏడాది మిర్చి, పత్తి పంటలు సాగు చేశారు. పెట్టిన ఖర్చుకు తగిన దిగుబడి రాకపోవడంతో సుమారు రూ.ఆరు లక్షల వరకు అప్పులు మిగిలాయి. అప్పులు తీర్చుదారిలేక మంగళవారం అర్ధరాత్రి పురుగుమందు తాగారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే యర్రగొండపాలెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మరణించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిటిడి శ్రీవారి సేవలో కీలక మార్పులు

- సేవకు సంబంధించి వెబ్‌సైట్‌లో నూతన మాడ్యూల్‌ని ప్రారంభించిన చైర్మన్

ప్రజాశక్తి- తిరుమల

వలంటీర్లకు శ్రీవారి సేవకులుగా శిక్షణ ఇచ్చే ట్రైనర్స్ కోసం 'ట్రైనర్ అండ్ గ్రూప్ సూపర్వైజర్ మాడ్యూల్' ద్వారా నమోదుకు టిటిడి అవకాశం కల్పించింది. సిఎం చంద్రబాబు నాయుడు సూచన మేరకు శ్రీవారి సేవలో పలు సంస్కరణలు చేస్తున్నామని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. శ్రీవారి యాత్రికులకు స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు శ్రీవారి సేవ పథకాన్ని 2000 సంవత్సరంలో ప్రారంభించారని, దాదాపు 17 లక్షల మంది శ్రీవారి సేవకులు స్వచ్ఛందంగా పాల్గొన్నారని, వారికి శ్రీవారి దర్శనం, లడ్డూ ప్రసాదం, వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. తిరుమలలోని అన్ని విభాగాలలో వారు తమ సేవలను అందిస్తున్నారని తెలిపారు. ఐఐటి అహ్మదాబాద్, రాష్ట్ర ప్రభుత్వ డైరెక్టర్ ఆఫ్ ప్లానింగ్ వారి ఆధ్వర్యంలో సేవకులకు సంయుక్తంగా శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ శిక్షణలో ప్రధానంగా శ్రీవారి వైభవం, తిరుమల ప్రాముఖ్యత, యాత్రికులకు టిటిడి అందిస్తున్న సేవలు, సేవాతత్వం తదితర అంశాలపై శిక్షణ అందిస్తామని తెలిపారు. 45-65 సంవత్సరాల వయసు ఉన్న సేవకులతో గ్రూప్ సూపర్ వైజర్స్ విధానం తీసుకొచ్చామని చెప్పారు. వారి సేవా కాలపరిమితి 15 రోజులు, 30 రోజులు, 90 రోజులు ఉంటుందని, విద్యార్హత కనీసం డిగ్రీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. శ్రీవారి సేవా ట్రైనర్స్ ద్వారా సేవకులకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. మూడు రోజుల పాటు శిక్షణ, ఒక రోజు ఫీల్డ్ విజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. సిఎం చంద్రబాబు సూచనల మేరకు టిటిడిలోని స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద, చిన్న పిల్లల ఆస్పత్రి, అశ్వినీ ఆస్పత్రులలో శ్రీవారి సేవ ద్వారా రోగులకు ఉచితంగా సేవలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. విదేశాలలో ఉన్న ఎందరో ఎన్‌ఆర్‌ఐ నిపుణులు శ్రీవారి సేవలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారని, వివిధ వృత్తులలో ప్రావీణ్యం కల్గిన నిపుణులకు శ్రీవారి సేవకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. శ్రీవారి సేవకు హిందువులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సెన్సెక్స్ 400 పాయింట్ల పెరుగుదల

ముంబయి : జిఎస్‌టి కౌన్సిల్ సమావేశాల్లో పలు ఉత్పత్తులపై పన్నులను తగ్గించనున్నారని.. శ్లాబులను రెండింటికి కుదించనున్నారనే అంచనాల్లో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ఈ నేపథ్యంలోనే బుధవారం బిఎస్ఇ సెన్సెక్స్ 409.83 పాయింట్లు లేదా 0.51 శాతం పెరిగి 80,567.71కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 50 134.45 పాయింట్లు లేదా 0.55 శాతం లాభపడి 24,715 వద్ద ముగిసింది. మిడ్‌క్యాప్ సూచీ 0.69 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.89 శాతం చొప్పున రాణించాయి. రంగాల వారిగా లోహ సూచీ 3.11 శాతం, ఫార్మా 1.10 శాతం, పిఎస్‌యు బ్యాంకింగ్ 1.03 శాతం చొప్పున లాభపడ్డాయి.

సామ్‌సంగ్ నుంచి బెస్పోక్ ఎఐ వాషర్ డ్రైయర్ ఉత్పత్తులు

గుర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా ఆధునిక భారతీయ గృహాల కోసం స్మార్టర్, వేగవంతమైన లాండ్రీ సేవలను అందించడానికి బెస్పోక్ ఎఐ వాషర్ డ్రైయర్ శ్రేణీ ఉత్పత్తులను విడుదల చేసినట్లు ఆ కంపెనీ తెలిపింది. వీటి ధరలు రూ.63,990 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొంది. ఇందులో 12కిలోలు, 7 కిలోల సామర్థ్యం కలిగిన ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది. సూపర్‌స్పీడ్ 39 నిమిషాల్లో ఫుల్ లోడ్ వాష్ చేస్తుందని.. 20 సంవత్సరాల వారంటీ ఉంటుందని ఆ కంపెనీ ప్రతినిధి ఘుప్రాన్ ఆలం పేర్కొన్నారు.

ఐపిపిబితో యాక్సిస్ మాక్స్ లైఫ్ జట్టు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపిపిబి)తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు యాక్సిస్ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ వెల్లడించింది. దీని ద్వారా టైర్ 3, టైర్ 4, గ్రామీణ మార్కెట్లలో తమ జీవిత బీమా పరిధిని పెంచుకునేందుకు మద్దతు లభించనుందని ఆ సంస్థ పేర్కొంది. ఐపిపిబి 650 బ్యాంకింగ్ ఔట్‌లెట్లు, 1.64 లక్షల పోస్ట్ ఆఫీస్ యాక్సెస్ పాయింట్ల ద్వారా సరసమైన బీమా ఉత్పత్తులను అందించనున్నామని యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ సుమిత్ మదన్ పేర్కొన్నారు.

సంపాదకీయం


ప్రజాస్వామ్య పునరుద్ధరణోద్యమం

జాతీయ స్వాతంత్ర్య పోరాట కాలంలోనూ, ఆ తరువాత ఎమర్జెన్సీలోనూ, ఆ మాటకొస్తే దేశానికి ముప్పు వచ్చిన ప్రతి సందర్భంలోనూ కీలకమైన ప్రజా ఉద్యమాలకు వేదికైన ప్రాంతం బీహార్! దేశానికి కష్టకాలంలో ఐక్యంగా అండగా నిలబడటంతో పాటు పలు మార్లు దేశానికి అవసరమైన రాజకీయ చైతన్యాన్ని బీహార్ ప్రజలు ప్రదర్శించారు. ఆ బీహార్‌లోనే ప్రస్తుతం ప్రజాస్వామ్య పునరుద్ధరణోద్యమం సాగుతోంది. ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో జరిగిన 'ఓటర్ అధికార్ యాత్ర'కు ప్రజల నుండి లభించిన విశేషమైన మద్దతే దీనికి నిదర్శనం. 25 జిల్లాల్లో 1300 కిలోమీటర్ల మేర సాగిన ఈ యాత్రలో ఇండియా బ్లాక్ పార్టీలు, బీహార్‌లో ఉన్న అనేక ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలపడంతో పాటు, అన్ని విధాలా సహకరించాయి. పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రజలు ఈ యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీహార్ రాజధాని పాట్నాలో జరిగిన ముగింపు సభలో రెండు లక్షలకుపైగా ప్రజలు పాల్గొన్నారని అంచనా! అనేక చారిత్రాత్మక సంఘటనలకు వేదికైన గాంధీ మైదాన్‌లో ఈ సభ జరిగింది. సభకు హాజరైన వారు తమ ఓటు హక్కును హరిస్తున్న మోడీ ప్రభుత్వంపై ఆగ్రహంతో చేసిన నినాదాలు బీహార్ అంతా మారుమోగాయి. 'ఓటు హక్కు మా స్వంతం. దాన్ని దోచుకోవడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించం' అన్న గట్టి హెచ్చరికను ఈ సభ ద్వారా సాధారణ ప్రజానీకం కేంద్ర ప్రభుత్వానికి చేసింది. ఇప్పటి వరకు బిజెపి-జెడియు ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకతను చూసీ చూడనట్టు ఊరుకున్న కొన్ని మీడియా సంస్థలు కూడా 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపు తర్వాత తమ వైఖరిని మార్చుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా ముగింపు సభ తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధోరణులు ఇదే మాదిరి కొనసాగితే వాటి పునాదులు కదులుతాయన్న సంకేతాలు మీడియా విశ్లేషణల్లో వెలువడుతుండటం గమనార్హం.

నిజానికి, బీహార్‌లో అధికార భాగస్వామిగా కొనసాగడానికి బిజెపి ఎన్నో టక్కుటమార విద్యలను ప్రదర్శించింది. అనైతిక మార్గాలను అనుసరించింది. తీవ్ర హిందుత్వ విధానాలతో ప్రజలను నిట్టనిలువునా చీల్చడానికి ప్రయత్నించింది. పహల్గాం ఉగ్రదాడిని కూడా ఎన్నికల రాజకీయాలకు ప్రధాని మోడీ వాడుకున్న తీరు ప్రస్తుతం బీహార్‌లో చర్చనీయాంశమైంది. ఇంత చేసినా అధికారంలో ఎక్కువ కాలం కొనసాగలేమన్న భావనతోనే ఓట్ల కుంభకోణానికి బిజెపి తెర తీసిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికల సంఘాన్ని ఆయుధంగా చేసుకుని, మైనారిటీలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళలు వీరందరికీ ఓటు హక్కు నిరాకరించడం. అధికార కూటమి అనుచరులు ఇష్టానుసారంగా ఓటు వేసేలా అనుమతిస్తూ తీసుకున్న పలు చర్యలు ఒక దాని తరువాత ఒకటిగా వెలుగులోకి వస్తున్నాయి. వెలుగులోకి వస్తున్న అంశాలకు తగిన విధంగా స్పందించి, సమస్యలను పరిష్కరించడానికి బదులుగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బిజెపి నేతల భాషలోనే ప్రతిపక్షాలపై దాడి చేయడం చర్చనీయమవుతోంది. బీహార్ నమూనాలోనే ఇతర రాష్ట్రాలలో కూడా ఓటర్ల జాబితా సవరణకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టడంతో బిజెపి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్న అభిప్రాయం రోజురోజుకు బలపడుతోంది. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగ బద్ధమైన హక్కులను కాపాడుకునేందుకు ఐక్యంగా కదలాలన్న ప్రతిపక్ష విజ్ఞప్తికి ప్రజల నుండి సానుకూల స్పందన లభిస్తోంది. 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపు సభ జరిగిన తీరే దీనికి నిదర్శనం.

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, బీహార్ శాసనసభ ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్‌ల ఆధ్వర్యంలో సాగిన యాత్రకు వామపక్షాలు గట్టి మద్దతు ప్రకటించాయి. ఆ పార్టీల రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు ఈ యాత్రలో భాగస్వాములయ్యారు. ముగింపు సభకు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి హాజరయ్యారు. స్వతంత్ర భారత దేశంలో ఎన్నికల సంఘం యొక్క విశ్వసనీయత ఇంతగా గతంలో ఎప్పుడూ ప్రశ్నార్థకం కాలేదు. బిజెపి ఆదేశాలను అమలు చేసే ఆయుధంగా ఎన్నికల సంఘం మారిపోవడాన్ని దేశ ప్రజానీకం ఎన్నటికీ అంగీకరించరు. ఓటు దోపిడీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరగబోయే ఆందోళనలకు బీహార్‌లో జరిగిన యాత్ర కేవలం ఆరంభం మాత్రమే!

మహనీయుల మాట



ఈ దేశం, సమాజం మగవాళ్ల గుత్త సొత్తుగా భావిస్తున్నారు. అది తప్పు. మగవాళ్లు ఇప్పటి దాకా స్త్రీలకు చెందాల్సినదంతా హరించి వేస్తూనే వచ్చారు.

- ముజఫర్ అహ్మద్,
తొలి తరం కమ్యూనిస్టు

అంతర్జాతీయం

మరో ప్రపంచం దిశగా షాంఘై సహకార కూటమి

వి. రాంభూపాల్



"ప్రపంచ పాలన కొత్త కూడలికి చేరుకుంది. మనం ఆధిపత్యం, అధికార రాజకీయాలకు వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరిని తీసుకోవడాన్ని కొనసాగించాలి. నిజమైన బహుళ పాక్షికతను ఆచరించాలి" అని చైనా అధ్యక్షుడు సి జిన్‌పింగ్ శిఖరాగ్ర సమావేశాన్ని ప్రారంభిస్తూ చెప్పిన మాటలు అక్షర సత్యాలు, ఆచరణీయ మార్గాలు. ఈ సమావేశం ఎవరు చూడాలో వారు చూశారు. ఈ మాటలు ఎవరికి తాకలో వారికి తాకాయి. తమ పెత్తనం సహజమని, తమ వ్యవస్థ శాశ్వతమని, తాము చెప్పిందే వేదం, తాము ఇచ్చిందే ప్రసాదమని విర్రవీగిన అమెరికా ఆధిపత్యానికి...మౌనంగా ఎదిగిన చైనా సరైన సమయంలో సరైన జవాబు ఇచ్చింది. ఆగస్టు 31 నుండి సెప్టెంబరు 1 వరకు జరిగిన షాంఘై సహకార కూటమి (ఎస్.సి.ఒ) శిఖరాగ్ర సమావేశం సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులకు కొత్త ఊపిరులు పోసింది. రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై సాధించిన విజయానికి చిహ్నంగా బీజింగ్‌లో సెప్టెంబరు 3న భారీ సైనిక కవాతు ('విక్టరీ డే') ద్వారా తన సైనిక శక్తిని చైనా ప్రపంచానికి చాటింది.

యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న తరుణంలో, ఏక ధృవ ప్రపంచ క్రమం దెబ్బతింటున్న సమయంలో 24 దేశాల నేతలు, ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీతో పాటు మరో పదికి పైగా అంతర్జాతీయ సంస్థలు చైనాలోని టియాంజిన్ నగరంలో ఒకే వేదిక మీదకు చేరాయి. రాజకీయ, వాణిజ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న సమయంలో 'ఒకరికి ఒకరం సహకరించుకుందాం, అభివృద్ధి వైపు సాగిపోదాం' అనే పిలుపు మానవాళికి అమిత శ్రవణానందం. 'మనం శత్రువులం కాదు, సన్నిహితులం' అని భారత్, చైనా దేశాధినేతలు ప్రకటించడం శుభపరిణామం, చారిత్రక అనివార్యం. 24 (10 సభ్యదేశాలు, 14 భాగస్వామ్య దేశాలు) దేశాల నేతలు ఏక కంఠంతో 2035 నాటి అభివృద్ధి లక్ష్యాలను ప్రకటించడం నేటి వర్తమానంలో అరుదైన దృశ్యం. "ప్రపంచ పాలన కొత్త కూడలికి చేరుకుంది. మనం ఆధిపత్యం, అధికార రాజకీయాలకు వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరిని తీసుకోవడాన్ని కొనసాగించాలి. నిజమైన బహుళ పాక్షికతను ఆచరించాలి" అని చైనా అధ్యక్షుడు సి జిన్‌పింగ్ శిఖరాగ్ర సమావేశాన్ని ప్రారంభిస్తూ చెప్పిన మాటలు అక్షర సత్యాలు, ఆచరణీయ మార్గాలు. ఈ సమావేశం ఎవరు చూడాలో వారు చూశారు. ఈ మాటలు ఎవరికి తాకలో వారికి తాకాయి. తమ పెత్తనం సహజమని, తమ వ్యవస్థ శాశ్వతమని, తాము చెప్పిందే వేదం, తాము ఇచ్చిందే ప్రసాదమని విర్రవీగిన అమెరికా ఆధిపత్యానికి...మౌనంగా ఎదిగిన చైనా సరైన సమయంలో సరైన జవాబు ఇచ్చింది. ఆగస్టు 31 నుండి సెప్టెంబరు 1 వరకు జరిగిన షాంఘై సహకార కూటమి (ఎస్.సి.ఒ) శిఖరాగ్ర సమావేశం సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులకు కొత్త ఊపిరులు పోసింది. రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై సాధించిన విజయానికి చిహ్నంగా బీజింగ్‌లో సెప్టెంబరు 3న భారీ సైనిక కవాతు ('విక్టరీ డే') ద్వారా తన సైనిక శక్తిని చైనా ప్రపంచానికి చాటింది.

కాలమెంత వేగంగా తిరిగి వచ్చింది. సోషలిజం పని అయిపోయిందని ముప్పై ఏళ్ళ క్రితం ఎంత గోల చేశారు. పెట్టుబడిదారీ వ్యవస్థే శాశ్వతమని ఎంతగా రాతలు రాశారు. అంతలోనే ఎంత మార్పు. నిన్న మొన్నటి వరకు కీర్తించిన అమెరికాను కాదని, తెగనాడిన సోషలిస్టు చైనాకు అనేక దేశాల నేతలు వరుస కట్టారు. సమున్నతంగా అక్కడ ఎగురుతున్న ఎర్ర జెండా నీడలో అక్కడి ప్రజలు సాధించిన అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోతున్నారు.

షాంఘై సహకార సంస్థ అంటే ...

చైనా విప్లవ పోరాటంలో షాంఘై పట్టణానికి అద్భుతమైన చరిత్ర వుంది. ఆ తర్వాతి కాలంలో చైనాలోని అతి పెద్ద వాణిజ్య నగరంగా షాంఘై అభివృద్ధి చెందింది. చరిత్ర, వర్తమానాల మేలు కలయికగా వున్న ఈ నగరం పేరుతో షాంఘై సహకార కూటమి (ఎస్.సి.ఒ) 2001 జూన్ 15న ఏర్పడింది. సభ్యదేశాల మధ్య ప్రాంతీయ భద్రత, ఉగ్రవాద నిరోధం కోసం మొదట్లో ఈ కూటమి ఏర్పడింది. మారుతున్న పరిస్థితులను బట్టి కొత్త లక్ష్యాలను నిర్ణయించుకుంటూ పురోగమించింది. ఆర్థిక సహకారం, సాంస్కృతిక మార్పిడి, ఇంధన భద్రత కూడా నేటి కూటమి లక్ష్యాలుగా వున్నాయి. మొదట్లో చైనా, రష్యా, కజకిస్తాన్, కిర్గిస్తాన్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్ సభ్య దేశాలు. 2017లో భారతదేశం, పాకిస్తాన్ ఇందులో చేరాయి. 2023లో ఇరాన్, 2024లో బెలారస్ చేరడంతో పది దేశాల కూటమిగా మారింది. మరో 14 దేశాలు ఈ సమావేశాల్లో, నిర్ణయాల్లో భాగస్వాములు అవుతున్నాయి. ప్రపంచ భూభాగంలో 24 శాతం, జనాభాలో 42 శాతం, స్థూల జాతీయ ఆదాయం (జి.డి.పి)లో 23 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న దేశాలు ఇందులో సభ్యదేశాలుగా వున్నాయి. ఇప్పటికి 25 సమావేశాలు జరిగాయి. ఈ కూటమి బలపడడం ఇష్టంలేని అమెరికా ఐక్యరాజ్యసమితి ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేసింది. అయితే ఈ కూటమి దేశాల ప్రాధాన్యత రీత్యా 2023 సెప్టెంబర్‌లో 'ఐక్యరాజ్యసమితి, షాంఘై సహకార సంస్థ మధ్య సహకారం' అనే తీర్మాణాన్ని ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించాల్సి వచ్చింది. దీనిపై జరిగిన ఓటింగ్‌లో 80 దేశాలు అనుకూలంగా ఓటు వేయగా, అమెరికా, ఇజ్రాయిల్ మాత్రమే వ్యతిరేకించాయి.

టియాంజిన్ సమావేశ నేపథ్యం

తాజాగా టియాంజిన్‌లో జరిగిన సమావేశం అనేక ప్రాధాన్యతలు కలిగివుంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై ఇష్టారీతిగా సుంకాలు వేస్తున్నాడు. ట్రంప్ కౌగిలిలో పులకించి పోయిన నేతలు సుంకాల దెబ్బకు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రష్యాను దెబ్బ తీయడానికి అమెరికా, నాటో (పశ్చిమ యూరప్) దేశాలు ఉక్రెయిన్‌ను చేరదీసి వేల కోట్లు అప్పులు ఇచ్చి, ఆయుధాలు సహాయం చేసి మూడు సంవత్సరాలుగా యుద్ధాన్ని కొనసాగించాయి. తాము ఒకటి తలిస్తే పరిస్థితులు మరోరకంగా మారాయి. రష్యాను దెబ్బ కొట్టాలనుకుంటే దానికంటే ఎక్కువగా నష్టపోయింది అమెరికా, నాటో (యూరప్) దేశాలు. ఈ దేశాలు ఇప్పటి వరకు ప్రవచించిన ప్రపంచీకరణ విధానాలకు వారే తిలోదకాలు ఇవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అమెరికాతో సహా బాగా అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలు దిగజారిపోతున్నాయి. ఈ దేశాలన్నీ కలిపినా సగటున రెండున్నర మూడు శాతానికి మించి అభివృద్ధి లేదు. విడివిడిగా చూస్తే జపాన్, జర్మనీ, ఇంగ్లాండ్, అమెరికా లాంటి దేశాలు ఒకటి రెండు శాతం అభివృద్ధి మధ్య ఊగిసలాడుతున్నాయి. మరొపక్క చైనా 6 శాతం అభివృద్ధితో అగ్రభాగాన వుంది. రష్యాను ఒంటరిపాటు చేయాలని, చైనా వాణిజ్యాన్ని దెబ్బతీయాలని, ప్రపంచ ఆధిపత్యాన్ని కొనసాగించాలని అమెరికా, ఇతర పెట్టుబడిదారీ దేశాలు చేసిన ప్రయత్నాలు ఫలించకపోగా రష్యా, చైనా, భారతదేశంతో పాటు అనేక దేశాల మధ్య అనివార్యంగా స్నేహ బంధం బలపడాల్సి వచ్చింది. గత మూడు నాలుగు నెలల క్రితం వరకు ఒకరిపై ఒకరు కాల్పులు, యుద్ధాలు చేసుకున్న దేశాల నేతలు ఒకే వేదిక మీదకు చేరారు.

మూడు కీలక నిర్ణయాలు

ఈ సమావేశం గతం నుండి వున్న ఉగ్రవాదం, వేర్పాటు వాదం, తీవ్రవాదాన్ని ఎదుర్కోవడానికి సహకరించుకోవడాన్ని కొనసాగిస్తూనే మూడు కీలక నిర్ణయాలు తీసుకుంది. అవి ఒకటి, సాంకేతిక సహకారాన్ని ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (ఎ.ఐ), డిజిటల్ ఆర్థిక అభివృద్ధికి పరస్పరం సహకరించుకోవడం. రెండు, 2035 వరకు అభివృద్ధి వ్యూహాన్ని ఖరారు చేయడం. మూడు, షాంఘై సహకార డెవలప్‌మెంట్ బ్యాంకు ఏర్పాటు చేయడం. మానవాళి శ్రమతో వికసించిన విజ్ఞానాన్ని ప్రభుత్వాల అండతో పెట్టుబడిదారులు స్వంతం చేసుకుని ప్రపంచంపై పేటెంట్ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. నూతన విజ్ఞాన విప్లవంగా ముందుకు వచ్చిన కృత్రిమ మేధస్సును కూడా ఇలా తమ చేతుల్లో పెట్టుకుంటున్న దశలో షాంఘై సభ్యదేశాలు ఎ.ఐ ని ఇచ్చిపుచ్చుకోవాలని నిర్ణయించడం మంచి పరిణామం. అభివృద్ధి ప్రణాళికలకు నిర్దిష్ట గడువు నిర్ణయించుకోవడం సోషలిస్టు వ్యవస్థ కీలక విధానం. షాంఘై సభ్య దేశాలు 2035 నాటికి అనేక రంగాల్లో ఆర్థిక ఏకీకరణ చెందడానికి రోడ్‌మ్యాప్‌ను రూపొందించుకోవాలని నిర్ణయించుకోవడం ముదావహం. తమ మధ్య వున్న వాణిజ్య అడ్డంకులను తొలగించి, ప్రాంతీయ ప్రత్యేకతలను గుర్తిస్తూ అభివృద్ధి చెందాలని నిర్ణయించుకున్నాయి.

సామ్రాజ్యవాద దేశాలు ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్, డబ్ల్యు.టి.వో ఆర్థిక సంస్థల ద్వారా ప్రపంచ దేశాల మూలుగులు పీల్చుకు తింటున్న విషయం చూస్తున్నాము. అందుకు భిన్నంగా షాంఘై సహకార అభివృద్ధి బ్యాంకు ఏర్పాటు చేయాలని సభ్యదేశాలు నిర్ణయించాయి. ఈ బ్యాంకు విధివిధానాలు నిర్ణయించేందుకు త్వరలో అధికారుల బృందం ఏర్పాటుకు అన్ని దేశాలు అంగీకరించాయి. ఈలోపుగా సభ్య దేశాలకు ఈ సంవత్సరం 2 బిలియన్ల యువాన్లు (280 మిలియన్ల డాలర్లు) ఉచిత సహాయాన్ని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రకటించాడు. సభ్యదేశాలకు ఉచిత సహాయం చేయడానికి చైనా ముందుకు రావడం సోషలిస్టు వ్యవస్థ ప్రత్యేకతను నేటి తరానికి తెలియజేసినట్లైంది. నాటి సోవియట్ రష్యా మన దేశానికి చేసిన ఆర్థిక, విజ్ఞాన సహాయం నేటి యువతరానికి తెలియకుండా మీడియా తొక్కిపెడుతున్న తరుణంలో చైనా ప్రకటన ఎంతో ప్రాధాన్యత కూడినది. షాంఘై డెవలప్‌మెంట్ బ్యాంకు ఏర్పాటుకు మరో 10 బిలియన్ల యువాన్ల రుణాన్ని ఇస్తానని చైనా ప్రకటించింది. అప్పుల కోసం సామ్రాజ్యవాద దేశాల నానారకాల షరతులకు లొంగి దేశ సంపదను, సహజవనరులను దోచి పెడుతున్న స్థితిలో ఇంత భారీస్థాయి మొత్తంతో బ్యాంకు ఏర్పడడం ఆహ్వానించదగ్గ పరిణామం.

భారత్ చైనా మైత్రి

చైనా సరిహద్దు విషయంలో ఏర్పడిన ఉద్రిక్తతలు తగ్గి పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించడం మంచి పరిణామం. అత్యధిక జనాభా వున్న రెండు పొరుగు దేశాలు సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించుకుంటే ఆ మేరకు సైనిక వ్యయం తగ్గుతుంది. దేశాభివృద్ధికి తోడ్పడుతుంది. చైనా మీద నిత్యం ద్వేషం కక్కుతున్న శక్తులకు, సంస్థలకు, పాలకుల మూల విరాట్‌లకు ఇది రుచించకపోయినా అనివార్యం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అన్ని రూపాల్లో దృఢమైన బంధం ఏర్పడాలని, అభివృద్ధిని సాధించడంలో విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని, స్టార్టప్‌లు, కొత్త ఆవిష్కరణలు ఇచ్చిపుచ్చుకోవాలని, రెండు దేశల ప్రజల మధ్య సంబంధాలు బలపడి సాంస్కృతిక అవగాహన పెరగాలని మన ప్రధాని కోరినవి నెరవేరాలి. తొలి అడుగులో రెండు దేశాల మధ్య నేరుగా విమానప్రయణాలు పునరుద్ధరించుకోవడం, కైలాష్ మానస సరోవర్ యాత్ర పునఃప్రారంభం సానుకూల పరిణామాలు. రష్యా, చైనాతో కలిసి బహుళ ధ్రువ ప్రపంచం వైపు మన దేశం అడుగులు వేయడం నేటి చారిత్రక అవసరం. దేశ ప్రజలకు మరో మార్గం.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

విశ్లేషణ

లోన్ యాప్‌ల ఆగడాలు - పరిష్కారం



వడ్డీ ఎంత? ప్రాసెసింగ్ చార్జీలు ఏమిటి? ఎన్ని వాయిదాలలో కట్టాలి? ముందుగా చెల్లిస్తే ముదరా ఏమైనా ఉంటుందా? ఏజెంట్లు ఎవరు? ఆ కంపెనీపై ఏమైనా అభియోగాలున్నాయా? బీమా తప్పనిసరి అంశమా? వంటి విషయాలను రుణం తీసుకొనే వ్యక్తి శ్రద్ధగా తెలుసుకోవాలి. లేనిచో, ఈ కంపెనీల ఊబిలో ఇరుక్కున్నట్లే. ఇక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి ఆగడాలను నియంత్రించడానికి గాను ఏదైనా ఒక 'శాశ్వత దర్యాప్తు సంఘాన్ని' ఏర్పాటు చేస్తే బాగుంటుంది. తల్లిదండ్రులు కూడా పిల్లల నడవడిక, తీరుతెన్నులపై శ్రద్ధ వహించాలి



- ప్రొ॥ కోడాటి వియ్యన్నరావు

నేటి ఆధునిక కాలంలో డిజిటల్ అక్షరాస్యత పెరగడం ఆహ్వానించదగిన పరిణామమే. దేశంలోని 145 కోట్ల మంది జనాభాలో దాదాపు 115 కోట్ల మంది మొబైల్ యూనిట్లను ఉపయోగిస్తున్నారు. ఒక విధంగా చూస్తే, మొబైల్ వినియోగం తప్పనిసరిగా మారింది. వయస్సు, వృత్తితో సంబంధం లేకుండా, ఇది దైనందిన జీవితంలో అంతార్భాగమైంది. దీనినొక ఆవకాశంగా తీసుకొని, అనేక వాణిజ్య, వ్యాపార సంస్థలు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, వంచించడానికి ప్రయత్నిస్తున్నాయి. క్రమేపీ ఈ మొబైల్ సేవల బాధితులు పెరిగిపోతున్నారు.

ఈ సందర్భంలో మొబైల్ సేవలను ఉపయోగించి రుణాలు మంజూరు చేసే సంస్థలు వందలు, వేలుగా పుట్టుకొచ్చాయి. కోరిన తక్షణమే రుణాన్ని మంజూరు చేసే సదుపాయాన్ని ఈ సంస్థలు అందిస్తున్నాయి. దీని మాటున అర్హతా ప్రమాణాలు పాటించకుండా, రుణాలు మంజూరు చేయడం, విపరీతమైన వడ్డీని విధించడం, రుణ వసూళ్లకు నేరపూరితమైన పద్ధతులను పాటించడం, భౌతికంగాను, మానసికంగాను వేధించడం, చివరకు రుణగ్రస్థులు ఆత్మహత్య చేసుకొనే వరకు పీడించడం వంటివి వెలుగులోకి వస్తున్నాయి.

ఈ విషయాలపై అవగాహన కల్పించడం కోసం 'అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం' (ఐద్వా) ఇటీవల (జులై 2025) బాధితులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. బాధితుల గాథలను వింటే ఇదొక సామాజిక సమస్యగా మారిందని తెలుస్తుంది. మొబైల్ యాప్‌ల ద్వారా రుణం అందించే ఈ సంస్థలు ముఖ్యంగా 'యవత'పై దృష్టి సారించి, వారిని ప్రలోభ పెడుతూ రుణం, వడ్డీ వసూళ్లకుగాను వారి తల్లిదండ్రులను, కుటుంబీకులను, స్నేహితులను, ఇతరులను అనేక వేధింపులకు గురిచేస్తున్నట్లు బాధితులు మొరపెట్టుకున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఇంటి తలుపులు తట్టడం, అసభ్య పదజాలంతో దూషించడం, సామాజికంగా వారి స్థాయిని హీన పరచే విధంగా ప్రవర్తించడం వెలుగులోకి వచ్చాయి. ఆయా సందర్భాలలో పోలీసుల జోక్యం నామమాత్రంగా ఉంటున్నది.

భారతదేశంలో ఏదైనా సంస్థ డిపాజిట్లు సేకరించడం, రుణాలను మంజూరు చేయడం వంటి ఆర్థిక కార్యకలాపాలను నిర్వర్తించాలంటే రిజర్వు బ్యాంకు అనుమతి తప్పనిసరి. ఆవిధంగా అనుమతి పొంది డిజిటల్ రూపంలో యాప్‌ల ద్వారా రుణాలను మంజూరు చేసే అనుమతి జులై 2025 నాటికి సుమారుగా 1600 సంస్థలకు ఉన్నది. రిజర్వుబ్యాంకు వీటిని డిజిటల్ లెండింగ్ యాప్స్ (డి.ఎల్.ఎ లు)గా పిలుస్తుంది. రిజర్వుబాంకు అనుమతి లేకుండా ఈ కార్యకలాపాలను నిర్వహిస్తున్న సంస్థలు అనేకం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఉదాహరణకు - అభిషేక్ అగర్వాల్ అనే చార్టర్డ్ అకౌంటెంట్ దాందాపు 40 డొల్ల కంపెనీల ద్వారా 750 కోట్ల రూపాయల రుణ వ్యాపారం చేశాడని, ఆపైన అతను అరెస్టయ్యాడని తెలుస్తున్నది. ఈ విధంగా నకిలీ రుణ యాప్‌లను నిర్వహిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకొనే విషయంగా రిజర్వు బాంకు ఎప్పటికప్పుడు వాటిని నిషేధిస్తూ, వాటి వివరాలను ప్రజలకు తెలియజేస్తున్నది. రిజర్వు బాంకు సమాచారం ప్రకారం 2022-2024 మధ్య కాలంలో దాదాపు 600 వరకు ఇటువంటి నకిలీ సంస్థలు యాప్‌ల ద్వారా కార్యకలాపాలను నిర్వర్తించినట్లు గుర్తించింది. వాటిపై చట్టపరమైన చర్య తీసుకొంటున్నది. అయితే అనేక రూపాలలో ఈ యాప్‌లు, సంస్థలు పుట్టుకొస్తున్నాయి. దీనిని ఆర్థిక, సైబర్ నేరంగా పరిగణించాలి. తమకు అందుతున్న ఫిర్యాదు ఆధారంగా మోసపూరిత, నకిలీ యాప్‌లను తమ యాప్ స్టోర్‌ల నుండి తొలగిస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ, నకిలీ రుణదాతలు ఏదో ఒక రూపంలో మరలా ప్రత్యక్షమవుతూనే ఉన్నారు. అంతకంతకు పెరిగిపోతున్న ఈ రుణ యాప్‌ల ఆగడాలను అరికట్టేందుకుగాను రిజర్వు బ్యాంకు 2025 మే 8న కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుంటున్న వారందరూ వీటిని క్షుణ్ణంగా తెలుసుకోవాలి. వీటిని దృష్టిలో వుంచుకొని, తగిన జాగ్రత్తలు తీసుకొనేలా ఏయే అంశాలను గమనించాలో తెలుసుకొందాం.

ముందుగా రుణం పొందాలనుకుంటున్న కంపెనీ యాప్‌ను ఎవరు నిర్వహిస్తున్నారో గమనించాలి. అలాగే ఆ యాప్ ఏ స్టోర్‌లో వుందో చూడాలి. ఈ యాప్ గురించి తెలుసుకోవడానికి, వారిపై ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా అన్న విషయం తెలుసుకోవడానికి, ఆ యాప్‌కు ఆతిథ్యం (హోస్ట్) చేస్తున్న కంపెనీకి ఈ మెయిల్ పెట్టవచ్చు. అయితే రుణం తీసుకొనే తొందరలో చాలా మంది ఈ పని చేయరు.

ఆ తరువాత వడ్డీకి సంబంధించి పూర్తి అవగాహన ఉండాలి. ఈ కంపెనీలు అధిక వడ్డీని వసూలు చేయడమనేది పరిపాటి. వడ్డీ సాలీనా 9.99 శాతం నుండి 45 శాతం వరకు ఉంటున్నది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం 'స్టాష్ ఫిన్' అనే కంపెనీ వడ్డీ సంవత్సరానికి 45 శాతం. అంటే దాదాపు నెలకు నాలుగు రూపాయలు. అదేవిధంగా 'పెసెన్స్' అనే కంపెనీ 40 శాతం వసూలు చేస్తున్నది. వీటిలో నెలవారీ వడ్డీ వసూలు చేసేవి, మూడు నెలలకొకసారి చేసేవి ఉన్నాయి. అయితే నెలవారీ వసూలు చేసేవే ఎక్కువ. వడ్డీ ఎంత శాతం వసూలు చేయాలనే దానిపై రిజర్వుబాంకు నిబంధన గాని, గరిష్ఠ పరిమితి గాని ఏమీ లేదు. ఇంకొక మతలబు ఏమంటే రుణం తీసుకొనే వ్యక్తికి వడ్డీ విషయాన్ని చాలా కంపెనీలు ముందుగా తెలియజేయటం లేదు. అదే విధంగా రుణ షరతుల గురించి కూడా చాలా గోప్యత ఉంటున్నది. ఈ విషయంలో రుణం తీసుకొనే వ్యక్తి అప్రమత్తంగా ఉండాలి.

మూడవది, మంజూరు చేయబడిన మొత్తాన్ని రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం రుణం తీసుకొన్న వ్యక్తి బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. కాని చాలా కంపెనీలు డిజిటల్ పేమెంట్ ఖాతాలు నిర్వహించే కంపెనీల 'వాలెట్'లు, మూడవ వ్యక్తి (థర్డ్ పార్టీ) ఖాతాలలో జమ చేస్తున్నాయి. చాలా సందర్భాలలో ఆ థర్డ్ పార్టీ రుణం ఇచ్చే కంపెనీకి అనుబంధ సంస్థ అయి ఉంటుంది. కాబట్టి దీనిని గమనించాలి.

నాల్గవది, ప్రాసెసింగ్ చార్జీలు. ఇవి ఎంత, ఏమిటి అనే విషయంగా స్పష్టత ఏమీ ఉండదు. చాలా సందర్భాలలో ఇవి రుణం మొత్తంలో 5 శాతం నుండి 10 శాతం వరకు ఉంటున్నాయి. వీటిని అప్పు తీసుకున్న వారికి ముందుగా తెలియజేయడం లేదు. వీటిపైన కూడా రిజర్వుబాంకు నియంత్రణ ఏమీ లేదు. ఎక్కువ కంపెనీలు రుణం మంజూరు చేసేటప్పుడే, ఈ చార్జీలను మినహాయించుకొని, మిగిలిన మొత్తాన్ని అతనికి బదిలీ చేస్తున్నాయి.

ఐదవది అతి ముఖ్యమైనది రుణగ్రహీతకు జీవిత బీమా చేయడం. ప్రతి కంపెనీ దీనిని తప్పనిసరి చేస్తున్నాయి. పైకి ఇది రుణగ్రహీత అనుకోని సందర్భంలో మరణిస్తే కంపెనీకి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు అనిపిస్తుంది. దీని ప్రీమియమ్‌లన్నీ కూడా రుణ గ్రహీతే చెల్లించాలి. ఇవి వడ్డీతో కలిపి వసూలు చేయబడతాయి. ఇటీవల జరిపిన కొన్ని అధ్యయనాలు, పోలీసు కేసుల ద్వారా వెలుగులోకి వచ్చిన అంశం ఏమంటే రుణ గ్రహీతలు అప్పు చెల్లించలేని సందర్భాలలో వారిని చనిపోయేందుకు ప్రేరేపిస్తున్నారు. ఇది ఇంకా నిగ్గు తేలవలసి ఉంది. ఏదైనా ప్రత్యేక దర్యాప్తును ఆదేశిస్తే తప్ప, ఇటువంటి విషయాలు వెలుగులోకి రావు.

ఆరవది రుణ గ్రహీతను, వారి కుటుంబ సభ్యులను మానసికంగా, సామాజికంగా వేధించడం. దీనికి సంబంధించి అనేక సందర్భాలలో కేసులు నమోదవుతున్నాయి. వసూలుకుగాను కంపెనీలు కొంతమంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవడం, వారి ద్వారా అమానవీయ కార్యకలాపాలు చేపట్టడం సాధారణంగా మారుతున్నది. దీనిని అరికట్టకపోతే ఇదొక సామాజిక సమస్యగా పరిణమిస్తుంది. ఈ విషయమై రుణం ఇచ్చే కంపెనీకి (ఆర్.బి.ఐ రెగ్యులేటెడ్ ఎంటిటీ), ఏజెంటుకు (లోన్ సర్వీస్ ప్రొవైడర్-ఎల్.ఎస్.పి) మధ్య తప్పనిసరిగా కాంట్రాక్టు అగ్రిమెంట్ ఉండాలని రిజర్వు బ్యాంకు స్పష్టం చేసింది. అప్పుడే ఏజెంట్ అనైతిక చర్యలకు లోన్ కంపెనీని బాధ్యుని చేయగలుగుతాం. అలాగే రిజర్వుబాంకు రుణానికి సంబంధించిన నియమ నిబంధనలన్నింటిని ముందుగానే రుణగ్రహీతకు తెలియ చేయాలని, రుణం మంజూరు చేసిన వెంటనే, అతని వెంటపడకుండా ఒక 'కూలింగ్ - ఆఫ్' కాలం ఉండాలని నిర్దేశించింది.

కాబట్టి పైన చర్చించిన అంశాలన్నింటిని దృష్టిలో పెట్టుకొని ...వడ్డీ ఎంత? ప్రాసెసింగ్ చార్జీలు ఏమిటి? ఎన్ని వాయిదాలలో కట్టాలి? ముందుగా చెల్లిస్తే ముదరా ఏమైనా ఉంటుందా? ఏజెంట్లు ఎవరు? ఆ కంపెనీపై ఏమైనా అభియోగాలున్నాయా? బీమా తప్పనిసరి అంశమా? వంటి విషయాలను రుణం తీసుకొనే వ్యక్తి శ్రద్ధగా తెలుసుకోవాలి. లేనిచో, ఈ కంపెనీల ఊబిలో ఇరుక్కున్నట్లే. ఇక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి ఆగడాలను నియంత్రించడానికి గాను ఏదైనా ఒక 'శాశ్వత దర్యాప్తు సంఘాన్ని' ఏర్పాటు చేస్తే బాగుంటుంది. తల్లిదండ్రులు కూడా పిల్లల నడవడిక, తీరుతెన్నులపై శ్రద్ధ వహించాలి.

/ వ్యాసకర్త ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)

E – Auction Notice (Second Call)

Auction No. 14/MAU61-USI0HB(OTH)/133/2025-CETT-Part(1)/2nd call Dt.03-09-2025
Name of Work :APCRDA –"E-Auction of 8 No's Four Seater and 3 No's Eleven seater Damaged electrical Vehicles at APCRDA unit office, Thullur" with combined Basic Opening Price of **Rs.1,18,400/-**

The Auction document can be downloaded on Konugolu portal from **05.09.2025 to 15.09.2025 up to 13.00 Hrs.** Due date for submission is 15.09.2025 up to 14.00 Hrs, E-Auction start date and time is **16.09.2025 @13.00 Hrs**. For further details please refer to www.konugolu.ap.gov.in and www.crda.ap.gov.in

E Procurement Tender Notice

NIT No. MAU61-USI0HB(OTH)/263/2025-HB Dt.03.09.2025.

Name of Work: APCRDA - H&B(M) - AP Secretariat - "Construction of Storage Room for Storage of Old/ broken furniture in IGC, AP Secretariat, Velagapudi" – Estimated Amount: **Rs.20,00,000/-**

The bid can be downloaded on AP e-procurement portal from **05.09.2025 to 20.09.2025 up to 14.00 Hrs**. Due date for submission of Bid **20.09.2025 up to 15.00 Hrs**, Technical bid opening **20.09.2025 @16.00Hrs**. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in

Sd/- Commissioner, APCRDA, Vijayawada.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. M/s ఓం శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్, ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టనర్స్: 1. ఇందుర్తి వెంకట రాయుడు, 2. ఆరెమండ వెంకట సుబ్బారావు, యూనిట్ చిరునామా: ఫ్లాట్ నెం. 3, బ్లాక్ నెం. 28, ఫేజ్ నెం. 4, ఆటోనగర్, గుంటూరు. (ఋణగ్రహీత).
2. శ్రీ ఇందుర్తి వెంకట రాయుడు, తండ్రి: రామారావు, డి.నెం. 8-17-66, మసీదు వీధి, బాలాజీరావు పేట, తెనాలి, గుంటూరు జిల్లా – 522 201. (ఋణగ్రహీత).
3. శ్రీ ఆరెమండ వెంకట సుబ్బారావు, తండ్రి: శ్రీరామ్మూర్తి, హెచ్.నెం: 2-33-69-1, లెనిన్ రోడ్డు, గాంధీనగర్, తెనాలి, గుంటూరు జిల్లా – 522 201. (ఋణగ్రహీత).
4. శ్రీ ఇందుర్తి రామారావు, తండ్రి: నాయుడమ్మ, డి.నెం. 8-17-66, మసీదు వీధి, బాలాజీరావు పేట, తెనాలి, గుంటూరు జిల్లా – 522 201. (హామీదారు).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ రూల్స్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి నోటీసు.

కెనరా బ్యాంక్, ఏఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) సెక్షన్ 13(8) క్రింద చదవబడు రూల్ 8(6) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 రూల్స్ (ఇక మీదట "రూల్స్"గా రిఫర్ చేయబడును) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత/సంస్థ M/s ఓం శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్, ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టనర్స్: 1. శ్రీ ఇందుర్తి వెంకట రాయుడు, 2. శ్రీ ఆరెమండ వెంకట సుబ్బారావు వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ. 57,28,213/- (అక్షరాల యాభై ఏడు లక్షల ఇరవై ఎనిమిది వేల రెండు వందల పదమూడు రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద 10.03.2022 తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత/సంస్థ తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది.19.06.2025**న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక /భౌతికంగా **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును **సాక్షి (తెలుగు) మరియు ది హిందూ (ఇంగ్లీష్)** వార్తాపత్రికలలో తేది.24.06.2025న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **01.09.2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 78,57,539.27 (అక్షరాల డెబ్బై ఎనిమిది లక్షల యాభై ఏడు వేల ఐదు వందల ముప్పై తొమ్మిది రూపాయల ఇరవై ఏడు పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆసులను విడిపించుకొనుటకు సర్ఫేసీ [illegible]

సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, తెనాలి సబ్ డిస్ట్రిక్ట్, తెనాలి మున్సిపల్ ఏరియా, తెనాలి గ్రామం, సమీప డోర్ నెం. 32-5-8, ఎస్.నెం. 119/2, మొత్తం ఎ. 0.91 సెంట్లలో గల 174.5 చ॥గ॥ లేదా 144.36 చ॥మీ॥ స్థలం యావత్తు. **హద్దులు డీడ్ ప్రకారం. టైటిల్ హోల్డర్: శ్రీ ఇందుర్తి రామారావు, తండ్రి: నాయుడమ్మ.**

తేది: 01.09.2025, ప్రదేశం: విజయవాడ **సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్**

స్వాధీనత ప్రకటన

ఈడల్‌వీస్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
సిఐఎన్ : U67100MH2007PLC174759
రిటైల్ సెంట్రల్ మరియు నమోదిత కార్యాలయం : ఈడెల్‌వీస్ హౌస్, ఓఎఫ్ఎఫ్ సిఎస్‌టి రోడ్డు, కలిన, ముంబాయి 400098

అనుబంధం-4 (రూల్-8(1)) స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)

ఏదైతే ఇక్కడ పేర్కొన్న సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ (యాక్ట్), 2002 మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క (రూల్ 3) తో చదువుతూ సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీత(లు), సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోపు నోటీసులో పేర్కొన్న బాకీపడిన మొత్తం తిరిగి చెల్లించమని కోరుతూ డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది.

ఆ తరువాత, సర్ఫేసీ చట్టం, 2002 యొక్క సెక్షన్ 5 క్రింద వరుసగా కేటాయింపు ఒప్పందం ప్రకారం ఇఎఆర్‌సి ట్రస్ట్ ఇకపై "ఇఎఆర్‌సి" గా సూచించబడుతుంది యొక్క ట్రస్టీగా దీని సామర్థ్యంలో సొంతంగా/వ్యవహరిస్తున్న దానిగా ఈడల్‌వీస్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్‌కు సెక్యూర్డ్ క్రెడిటార్స్ ఫైనాన్షియల్ అసెట్స్‌ను కేటాయించారు. సెక్యూర్డ్ క్రెడిటార్స్ యొక్క షూస్‌లోకి ఇఅర్‌సి అడుగుపెట్టింది మరియు సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అన్ని హక్కులు, టైటిల్ మరియు వడ్డీలు ఆర్థిక ఆస్తులతో పాటు అంతర్లీన భద్రతా వడ్డీలు, హామీలు, తాకట్టుపెట్టినవి రుణగ్రహీత పొందే ఆర్థిక సహాయానికి సంబంధించి ఇఅరిసిలో ఇవ్వబడ్డాయి మరియు ఇఅరిసి అన్ని హక్కులను సెక్యూర్డ్ క్రెడిటార్‌గా ఉపయోగించుకుంటుంది.

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనందున, రుణగ్రహీత(లు), సహ రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, దిగువసంతకందారుడు అయిన **ఈడల్‌వీస్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (4) అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైంది.

క్ర సం.	రుణగ్రహీత మరియు సహా-రుణగ్రహీతలు/ లోను ఖాతా నంబరు	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	ట్రస్ట్ వివరాలు	స్వాధీనతా తేది	లాంఛనప్రాయ/ భౌతిక స్వాధీనతా విధానం
1.	స్వాధీనత లోన్ అకౌంట్ నంబరు : HM/0219/H/15/100012 - 1) శ్రీ.వెంకటేశ్వర్లు నెల్లూరి ("రుణగ్రహీత") 2. మెసర్స్.ఓం సాయి కాటన్ ట్రేడర్స్ ("సహా-రుణగ్రహీత") 3. శ్రీమతి. నెల్లూరి గాయత్రి ("సహా-రుణగ్రహీత")	03-09-2020 & Rs.43,92,670.05	ఇఎఆర్‌సి ట్రస్ట్ ఎస్‌సి-370 మరియు మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్	30-08-2025	భౌతిక స్వాధీనత

సెక్యూర్డ్ అసెట్ వివరణ : గుంటూరు జిల్లా, నల్లపాడు ఉపజిల్లాలో ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ డో.నం.637 తో విస్తీర్ణం ఎ.లు. 2.7 1/2 సెంట్లు. తూర్పు వైపు స్థలం మొత్తం పరిధి ఎ.లు. 5.75 సెంట్లు. అందులో పాట్లుగా చేయబడిన మరియు ప్లాట్ నం.4ఎ తో సైట్ పరిధి 121 1/2 చ.గ.లు. ప్లాట్ నం.4 బి తో సైట్ పరిధి 121 1/2 చ.గ.లు. మరియు ప్లాట్ నం.4బి మరియు సైట్ తో విస్తీర్ణం 121 1/2 సైట్ మొత్తం విస్తీర్ణం 243 చ.గ.లు. కొలతల ప్రకారం సైట్ పరిధి 239 చ.గ.లు.తో మూల్యాంకనం నం.130921, తేది : 24.09.2014, డాక్యుమెంట్ తో ఎస్ఆర్.నం.8856/2014 గా రిజిస్టర్ చేయబడిన సేల్ డీడ్ లో మరింత ప్రత్యేకంగా పేర్కొన్న డో.నం.4-169/ఎ. హద్దులు : తూర్పు: పంచాయతీ బజారు, దక్షిణం : మేకతోటి దయారత్నం సైట్, పడమర : 12 1/2 వెడల్పు బజారు, ఉత్తరం : మేకతోటి దేవదాసు సైట్. ఈ సరిహద్దుల పరిధి 243 చ.గ.లు. అవసరాల ప్రకారం పరిధి 239 చ.గ.లు. లేదా 199.82 చ.మీ.లు. తో పాటు ఆర్‌సిసి డాబా ఇంటితో అన్నీ ఇతర సౌకర్యాలు.

రుణగ్రహీతలు జాగ్రత్త ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు, మీకు లభించిన సమయం మేరకు, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నిబంధనలు అహ్వానించడమైనది. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదని మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలిచిన వారు క్రింద పేర్కొన్న మొత్తం మరియు దానిపిమ్మట వడ్డీ ఈడల్‌వీస్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్‌కు మొత్తం చెల్లించి జరుపవచ్చును.

ప్రదేశం : విజయవాడ
తేది : 04.09.2025
సం/- అధీకృత అధికారి
ఈడల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్

Edelweiss Asset Reconstruction

HDFC BANK We understand your world **HDFC BANK LTD.** **డిమాండ్ నోటీసు**

హెడ్ ఆఫీసు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పరేల్ (పశ్చిమ), ముంబయి, మహారాష్ట్ర-400013. **రీజినల్ ఆఫీసు:** హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, నెం.50-96-5, ఫ్లాట్ నెం.175, సీతాంధార, పాత ఎస్‌బిహెచ్ ఎదురుగా, విశాఖపట్నం-530 013.

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1)తో చదువబడే SARFAESI చట్టం, 2002 (చట్టం)లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు.

ఇందుమూలంగా దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు, హామీదారులు & తాకట్టుదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, **హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్** నుండి ఎవరైతే రుణసదుపాయం పొంది, తిరిగిచెల్లించుటలో డిఫాల్టిచెందారో మరియు వారి రుణ ఖాతాలు **28.04.2025**న నాన్-పెర్ఫామింగ్ అసెట్ (ఎన్‌పిఏ)గా వర్గీకరించబడినవి. క్రింది సంతకందారు **హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద దిసెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, అధీకృత అధికారి, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద **21.08.2025**న వారి గతంలో తెలిసిన చిరునామాపై డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి, కాని అవి బట్వాడా కాకుండానే వెనుదిరిగినవి, అందుకుగాను దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు, హామీదారులు & తాకట్టుదారులకు ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయబడుచున్నది.

రుణగ్రహీతలు/హామీదారుల పేరు & చిరునామా/ రుణ ఖాతా నెంబరు	డిమాండ్ నోటీసు తేది & ఎన్‌పిఏ తేదితో మొత్తాలు
1) మెసర్స్ ఆత్రేయ ఎంటర్‌ప్రైజెస్, ప్రతినిధియైన దీని మేనేజింగ్ పార్టనర్ శ్రీ శ్రీనివాస రాజు బుద్ధరాజు, డోర్ నెం .54-3-1/2, 1వ అంతస్తు, 2వ క్రాస్ రోడ్, జవహర్ ఆటోనగర్, విజయవాడ-520 007. **2) శ్రీ. శ్రీనివాసరాజు బుద్ధరాజు,** తండ్రి సూర్యనారాయణ రాజు, డోర్‌నెం.54-14 8-7సి, ఫ్లాట్ నెం.401, శ్రీకర రెసిడెన్సీ, మెయిన్ రోడ్, భారతీనగర్, విజయవాడ, కృష్ణా జిల్లా-520008. **3) శ్రీమతి అరవపల్లి నళిని,** భర్త శ్రీ శివ నాగేశ్వరరావు అరవపల్లి, ఇంటి నెం.8-8-14/9, ఫ్లాట్ నెం.126, ఎన్ఎస్ఎల్‌కాలనీ, ఫేజ్-2, రోడ్‌నెం.1, అశోక్‌నగర్, అమీనాపూర్, మెదక్, బిహెచ్ఎల్ దగ్గర, హైదరాబాద్, తెలంగాణ-502032. **4) శ్రీ.శివ నాగేశ్వర రావు అరవపల్లి** తండ్రి శ్రీ.వెంకటేశ్వరరావు అరవపల్లి, డోర్ నెం.5-40, పంచాయతీ స్కూల్ దగ్గర, కొత్తూరులంక, అనంతవరం, గుంటూరు, పిన్ కోడ్-522 301.	**డిమాండ్ నోటీసు: తేదీ 21.08.2025,** డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం **31.07.2025** నాటికి **రూ.1,38,59,342.85 (రూపాయలు ఒకకోటి ముప్పై ఎనిమిది లక్షల యాభై తొమ్మిది వేల మూడు వందల నలభై రెండు &ఎనభై ఐదు పైసలుమాత్రమే)** తదుపరి వడ్డీ మరియు దానిపై తుది చెల్లింపు తేదీ వరకు జరిగే ఇన్సిడెంటల్ వ్యయాలు& ఖర్చుతో పాటు. **ఎన్‌పిఏ తేదీ: 28.04.2025**

క్రసు.	స్థిరాస్తి యొక్క వివరణ	తనఖాదారు
1	**ఆస్తి-1:** డోర్ నెం.49-4-15 దగ్గరలోని ఖాళీ స్థలం ఆస్తి మొత్తం, ప్రస్తుతం ఆర్ఎస్ నెం.108/3, ఫ్లాట్ నెం.9, గుణదల, విజయవాడ మున్సిపాలిటీలోని 233.33 చదరపు గజాలు లేదా195.08 చదరపు మీటర్ల విస్తీర్ణం/ కొలత స్థలం.**సరిహద్దులు: (డాక్యుమెంట్ నెం.1391/ 2007, తేదీ.28.03.2007 ఎస్ఆర్ఓ గుణదల ప్రకారం,) పత్రాల ప్రకారం సరిహద్దుల వివరాలు:** ఉత్తరం: ప్రతిపాదిత విక్రేత పి.లక్ష్మి సౌజన్య-52.6 అ.లు, దక్షిణం: ప్రతిపాదిత విక్రేత ఎ.నాగేశ్వరమ్మ-52.6 అ.లు, తూర్పు: బి.సీతామహలక్ష్మి ఇతరులకు అమ్మబడింది-40 అ,లు, పడమర: 30 అ.ల వెడల్పు రోడ్డు -40 అ.లు.	శ్రీమతి అరవపల్లి నళిని
2	**ఆస్తి-2:** డోర్ నెం.8-8/14/9 కలిగిన నివాస ఆస్తి మొత&ం. ఫ్లాట్ నెం.126లో నిర్మించబడింది, సర్వే నెం.655లోని 120.00 చదరపు గజాలు లేదా 100.32 చదరపు మీటర్ల విస్తీర్ణంలో, 600 చ.అ.ల ప్లింత్ ఏరియాతోఆర్‌సిసి రూఫ్‌తో కవరుచేయబడినది, ఇది అమీన్‌పూర్ గ్రామం, పటాన్‌చెరుమండలం, మెదక్ జిల్లా ఆం.ప్ర, జిపి అమీన్‌పూర్ గ్రామం కింద, ఎంపిపి పటాన్‌చెరు మండలం, జెడ్‌పిపి మెదక్ సంగారెడ్డి వద్ద, సంగారెడ్డి వద్ద జిల్లా రిజిస్ట్రార్ మెదక్ అధికార పరిధిలో కలదు మరియు **సరిహద్దులు: (డాక్యుమెంట్ నెం.5837/2014, తేదీ.02.05.2014 ఎస్ఆర్ఓ సంగారెడ్డి ప్రకారం):** ఉత్తరం:ప్లాట్ నెం.117, దక్షిణం:30' వెడల్పు రోడ్డు, తూర్పు:ప్లాట్ నెం.125, పడమర: బహిరంగ స్థలం.	శ్రీ.అరవపల్లి శివ నాగేశ్వర రావు
	షెడ్యూల్-బి: మేనేజింగ్ పార్టనర్ మరియు ఆస్తి యజమానుల వ్యక్తిగత హామీ, బుక్ డెట్స్ & రీసివబుల్స్ అండ్ స్టాక్.	

పై రుణగ్రహీతలు, హామీదారులు& తాకట్టుదారులను ఇందుమూలంగా కోరబడుచున్నది ఏమనగా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజుల్లోగా బకాయి మొత్తాలను చెల్లించగలరు, విఫలం చెందిన ఏదైతే SARFAESI యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(4) క్రింద, 60 రోజులు ముగిసిన తరువాత తదుపరి చర్య తీసుకోబడుతుంది.
రుణగ్రహీతలు, హామీదారులు & తాకట్టుదారులు, సెక్యూరిటీస్‌ను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయంకు సంబంధించి, సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ 8 యొక్క నియమాలపై శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

తేది: 21-08-2025
ప్రదేశం: విశాఖపట్నం
సం/-
అధీకృత అధికారి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

ట్రాన్స్‌కో ప్రాజెక్టులు వేగవంతం

- సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ట్రాన్స్‌కో ప్రాజెక్టులను వేగవంతం చేయాలని అధికారులను ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. ట్రాన్స్‌కోపై సచివాలయంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి సమయపాలన, నాణ్యత, భద్రతపై రాజీపడకూడదని మంత్రి చెప్పారు. రూ.14,962 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 400కెవి, 220కెవి, 132కెవి సబ్‌స్టేషన్లు ఇతర ట్రాన్స్‌కో ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేయాలని చెప్పారు. పోర్టులు, పారిశ్రామిక కేంద్రాలు, రాజధాని ప్రాంతం వంటి ప్రధాన ప్రాజెక్టులకు విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందేలా అన్ని పనులు వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. 2027 నాటికి రూ.6 వేల కోట్లతో చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేయాలని చెప్పారు. కాంట్రాక్టర్లతో సమన్వయం చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఆక్వా రైతులకు మద్దతుగా సబ్‌స్టేషన్ల నిర్మాణం, ట్రిప్పింగ్ సమస్యల పరిష్కారం, విశాఖ డేటా సెంటర్, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కల్పనపై దృష్టి సారించాలన్నారు.

20 ఏళ్లకు పైబడిన సబ్‌స్టేషన్లను ఆధునీకరించాలని తెలిపారు. సీలేరు ప్రాంతంలో భూగర్భ కేబుల్ లైన్ల ప్రారంభ వ్యయం ఎక్కువైనా దీర్ఘకాలంలో నష్టాలు, నిర్వహణ ఖర్చులు తగ్గిస్తుందని పేర్కొన్నారు. ప్రసార మౌలిక సదుపాయాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను అవలంభించాలని చెప్పారు. జిఐఎస్ సబ్‌స్టేషన్లు, భూగర్భ కేబులింగ్ వ్యవస్థలు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ప్రాముఖ్యతను గుర్తు చేశారు. 2 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన బిఇఎస్ఎస్ అమలుకు బిడ్డింగ్ ప్రారంభించినట్లు మంత్రికి అధికారులు తెలిపారు. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులకు విద్యుత్ సరఫరా విస్తరణ, విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలపై మంత్రి చర్చించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో జెఎండి కీర్తి చేకూరి, డైరెక్టర్లు ఎవిబి భాస్కర్, ఎన్వి రమణమూర్తి, సిఇ సుధీవన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు

- ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష దరఖాస్తు గురువారం నుంచి ప్రారంభం కానుందని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ నెల 30 వరకు విద్యార్థులు నమోదు చేసుకోవచ్చని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉండి ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాల కోసం తమ కార్యాలయం వెబ్‌సైట్‌ను గానీ, సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల్లో గానీ తెలుసుకోవాలని పేర్కొన్నారు.



మంత్రి లోకేష్‌ను కలిసిన నోబెల్ గ్రహీత మైఖేల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను నోబెల్ గ్రహీత, యూనివర్సిటీ ఆఫ్ చికాగో ప్రొఫెసర్ మైఖేల్ క్రెమర్ కలిశారు. ఉండవల్లిలోని మంత్రి లోకేష్ నివాసంలో ఈ భేటీ బుధవారం జరిగింది. చికాగో యూనివర్సిటీ నిర్వహించిన అధ్యయనం ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో ఎడ్‌టెక్ సామర్థ్యం పెరిగిందని క్రెమర్ వివరించారు. పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పిఎఎల్) కార్యక్రమాన్ని ఉపయోగించిన విద్యార్థులు కేవలం 17 నెలల్లో పిఎఎల్ లేని పాఠశాలల విద్యార్థుల కంటే 2.25 రెట్లు అభ్యసన పురోగతిని సాధించారని వివరించారు. పిఎఎల్ వినియోగంలో దేశంలోనే రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు.

11 కార్పొరేషన్లకు డైరెక్టర్లను ప్రకటించిన కూటమి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 11 కార్పొరేషన్లకు డైరెక్టర్లను కూటమి ప్రకటించింది. ఎపి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్‌లో 14 మందిని, ఎపి ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌లో 14 మందిని, ఎపి ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో 5, ఎపి లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీలో 8, ఎపి కమ్మరి శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్‌లో 15, నాటక అకాడమీలో 25, మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో 15 మంది, స్టేట్ అగ్రికల్చర్ మిషన్‌లో 8 మంది, గ్రంథాలయ పరిషత్‌లో 6, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్‌లో 4, స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌లో 4 చొప్పున పేర్లను ప్రకటించింది.

జొమాటో ప్లాట్‌ఫామ్ ఫీజు 20 శాతం పెంపు



బెంగళూరు : ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్ యాప్ జొమాటో తన ప్లాట్‌ఫామ్ ఫీజును భారీగా పెంచింది. గతంలో కంటే 20 శాతం పెంచి రూ.12కు చేర్చింది. ఈ కొత్త ఫీజులు సెప్టెంబర్ 2 నుంచి అన్ని నగరాల్లో అమల్లోకి వచ్చాయి. ఇంతక్రితం ఈ ఫీజు రూ.10గా ఉంది. డెలివరీ ఫీజులు, పన్నులు, రెస్టారెంట్ ధరలు కాకుండా జొమాటో ప్రత్యేకంగా వసూలు చేసే ఫ్లాట్‌ఫామ్ ఫీజును 2023లో తొలిసారి ప్రవేశపెట్టింది. అప్పుడు కేవలం రూ.2గా నిర్ణయించింది. దీన్ని క్రమంగా పెంచుతూ పోతోంది. 2024లో రూ.4కు, అక్టోబర్ 2024లో ఏకంగా రూ.10కు చేర్చింది. తాజాగా మరోసారి పెంచింది. ఈ సంస్థ రోజుకు దాదాపు 25లక్షల ఆర్డర్లను డెలివరీ చేస్తోంది. ఒక్కో ఆర్డర్‌పై రూ.2 పెరిగినా ఒక్క త్రైమాసికం ఆదాయం అదనంగా రూ.45 కోట్లు పెరగనుంది. ప్లాట్‌ఫామ్ విస్తరణలో పెట్టుబడులు పెట్టడానికి కంపెనీ చేస్తున్న ప్రయత్నంలో భాగంగా ఫీజులను పెంచాల్సి వస్తోందని ఆ కంపెనీ ప్రతినిధి పేర్కొన్నారు. మరో ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ కూడా ఇటీవల రుసుంలను పెంచడం ద్వారా రూ.14కు చేర్చింది.



బంగారం ధర రూ.1.25 లక్షలకు చేరొచ్చు

- ఐసిఐసిఐ బ్యాంక్ రీసెర్చ్ అంచనా

న్యూఢిల్లీ : భారత్‌లో బంగారం ధరలు మరింత పెరగొచ్చని రిపోర్టులు వస్తోన్నాయి. వచ్చే ఏడాది ప్రథమార్థం నాటికి 10 గ్రాముల పసిడి ధర రూ.1,10,000 నుంచి రూ.1,25,000 మధ్య ఉండొచ్చని ఐసిఐసిఐ బ్యాంక్ ఎకనామిక్ రీసెర్చ్ గ్రూప్ విశ్లేషించింది. ఈ ఏడాది 2025లో రూ.99,500 – రూ.1,10,000 మధ్య కదలాడొచ్చని పేర్కొంది. 'మా అంచనాల కంటే డాలర్‌తో రూపాయి బలహీనపడితే పసిడి ధరలు మరింత పెరగొచ్చు. ఈ కాలంలో డాలర్‌తో రూపాయి విలువ 87.00–89.00 మధ్య సగటున ఉంటుందని భావిస్తున్నాము.' అని ఐసిఐసిఐ రీసెర్చ్ పేర్కొంది.

ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ప్రపంచంలో బంగారం ధరలు 33 శాతం పెరిగాయి. 2025 మిగిలిన కాలంలో ఔన్సు పసిడి ధర సగటున 3,400–3,600 మధ్య, 2026 మొదటి అర్ధభాగంలో 3,600–3,800 డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రమైతే ఈ ధరలు మరింత పెరగొచ్చని హెచ్చరించింది. బుధవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.880 పెరిగి రూ.1,07,120కి చేరింది. 22 క్యారెట్ల పసిడిపై రూ.800 పెరిగి రూ.98,200గా నమోదయ్యింది. కిలో వెండిపై రూ.900 పెరిగి రూ.1,27,000కు చేరింది.

---

kotak **కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్**

రిజిస్టర్డు ఆఫీసు: 27, బికెసి, సి-27, జి-బ్లాక్, బంద్ర కుర్ల కాంప్లెక్స్, బంద్ర (ఈస్ట్), ముంబయి-400051.
బ్రాంచి ఆఫీసు: 6-3-1109/2, 2వ అంతస్తు, నవభారత్ చాంబర్స్, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్-500 082.

స్థిరాస్తి యొక్క ఇ-వేలం & అమ్మకపు ప్రకటన

ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) & 9(1)కు నియమాలతో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు, హామీదారులు మరియు/ లేదా తాకట్టుదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తి **కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్** ("సెక్యూర్డ్ క్రెడిటర్")కు తాకట్టు/చార్జ్‌చేయబడినది, దేనినైతే 21.10.2024న సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క అధీకృత అధికారిచేత **భౌతిక స్వాధీనంచేసుకోబడినది,** మరియు రుణగ్రహీత/ తాకట్టుదారులు/ హామీదారులు పేర్లు **1. మెసర్స్ అంకూర్ ఎంటర్‌ప్రైజెస్,** ప్రతినిధి యైన దీని యజమాని **శ్రీ అశోక్ కుమార్ జైన్,** డోర్ నం.563, జి.టి.రోడ్, గుంటూరు-522005 (రుణగ్రహీత), **2. శ్రీ అశోక్ కుమార్ జైన్,** తండ్రి శ్రీ హీరాలాల్ జైన్, డోర్ నం.4-5-27/4, విద్యానగర్, 3/2వ లేన్, జైన్ హౌజ్, పట్టాభిపురం, గుంటూరు-522006. **మరియు: శ్రీ అశోక్ కుమార్ జైన్,** తండ్రి శ్రీ హీరాలాల్ జైన్, ఫ్లాట్ నం.502, గ్రాండ్ ప్లాజా, విద్యానగర్ 3వ లేన్, 4వ క్రాస్, గుంటూరు-522 007 (సహ-రుణగ్రహీత/ హామీదారు). **3. శ్రీ అంకుర్ జైన్ బర్జాయిట,** తండ్రి శ్రీ అశోక్ కుమార్ జైన్, డోర్ నం.4-5-27/4, విద్యానగర్, 3/2వ లేన్, జైన్ హౌజ్, పట్టాభిపురం, గుంటూరు-522006. **మరియు: శ్రీ అంకుర్ జైన్ బర్జాయిట,** తండ్రి శ్రీ అశోక్ కుమార్ జైన్, ఫ్లాట్ నం.502, గ్రాండ్ ప్యాలేస్, విద్యానగర్, 3వ లేన్, 4వ క్రాస్, గుంటూరు-522 007. (సహ-రుణగ్రహీత/ హామీదారు) అనువారి నుండి **లోన్ ఖాతా నం. 8912144065, 7747టిఎల్0100000088, 7747టిఎల్0100000080, 7747టిఎల్0100000036 & 7747సిఎల్0100000038 (సిఆర్ఎన్ 289797570)** కు మంజూరుచేయబడిన రుణాలకు సంబంధించి సెక్యూర్డ్ క్రెడిటర్, కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్‌కు గల బకాయిలను పూర్తిగా చెల్లించు/ రియలైజేషన్ వరకు చక్రవడ్డీ చేరువలో కాంట్రాక్చువల్ రేటున దానిపై తదుపరి వడ్డీ& ఇతర చార్జీలుతోపాటు **16 మే 2025 నాటికిగల రూ.6,80,49,741.25** లను రికవరీచేయుట కొరకు **23.09.2025న "ఏది ఎక్కడ ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది" మరియు "నో రీకోర్స్"** ప్రాతిపదికన ఇ-వేలం ద్వారా విక్రయించబడుతుంది. వేలం కొరకు పెట్టు స్థిరాస్తి వివరాలు/ వివరణ, రిజర్వు ధర, ధరావత్తు & వేలం షెడ్యూలు దిగువ పేర్కొనబడినవి.

క్ర సం.	తాకట్టుదారు పేరు	ఇ-వేలం కొరకు పెట్టు స్థిరాస్తి వివరాలు	ఆన్‌లైన్ బిడ్ దాఖలు కొరకు చివరి తేది	ఇ-వేలం తేది& సమయం	రిజర్వు ధర (రూ)	ధరావత్తు (ఇఎండి)(రూ)
1	శ్రీ అశోక్ కుమార్ జైన్	గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్-డిస్ట్రిక్ట్, కొత్త గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధుల్లో అంకిరెడ్డిపాలెం యొక్క సర్వే నం. 245/4 లోగల ఎక.0.63సెంట్లు లేదా హెక్టార్లు 0-252కు సమానమైన విస్తీర్ణంతో ఖాళీ ల్యాండ్, ఎక.0.63సెంట్లు మరియు విద్యుత్ కనెక్షన్ స్థాపనతోపాటు దానిపై ఉన్న ప్రస్తుత అన్ని భవనాలు& నిర్మాణాలు, సదరు తాకట్టు తేది తరువాత నుండి ఏ సమయమునైనా ఎరెక్టెడ్/నిర్మించిన మరియు దానికి అదనంగా అన్ని చేర్పులు మరియు నేలకు అటాచ్‌చేయబడిన అన్ని ఫిక్షర్స్& ఫర్నీచర్స్ & ప్లాంట్& మిషనరీలు లేదా నేలకు అటాచ్‌చేయబడిన రెండు ప్రస్తుత మరియు భవిష్యత్ ఏవేని పర్మినెంట్ ఫాస్టెనెడ్ మొత్తం భాగం. మరియు సరిహద్దులు: తూర్పు: రోడ్డు, 159 లింకులు, దక్షిణం: వ్యవసాయ భూమి, 408 లింకులు, పడమర: వ్యవసాయ భూమి, 144 లింకులు, ఉత్తరం: కుంచకర్ల ఎలిజబెత్ కు చెందిన భూమి, 417 లింకులు, ఈ సరిహద్దుల్లో ఎక.0.63సెంట్లు లేదా హెక్టార్ల 0.252 రూఫ్ ల్యాండ్ విక్రయించిన& స్వాధీనంలో ఇవ్వబడిన ఆస్తి.	22.09.2025 న సా॥ 5.00గం.ల వరకు	23.09.2025 న ఉ॥ 11.00గం.ల నుండి మ॥ 12:00గం.ల మధ్య	రూ. 4,81,41,860/- (రూపాయలు నాలుగు కోట్ల ఎనభై ఒక లక్షల నలభై ఒక వేల ఎనిమిది వందల అరవై మాత్రమే)	రూ. 48,14,186/- (రూపాయలు నలభై ఎనిమిది లక్షల పద్నాలుగు వేల నూటా ఎనభై ఆరు మాత్రమే)

క్రింది సంతకందారు వారి అధీకృత ప్రతినిధి ద్వారా సదరు ఆస్తి పరిశీలన కొరకు 10.09.2025 & 11.09.2025న ఉ॥ 11:00గం.ల నుండి మ॥ 03:00గం.ల మధ్య ఆసక్తిగల కొనుగోలుదారుల నుండి అభ్యర్థనపై ఏర్పాట్లుచేయుదురు.

ముఖ్యమైన నియమాలు& షరతులు:
1) వేలం అనునది కేవలం "ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్" ద్వారా వెబ్‌సైట్ https://www.bankeauctions.com/ ద్వారా **23.09.2025న ఉ॥ 11.00గం. నుండి మ॥ 12.00గం.ల** మధ్య ప్రతిసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో నిర్వహించబడుతుంది.
2) ఇ-వేలంకు సంబంధించిన వివరాల కొరకు, ఆసక్తిగల బిడ్డరుదారులు సంప్రదించండి: **మెసర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ ధరణి కృష్ణ-మొబైల్: +91-9948182222 ద్వారా; ఇమెయిల్ ఐడి: andhra@c1india.com.,**
3) ఆసక్తిగల బిడ్డరుదారులు వేలం వివరాలు మరియు అమ్మకం యొక్క నియమాలు & షరతుల కొరకు బ్యాంకు యొక్క అధికార వెబ్‌సైట్- https://www.kotak.com/en/bank-auctions.html ను దర్శించవచ్చును.
4) వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& షరతుల కొరకు, బిడ్డరుదారులు పోర్టల్ https://www.bankeauctions.com/ ద్వారా [illegible]

[illegible] సందర్శించవచ్చు. 31) ఉద్దేశించిన కొనుగోలుదారు (లు) చట్టబద్ధమైన బాధ్యతలు, ఓవర్-ద్యూ నిర్వహణ, సాధారణ ఛార్జీలు, ఓవర్-ద్యూ విద్యుత్ బిల్లులు, మునిసిపల్ టాక్స్, వాటర్ టాక్స్, ఇతర ఛార్జీలు (ఏదైనా ఉంటే) పైన పేర్కొన్న స్థిరాస్తి మునుపటి పంక్తిలో మరియు ఇతర పన్ను మరియు బిల్లులో పేర్కొన్న విధంగా పెండింగ్లో ఉన్న పన్ను మరియు బిల్లులకు సంబంధించిన అన్ని చిక్కులతో విక్రయించబడుతుంది. 32) ఆస్తిని తనిఖీ చేయడానికి లేదా మరిన్ని వివరాల కోసం దయచేసి శ్రీ ఆర్. రామచంద్రన్, మొబైల్ నంబర్ 9515662010, మొబైల్ నంబర్ PRU నాగేంద్రను సంప్రదించండి. 9394083415, శ్రీ కరుణ్ బి ం 91-9686812683, శేష శ్రీనివాసన్, మొబైల్ నెం. 9916855444.

గమనిక: ఒకవేళ ఆంగ్లంలో అమ్మకపు నోటీసు ప్రచురణలు మరియు వెమాక్యులర్ వార్తాపత్రిక మధ్య ఏదైనా వ్యత్యాసం ఉంటే, అటువంటి సందర్భంలో ఆంగ్ల వార్తాపత్రిక స్థానిక వార్తాపత్రికను అధిగమిస్తుంది మరియు ఇది తుది కాపీగా పరిగణించబడుతుంది, తద్వారా అస్పష్టత తొలగించబడుతుంది.

స్థలం: హైదరాబాద్
తేది: 04-09-2025
సం. అధీకృత అధికారి
కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ కొరకు

Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS • DEPOSITS Translating Dreams into Reality

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
బ్రాంచ్ చిరునామా: నెం.4-1-1, గాయత్రి ప్లాజా, 1వ అంతస్తు, కొరిటిపాడు మెయిన్ రోడ్, హరిహర్ మహల్ థియేటర్ పక్కన, గుంటూరు-522007. ఫోన్ నెం.0863-2333064,
Mob: 7625079146, Email: guntur@canfinhomes.com, CIN: L85110KA1987PLC008699

డిమాండ్ నోటీసు

ది సెక్యూరిటి ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002(రూల్స్)లోని రూల్ 3(1)తో చదవగల ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంట్రెస్ట్ చట్టం, 2002 (SARFAESI చట్టం)లోని సెక్షన్ 13(2) క్రింద

ఏదైతే, దిగువ సంతకందారులు **కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్** యొక్కఅధీకృత అధికారిగా, SARFAESI చట్టంప్రకారం మరియు రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను అమలు చేస్తూ, క్రింద ఇవ్వబడిన వివరాల ప్రకారం, నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోపు, నోటీసులో పేర్కొన్న మొత్తాలను తిరిగిచెల్లించమని దిగువ జాబితా చేయబడిన రుణగ్రహీతలు/హామీదారులు (ఇకపై "సదరు రుణగ్రహీతలు" గా పేర్కొబడును) వారిని కోరుతూ సదరు చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద **డిమాండ్ నోటీసులు** జారీచేశారు. పేర్కొన్న నోటీసులు పోస్టల్ అధికారులు బట్వాడా చేయకుండా తిరిగివచ్చాయి/ రుణగ్రహీతలచే సక్రమంగా గుర్తించబడలేదు. అందువల్ల కంపెనీ చాలా జాగ్రత్తగా డిమాండ్ నోటీసు (రూల్ 3 (1)లోని నిబంధనల ప్రకారం) యొక్క ఈ ప్రచురణను ప్రభావితం చేస్తోంది. దిగువ సంతకందారు చట్టం ప్రకారం, పేర్కొన్న రుణగ్రహీతల చివరిగా తెలిసిన చిరునామాల చిరునామాలో ఈ నోటీసులను అతికించారు. రుణం యొక్క బకాయి తిరిగిచెల్లింపు కోసం సెక్యూరిటీగా, దిగువ వివరించిన విధంగా సంబంధిత పార్టీల ద్వారా కింది ఆస్తులు కంపెనీకి తనఖాపెట్టబడ్డాయి.

క్ర. సం.	రుణగ్రహీతలు/హామీదారుల పేరు చిరునామాతో	డిమాండ్ నోటీసు ప్రకారం క్లెయించేసిన మొత్తం	ఎన్‌పిఏ తేది
1	**1) శ్రీ.తాడికొండ రాంబాబు (రుణగ్రహీత1),** డోర్ నెం:3-5/3, గంగానమ్మ గుడి దగ్గర, చక్రాయపాలెం గ్రామం, కొల్లిపర మండలం-522301. **2) శ్రీమతి తాడికొండ పద్మావతి (రుణగ్రహీత 2),** డోర్ నెం.3-5/3, గంగానమ్మ గుడి దగ్గర, చక్రాయపాలెం గ్రామం, కొల్లిపర మండలం-522 301.	**మొత్తం బకాయిలు: రూ.13,14,437/-** (రూపాయలు పదమూడు లక్షల పద్నాలుగు వేల నాలుగు వందల ముప్పై ఏడు మాత్రమే) **డిమాండ్ నోటీసు తేదీ: 30/08/2025**	29-08-2025
	తనఖాపెట్టబడిన ఆస్తి యొక్కషెడ్యూల్: గుంటూరు జిల్లా, తెనాలి రెవెన్యూ డివిజన్, డి.నెం.78/1, డోర్ నెం:3-5/3, గంగానమ్మ దేవాలయం దగ్గర, చక్రాయపాలెం గ్రామ ఏరియాలో 69-75 చ.గ.లు లేదా 58.31 చ.మీ.ల విస్తీర్ణంలో ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు: **తూర్పు:** అడపాల అచ్చాయమ్మ & ఇతరుల ఆస్తి, **దక్షిణం:** తాడికొండ శ్రీనివాసరావు ఆస్తి, **పడమర:**చందు శంకర్ ఆస్తి, **ఉత్తరం:** తాడికొండ కోటేశ్వరరావు ఆస్తి.		
2	**1) శ్రీమతి శాఖమూరి లలిత కుమారి (రుణగ్రహీత),** డోర్‌నెం: 4-5-49/10, ఎఫ్.నెం-402, సుభం రెసిడెన్సీ, 2వ లైన్ బ్యాక్‌సైడ్, డోన్‌బోస్కో, కోరెటిపాడు, గుంటూరు-522007, **2) శ్రీ శాఖమూరి శ్రీనివాసరావు (సహ-రుణగ్రహీత),** డోర్ నెం.4-5-49/10, ఫ్లాట్ నెం.402, సుభం రెసిడెన్స్, 2వ లైన్ బ్యాక్‌సైడ్, డోన్‌బోస్కో, కోరెటిపాడు, గుంటూరు-522007.	**మొత్తం బకాయిలు: రూ.7,56,037/-** (రూపాయలు ఏడు లక్షల యాభై ఆరువేల ముప్పై ఏడు మాత్రమే) **డిమాండ్ నోటీసు తేదీ: 30-08-2025**	29-08-2025
	తనఖాపెట్టబడిన ఆస్తి యొక్కషెడ్యూల్: గుంటూరు రిజిస్ట్రేషన్ ఉప జిల్లా మరియు రిజిస్ట్రేషన్ జిల్లా గుంటూరులో 51 చదరపు గజాలు లేదా 42.65 చదరపుమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆస్తి. గుంటూరు డి.నెం.4/ఎఫ్, డోర్ నెం.5-60-2/200, ఎక 1-93 సెంట్లు, ఫ్లాట్ నెం.7, మున్సిపల్ డోర్ నెం.136-3-66, అసెస్‌మెంట్ నెం.5329/బి, 4వ లైన్ అశోక్‌నగర్, గుంటూరు నగరంలో ఉంది. సరిహద్దులు: **తూర్పు:** మున్సిపల్ రోడ్, **దక్షిణం:** మున్సిపల్ రోడ్, **పడమర:** జగ్గయ్య చౌదరి ఆస్తి, **ఉత్తరం:** గల్లి పాసేజ్.		

* పైన పేర్కొన్న తేదీ నుండి చెల్లింపు తేదీ వరకు అంగీకరించిన విధంగా ఒప్పంద రేట్లలో తదుపరి వడ్డీతో చెల్లించాలి.
ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి **60 రోజులలోపు** కాంట్రాక్ట్ వడ్డీ రేటుతో పైన పేర్కొన్న మొత్తాన్ని చెల్లించాలని మీరు ఇందుమూలంగా కోరుతున్నారు, లేనిపక్షంలో దిగువ సంతకందారులు పైన పేర్కొన్న సెక్యూరిటిని అమలు చేయడానికి SARFAESI చట్టం ప్రకారం చర్య తీసుకోవడానికి ముందుకుసాగుతారు. తదుపరిగా, సెక్యూర్డు అసెట్స్‌ను విడిపించుటకు వారికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 (8)లోని నిబంధనలపై రుణగ్రహీతలు/హామీదారుల దృష్టిని ఆహ్వానించారు.

తేది: 03-09-2025, ప్రదేశం: గుంటూరు **సం/- అధీకృత అధికారి, కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్**

యువకుడి దారుణ హత్య

ప్రజాశక్తి-ఆస్పరి

కర్నూలు జిల్లా ఆస్పరి మండల పరిధిలోని తొగలగల్లు గ్రామానికి చెందిన గొల్ల అహోబిలం (28)ను దారుణంగా హత్య చేసిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం కలపరి గ్రామంలో ఉన్న భార్య దగ్గరికి వెళ్లి స్వగ్రామానికి వస్తుండగా గ్రామ పొలిమేరలో హత్య చేశారు. మృతునికి భార్య గంగమ్మ, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.

టెంపుల్ టౌన్స్‌లో హోం స్టేలు

- రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శనకు పురాతన తాళపత్ర గ్రంథాలు
- సమీక్షలో సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టెంపుల్ టౌన్స్‌లో హోం స్టేలను ప్రోత్సహించాలని ముఖ్యంగా తిరుపతితోపాటు, ఇతర ప్రముఖ ఆలయాలు ఉన్న పట్టణాల్లో వీటిపై దృష్టి పెట్టాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అంబేద్కర్ కోనసీమలో గ్రామీణ వాతావరణం అనుభూతి చెందేలా హోం స్టేలను అభివృద్ధి చేయాలని, ఎన్ఆర్ఐలు కూడా ఇందులో పెట్టుబడులు పెట్టేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పర్యాటకశాఖపై సచివాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. విశాఖ, విజయవాడ, అమరావతి, తిరుపతి, అనంతపురం, కర్నూలు ఇలా వేర్వేరు ప్రాంతాల్లో నిరంతరం ఏదో ఒక పర్యాటక ఈవెంట్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సిఎం పేర్కొన్నారు. నిర్దేశించిన గడువులోగా పర్యాటక ప్రాంతాల్లో బస కోసం హోటల్ గదులను సిద్ధం చేయాలని ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చికి 10 వేల గదులు, 2029 నాటికి 50 వేల గదులు లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అనంతపురంలో డిస్నీ వరల్డ్ సిటీ ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రతినిధుల్ని సంప్రదించాలన్నారు. కుప్పంలో ఏనుగుల సఫారీ, విశాఖలో డాల్ఫిన్ షో వంటి ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. వివిధ ప్రాజెక్టుల పురోగతిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సమీక్షించారు. స్వదేశ్ దర్శన్‌లో బొర్రా గుహలు, అరకు, లంబసింగిలో పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రసాద్ పథకంలో భాగంగా సింహాచలం, అన్నవరం ఆలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపైనా సిఎం ఆరా తీశారు. తైద, అరకు, గండికోట, సూర్యలంక, బ్రిడ్జిలంక, లంబసింగి వంటి ప్రాంతాల్లో టెంట్ సిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. సుదీర్ఘ తీర ప్రాంతంలో బీచ్ ఫ్రంట్‌లను గుర్తించి అభివృద్ధి చేయాలని, సీ ప్లేన్ టూరిజానికి విజయవాడ-శ్రీశైలం, గండికోట-బెంగళూరు, విశాఖ-అరకు వంటి కొత్త మార్గాలను గుర్తించాలని ఆదేశించారు. విజయవాడలో దసరా ఉత్సవాలను మైసూర్ ఉత్సవాల తరహాలో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. పర్యాటక రంగానికి మరింత శోభ తెచ్చేలా అదనపు ఆకర్షణలు జోడించడంతోపాటు స్థానికంగా ఉన్న ఉత్పత్తులను కూడా బ్రాండింగ్ చేయాలని సిఎం స్పష్టం చేశారు. అరకు కాఫీ, ఎర్ర చెందనం బొమ్మలు, ఫర్నీచర్ వంటి ఉత్పత్తులను ఈవెంట్‌లలో ప్రదర్శించాలన్నారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి అందించనున్న ఆరు పురాతన తెలుగు తాళపత్ర గ్రంథాలను ఈ సందర్భంగా సిఎం పరిశీలించారు. ఈ సమీక్షలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ వర్చువల్‌గా పాల్గొనగా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి : మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ : పెనుకొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా టూరిజం అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. గొల్లపల్లి రిజర్వాయర్లో బోటింగ్, రెస్టారెంట్, అతిథిగృహం నిర్మాణం ప్రతిపాదనలు పంపాలని చెప్పారు.

6 నుంచి అంతర్జాతీయ లఘు చలన చిత్ర పోటీలు

ప్రజాశక్తి- పాలకొల్లు (పశ్చిమగోదావరి జిల్లా)

ఈ నెల 6వ తేదీ నుంచి పాలకొల్లులో ప్రారంభమయ్యే 4వ అంతర్జాతీయ లఘు చలనచిత్ర పోటీలకు 12 చిత్రాలు ఎంపికైనట్లు మాజీ ఎంపీ చేగొండి హరరామ జోగయ్య తెలిపారు. తన నివాసంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తీరం చేరని కెరటం, చివరి శ్వాస, పదిలం, మమ్మీ మహాలక్ష్మి, సైబర్ స్లేవరీ, నీ కోసం, సమతుల్యం, దియా, సరిహద్దు, మార్పు నీకోసం కాదు రేపటి కోసం, 733, బాలిగాడు చిత్రాలు ఎంపికైనట్లు చెప్పారు. మరో ఆరు చిత్రాలు ప్రత్యేక జ్యూరీ ప్రదర్శనకు ఎంపికైనట్లు తెలిపారు. వీటిలో మధులిక, చిన్ని, చిన్ని మనసులు, మైత్రి, దేశానికి రైతే ప్రాణం, కనిపించని త్యాగం, జయహో ఉన్నట్టు చెప్పారు. ప్రదర్శనలు రామచంద్ర గార్డెన్స్‌లో ఉంటాయని, ఈ సందర్భంగా ప్రముఖ సినీ దర్శకుడు బి.గోపాల్, సినీ నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, చెరుకూరి శ్రీనివాస్ రాజులకు జీవిత సాఫల్య పురస్కారాలు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రారంభ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు పాల్గొంటారని జాతీయ తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ తెలిపారు.

శాంతించని యమున

- ఢిల్లీలో రికార్డుస్థాయికి నీటిమట్టం



న్యూఢిల్లీ : దేశరాజధానిలో యమునా ఉగ్రరూపం దాల్చింది. మంగళవారం నుంచి ఉధృతంగా ప్రవహిస్తూ బుధవారం నాటికి ఢిల్లీ నది నీటి మట్టం 207.41 మీటర్లకు చేరుకుంది. 1978, 2023 తర్వాత నీటిమట్టం ఈ స్థాయికి చేరుకోవడం చరిత్రలో ఇది మూడోసారి. భారీ జలప్రవాహంతో యమునా బజార్, గీతా కాలనీ, కాశ్మీరీ గేట్, మయూర్ విహార్ తదితర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఇప్పటివరకు 14 వేల మందికిపైగా స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. 38 ప్రాంతాల్లో వరద శిబిరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఎగువన ఉన్న వజీరాబాద్, హథినీకుండ్ బ్యారేజీల నుంచి పెద్దమొత్తంలో వరదను విడుదల చేస్తుండటంతో ఢిల్లీలో యమునా నీటి మట్టం పెరుగుతోందని అధికారులు తెలిపారు. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. వరద నీటితో ఢిల్లీ ఔటర్ రింగ్ రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. వాసుదేవ్ ఘాట్, మొనాస్టరీ మార్కెట్, ఓల్డ్ ఢిల్లీ రైల్వే వంతెనను మూసివేశారు. ఢిల్లీలోని పురాతనమైన, అత్యంత రద్దీగా ఉండే నిగంబోధ్ ఘాట్ శ్మశానవాటిక కార్యకలాపాలు నిలిపివేశారు.

భారీ వరదల కారణంగా ఓఖ్లా బ్యారేజీ నుంచి మిగులు జలాలను దిగువకు వదులుతున్నారు. ఢిల్లీలో యమునా నీటి మట్టం 207 మీటర్ల మార్క్‌ను దాటడం 1963 తర్వాత ఇది ఐదోసారి. 2023లో దేశ రాజధానిని భారీ వరదలు ముంచెత్తినప్పుడు.. నీటి మట్టం అత్యధికంగా 208.66 మీటర్లకు చేరుకుంది. 1978లో 207.49, 2010లో 207.11, 2013లో 207.32 మీటర్లుగా నమోదైంది.

గాజాలో ఛిద్రమైన బాల్యం

- ఇజ్రాయిల్ దాడుల్లో వికలాంగులుగా మారిన 21 వేల మంది చిన్నారులు
- ఐరాస నివేదిక

గాజాస్ట్రిప్ : చదువులు, ఆటపాటలతో సరదాగా సాగిపోవాల్సిన బాల్యం గాజాలో ఛిద్రమైంది. ఇజ్రాయిల్ చేస్తున్న దారుణ దాడులు గాజాలో చిన్నారుల భవిష్యత్తును చిదిమేస్తున్నాయి. నిలువెల్లా గాయాలను మిగుల్చుతున్నాయి. 2023 అక్టోబరు నుంచి ఇప్పటివరకు దాదాపు 21 వేలమంది గాజా చిన్నారులు వికలాంగులుగా మారినట్లు ఐక్యరాజ్యసమతి నివేదిక వెల్లడించింది. వికలాంగుల హక్కులపై ఐరాస ఏర్పాటు కమిటీ ఈ నివేదికను ప్రచురించింది. గాజాలో మొత్తంగా 40,500 మంది పిల్లలు యుద్ధ సంబంధిత గాయాల బారినపడినట్లు తెలిపింది.

"ఇజ్రాయిల్ దాడుల్లో ఈ ఏడాది ఆగస్టు 21 వరకు దాదాపు 1.57 లక్షల మంది గాయపడ్డారు. వారిలో 25 శాతానికి శాశ్వత వైకల్య ప్రమాదం పొంచి ఉంది. సాయం పొందడంలో వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేకమంది ఆహారం, తాగునీరు, శుభ్రత లేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. వీరిలో 83 శాతం మంది చక్రాల కుర్చీ, వాకర్ల వంటి సహాయక పరికరాలను కోల్పోయారు.

దీంతో ప్రమాదకర, అమానవీయ పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వస్తోంది. మానవతా సాయాన్ని ఇజ్రాయిల్ అడ్డుకోవడం వారి జీవితాలను మరింత దుర్భరం చేస్తోంది" అని నివేదిక పేర్కొంది. వికలాంగులకు పెద్దఎత్తున మానవతా సాయం అందించాలని, వారి రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇజ్రాయిల్‌కు నివేదిక సూచించింది.

గాజాలో లక్షలాది మంది ఆకలి బాధతో జీవన్మరణ పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. అమెరికా, ఇజ్రాయిల్ మద్దతు కలిగిన 'గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో నాలుగు కేంద్రాల ద్వారా సాయం పంపిణీ చేస్తున్నారు. అయితే మిలిటరీ జోన్లలో ఉన్నాయి. జీహెచ్ఎఫ్ కేంద్రాల వద్ద వేచిచూస్తున్న సాధారణ ప్రజలపై దాదాపు ప్రతీరోజూ కాల్పులు జరుగుతున్నాయి. ఈ కాల్పుల్లో ఇప్పటికే వందల మంది మరణించారు.

ఖనిజాల రీసైక్లింగ్‌కు ప్రోత్సాహక పథకం

- కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ : దేశంలో కీలకమైన ఖనిజాల రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడానికి రూ. 1,500 కోట్ల ప్రోత్సాహక పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం కేంద్రమంత్రివర్గం సమావేశమైంది. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ఖనిజాల రీసైక్లింగ్ పథకం 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 సంవత్సరం వరకు ఆరు సంవత్సరాల కాలానికి వర్తిస్తుంది. ఇది కీలకమైన ఖనిజాల వెలికితీత కోసం బ్యాటరీ వ్యర్థాలు, ఈ-వ్యర్థాలను రీసైకిల్ చేసే సామర్థ్యాన్ని ప్రోత్సహిస్తుంది. కొత్త యూనిట్లలో పెట్టుబడి పెట్టడంతో పాటు ఇప్పటికే ఉన్న యూనిట్ల విస్తరణ, ఆధునీకరణ, వైవిధ్యీకరణకు ఈ పథకం వర్తిస్తుంది. యూనిట్‌కు మొత్తం ప్రోత్సాహకం పెద్ద యూనిట్లకు రూ.50కోట్లు, చిన్న యూనిట్లకు రూ.25 కోట్ల గరిష్ట పరిమితి ఉంటుంది. ఈ పథకం నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌లో భాగంగా ఉంటుంది. భారత్‌లో ఇలాంటి ఖనిజాల దేశీయ సరఫరా పెంచడం, సరఫరా గొలుసును బలోపేతం చేయడం దీని లక్ష్యం. వీటిని ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, ఇతర హైటెక్ పరిశ్రమలలో ఉపయోగిస్తారు. రీసైక్లింగ్ కోసం ఉపయోగించే ముడి పదార్థంలో ఈ-వ్యర్థాలు (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు), లిథియం అయాన్ బ్యాటరీ స్క్రాప్, పాత వాహనాల ఉత్ప్రేరక కన్వర్టర్లు, ఇతర స్క్రాప్ ఉంటాయి. మొత్తం రూ.1500 కోట్లలో మూడింట ఒక వంతు చిన్న, కొత్త రీసైక్లర్లకు కేటాయించారు. ఈ పథకం కింద రెండు రకాల సబ్సిడీలు అందుబాటులో ఉంటాయి. మొదటిది కాపెక్స్ సబ్సిడీ, దీని కింద ప్లాంట్, యంత్రాలను ఏర్పాటు చేయడానికి 20శాతం సబ్సిడీ అందుబాటులో ఉంటుంది.

సకాలంలో ఉత్పత్తిని ప్రారంభించే వారికి పూర్తి సబ్సిడీ ఇవ్వబడుతుంది. ఆలస్యమైతే తక్కువ సబ్సిడీ ఇస్తారు. రెండోది ఒపెక్స్ సబ్సిడీ. దీని కింద బేస్ ఇయర్ (2025-26) తో పోలిస్తే పెరిగిన అమ్మకాలకు బహుమతులు సైతం ఇస్తారు. 2026-27 నుండి 2030-31 వరకు, మొదటి దశలో 40శాతం సబ్సిడీ.. ఐదవ సంవత్సరం వరకు 60శాతం సబ్సిడీ ఇస్తారు. ఈ పథకం కింద కొన్ని పరిమితులు విధించారు. పెద్ద పరిశ్రమలకు మొత్తం సబ్సిడీ రూ.50కోట్ల వరకు.. చిన్న పరిశ్రమలు, స్టార్టప్‌లకు రూ.25కోట్ల వరకు ఉంటుంది. ఇందులో ఒపెక్స్ సబ్సిడీ పరిమితి వరుసగా రూ.10 కోట్లు.. రూ.5 కోట్లుగా నిర్ణయించారు. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఈ-వ్యర్థాలను ఉత్పత్తి చేసే దేశాలలో ఒకటిగా ఉంది. లిథియం, కోబాల్ట్, నికెల్, రాగి వంటి విలువైన ఖనిజాలు పాత మొబైల్స్, ల్యాప్‌టాప్‌లు, బ్యాటరీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు ఉన్నాయి.

గ్రామ పంచాయతీల ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు

ప్రభుత్వానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీ ఎన్నికల పదవీ కాలం వచ్చే ఏడాది ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు కార్యకలాపాలను నిర్వహించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ లేఖ రాసింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 2వ తేదీ నాటికి గ్రామ పంచాయతీల పదవీ కాలం ముగియనుంది. అప్పటిలోపు ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. అందుకోసం సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రిజర్వేషన్లు, డీలిమిటేషన్, ఖరారు వంటి ముందస్తు ఎన్నికల కార్యకలాపాలను పూర్తి చేయాల్సి ఉంది. పక్కనే ఉన్న పట్టణ స్థానిక సంస్థల్లోని పంచాయతీలను విలీనం చేయడం, పంచాయతీలను మున్సిపాల్టీలు, నగర పంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేయడం, డీలిమిటేషన్, రిజర్వేషన్లు వంటి ముందస్తు ఎన్నికల కార్యకలాపాలను ప్రభుత్వం నిర్వహించాల్సి ఉంది. ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసిన తర్వాతే రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. నిర్దేశిత గడువు లోపు ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ముందస్తు ఎన్నికల కార్యకలాపాలను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖకు, పిఆర్ అండ్ ఆర్‌డి, ఎన్నికల అథారిటీ కమిషనర్‌కు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ బుధవారం లేఖ రాశారు.

వృద్ధుల సంక్షేమం కోసం కమిషన్

- దేశంలోనే కేరళలో మొదటిసారి

తిరువనంతపురం : వృద్ధుల సంక్షేమం కోసం కేరళ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా వృద్ధుల కమిషన్‌ను నియమించింది. ఐదుగురు సభ్యులతో కూడిన కమిషన్‌ను బుధవారం నుంచి బాధ్యతలు చేపట్టినట్టు ప్రకటించింది. రాజ్యసభ ఎంపీ, కొల్లాం జిల్లా పంచాయతీ మాజీ అధ్యక్షులు, సామాజిక కార్యకర్త కె.సోమప్రసాద్ వృద్ధాప్య కమిషన్ చైర్మెన్‌గా నియమించింది. సభ్యులుగా అమరవిలా రామకృష్ణన్ (సీనియర్ సిటిజన్స్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ), ఇ.ఎం.రాధ (మహిళా కమిషన్ సభ్యురాలు , సామాజిక కార్యకర్త), కెఎన్‌కె నంబూద్రి (రచయిత , సీనియర్ సిటిజన్స్ సర్వీస్ కౌన్సిల్ వర్కింగ్ ప్రెసిడెంట్) , ప్రొఫెసర్ లోపెజ్ మాథ్యూలు (కాలేజీ మాజీ అధ్యాపకులు, కొట్టాయం జిల్లా పంచాయితీ సభ్యులు, కుసాట్ , ఎంజి విశ్వవిద్యాలయాల సిండికేట్ సభ్యుడు) నియమితులయ్యారు.

తిరువనంతపురంలోని సచివాలయంలో కమిషన్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మంత్రి ఆర్.బిందు సమక్షంలో నిర్వహించారు. నిర్లక్ష్యము, దోపిడీ, అనాథలు సహా వృద్ధుల జీవితాల్లో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి పెరుగుతున్న ఆందోళనలను అత్యవసరంగా పరిష్కరించడానికి ఈ కమిషన్ ఏర్పాటు చేసినట్టు మంత్రి ఆర్.బిందు తెలిపారు. వృద్ధుల హక్కులను పరిరక్షించడానికి, పునరావాసాన్ని సులభతరం చేయడానికి, వారి నైపుణ్యాలను ప్రజలకు ఉపయోగపడేలా అవసరమైన కార్యకలాపాలను చేపట్టడానికి ఈ కమిషన్ సహాయపడుతుందని అన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాల కేసులో జెపి వెంచర్స్‌కు షాక్

- రెండు వారాల్లో జరిమానా చెల్లించాలని సుప్రీం ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో గతంలో ఇసుక తవ్వకాలు జరిపిన జెపి వెంచర్స్‌కు సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపినందుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) విధించిన రూ. 18 కోట్ల జరిమానాను రెండు వారాల్లో డిపాజిట్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే జెపి వెంచర్స్‌పై ఎన్‌జిటి విధించిన జరిమానాపై గతంలో విధించిన స్టేను సుప్రీంకోర్టు తొలగించింది. అలాగే అక్రమ ఇసుక తవ్వకాలపై ఫిర్యాదు చేసిన దండా నాగేంద్ర కుమార్ దాఖలు చేసిన అఫిడవిట్‌ను ఈ సంద్భంగా సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకుంది. ఈ పిటిషన్‌ను సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్. కోటేశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌లో అక్రమ తవ్వకాల విస్తీర్ణానికి.. దండా నాగేంద్ర కుమార్ దాఖలు చేసిన అఫిడవిలో ఉన్న అక్రమ తవ్వకాల విస్తీర్ణానికి మధ్య ఉన్న తేడాను సుప్రీంకోర్టు ఈ సందర్భంగా గుర్తించింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తరపున దండా నాగేంద్ర కుమార్ ఇచ్చిన అఫిడవిట్‌లోని అంశాలను పరిశీలించి స్పష్టమైన అఫిడవిట్‌ను మరోసారి దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ అంశాన్ని పర్యవేక్షించాలంటూ కేంద్ర పర్యావరణ, అటవీశాఖకు సుప్రీంకోర్టు సూచించింది. ఇసుక అక్రమ తవ్వకందారుల నుంచి రికవరీ అంశం ఎంత వరకు వచ్చిందంటూ సుప్రీంకోర్టు ప్రశ్నించింది. వారిని సైతం ఇందులో ప్రతివాదులుగా చేరుస్తూ సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇక జరిమానా చెల్లించకుండా హైకోర్టుకు వెళ్లిన అక్రమ ఇసుక దారులకు సంబంధించిన కేసులో త్వరిత గతిన తీర్పును వెల్లడించాలని హైకోర్టుకు సుప్రీం సూచించింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

ఏకపక్ష సంస్కరణలతో అనర్థమే

రాష్ట్రాల ఆదాయానికి 'జిఎస్‌టి' గండి

- పరిహార ప్యాకేజీ రూపొందించాల్సిందే
- ప్రతిపక్ష రాష్ట్రాల ఆర్థిక మంత్రుల డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటించిన వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) సంస్కరణల వల్ల రాష్ట్రాల ఆదాయానికి భారీగా నష్టం వాటిల్లనుందని, ఇందుకు పరిహారంగా కేంద్ర ప్రభుత్వం తగిన ప్యాకేజీ రూపొందించి రాష్ట్రాలకు అందించాల్సిందేనని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు డిమాండ్ చేశారు. జిఎస్‌టి కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యేందుకు ఢిల్లీకి విచ్చేసిన వీరంతా బుధవారం స్థానిక తమిళనాడు భవన్‌లో సమావేశమయ్యారు. ఈ భేటీలో 8 ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ..హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు పాల్గొన్నారు. జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ఐక్య వైఖరి తీసుకోవాలని ఈ భేటీలో నిర్ణయించారు. కేంద్రం పరిహార ప్యాకేజీకి సిద్ధంగా లేకుంటే జిఎస్‌టి సంస్కరణలకు మద్దతు ఇవ్వరాదని నిర్ణయించాయి. జిఎస్‌టి రేటు సవరణ అమలు తరువాత అన్ని రాష్ట్రాలు ఎదుర్కొన్న ఆదాయ నష్టానికి పరిహారం కోరాలని నిర్ణయించారు. జిఎస్‌టి శ్లాబుల సంఖ్యను తగ్గించాలనే కేంద్ర ప్రతిపాదనను అమలు చేస్తే రాష్ట్రాలు భారీగా ఆదాయాన్ని కోల్పోతాయని, తమ రాష్ట్రానికి రూ.2,000 కోట్ల నష్టం వాటిల్లుతుందని జార్ఖండ్ ఆర్థిక మంత్రి రాధా కృష్ణ కిశోర్ తెలిపారు. అందువల్ల రాష్ట్రాలకు తగిన పరిహార ప్యాకేజీ ప్రకటిస్తేనే..జిఎస్‌టి సంస్కరణల విషయంలో అజెండా ముందుకెళ్తుందని, లేదంటే తాము వ్యతిరేకించక తప్పదని ఆయన పేర్కొన్నారు.



ఢిల్లీలోని తమిళనాడు భవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ప్రతిపక్షపాలిత రాష్ట్రాల ఆర్థిక మంత్రులు

జిఎస్‌టి సంస్కరణల విషయంలో భాగస్వామ్యపక్షాలతో తగిన సంప్రదింపులు చేయకుండానే..సమగ్ర అధ్యయనం చేయకుండానే ఏకపక్షంగా కేంద్రం తెరపైకి తీసుకొచ్చిందని, వీటి వల్ల రాష్ట్రాలకు భారీగా ఆర్థిక నష్టం వాటిల్లుతుందని కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క కేరళకే దాదాపు రూ.10 వేల కోట్లు నష్టం వాటిల్లనున్నట్లు ఆయన విశ్లేషించారు. ఈ నష్టాలను భర్తీ చేయడానికి కేంద్రం సిద్ధంగా లేకపోతే, రాష్ట్రాల ఉనికిపైనే ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.

తమిళనాడు ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు ఈ సంస్కరణలతో రాష్ట్రాలపై ప్రభావం పడుతోందని అన్నారు. రాష్ట్రాల ఆదాయ నష్టంపై చర్చించామని కోరుతున్నామని హిమాచల్‌ప్రదేశ్ సాంకేతిక విద్యా శాఖ మంత్రి రాజేష్ ధర్మాని అన్నారు. తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ జిఎస్‌టి సంస్కరణలు ఏకపక్షంగా తీసుకొచ్చారని, దీనిపై కౌన్సిల్‌లో చర్చ జరుగుతోందన్నారు. జిఎస్‌టి రేటు హేతుబద్ధీకరణ కారణంగా మొత్తం ఆదాయ నష్టం రూ.47,700 కోట్లుగా ఉంటుందని పశ్చిమ బెంగాల్ ఆర్థిక మంత్రి చంద్రిమ భట్టాచార్య తెలిపారు.

ఇండోర్ ఆసుపత్రిలో ఘోరం

- ఐసియులో ఎలుకలు కొరికి ఇద్దరు శిశువులు మృతి

ఇండోర్ : మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లోని మహారాజా యశ్వంతరావు ఆసుపత్రిలో ఐసియులో ఎలుకలు కొరకడంతో ఇద్దరు శిశులు ప్రాణాలు కోల్పోయారు. గంటల వ్యవధిలోనే ఈ దారుణాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ నిర్వహణలోని ఈ ఆసుపత్రిలో మంగళ, బుధవారాల్లో వెంట వెంటనే నవజాత శిశువులు ఎలుకలకు బలికావడంతో సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. అత్యంత శుభ్రత, భద్రత ఉండాల్సిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసియు)లో పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ఇక సాధారణ వార్డుల్లో పరిస్థితి ఇంకెతటి ఘోరంగా ఉందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. బిజెపి చెబుతున్న డబుల్ ఇంజిన్ అభివృద్ధి అంటే ఇదేనా అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మృతి చెందిన శిశువుకు ఏడు రోజుల క్రితం శస్త్రచికిత్స జరిగింది.

అప్పట్నించి ఆసుపత్రిలోనే చికిత్స పొందుతోంది. బాలిక ఎడమ చేతి రెండు వేళ్లను ఎలుకలు కొరికి వేశాయి. కుటుంబ సభ్యుల కోరిక మేరకు శిశువు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించలేదని, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ తెలిపారు. కాగా, ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా ఇద్దరు నర్సింగ్ అధికారులను సస్పెండ్ చేశారు. ఒక నర్సింగ్ సూపరింటెండెంట్‌ను ఆ పదవి నుంచి తొలగించారు. అలాగే, ఆసుపత్రి నిర్వహణ, శుభ్రపరచడం కోసం ఒప్పందం కుదుర్చుకున్న ప్రైవేట్ సంస్థకు రూ.లక్ష జరిమానా విధించారు.

సిఎఎ కటాఫ్ డేట్ పొడిగింపు

న్యూఢిల్లీ : పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) కటాఫ్ డేట్‌ను కేంద్రం పొడిగించింది. అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ నుంచి మతపరమైన హింస నుంచి తప్పించుకోవడానికి 2024 డిసెంబర్ 31లోపు భారత్‌కు వలస వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రైస్తవ మతాలకు చెందినవారు పాస్‌పోర్ట్, ఇతర ప్రయాణ పత్రాలు లేకుండా దేశంలో ఉండటానికి అనుమతిస్తామని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది అమల్లోకి వచ్చిన పౌరసత్వ సవరణ చట్టం ప్రకారం 2014 డిసెంబర్ 31న లేదా అంతకుముందు భారత్‌కు వలసవచ్చిన ముస్లింమేతర మైనార్టీలకు భారత పౌరసత్వం మంజూరు చేస్తామని ప్రకటించింది. ఇప్పుడు సిఎఎ కటాఫ్ తేదీని పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

వారికి నో ఎంట్రీ

దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి దోషులుగా తేలిన వారిని భారత్‌లోకి ప్రవేశించకుండా అడ్డుకుంటామని కేంద్రం వెల్లడించింది. దీంతో పాటు గూఢచర్యం, లైంగికదాడి, హత్య, ఉగ్రవాద చట్టాలు, పిల్లల అక్రమ రవాణా, నిషేధిత సంస్థల్లో సభ్యులుగా ఉన్నవారిని దేశంలోకి రానివ్వబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ప్రవేశపెట్టిన ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారెనర్స్ యాక్ట్ 2025 కింద ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. దీని ప్రకారం ప్రతి రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వాలు ఇందుకోసం చర్యలు తీసుకోవాలని సూచించింది.

సుంకాలతో ఏడు యుద్ధాలు ఆపేశా !

- తీరు మారని ట్రంప్

వాషింగ్టన్ డిసి : అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాల పెంపును సమర్థించుకున్నారు. కేవలం సుంకాల పెంపు కారణంగానే ప్రపంచంలో ఏడు యుద్ధాలను పరిష్కరించామని ఆయన పేర్కొన్నారు. టారిఫ్‌ల వల్ల అమెరికాకు గొప్ప చర్చల సామర్థ్యాన్ని అందిస్తుందని తెలిపారు. అమెరికా స్పేస్ కమాండ్ ప్రధాన కార్యాలయాన్ని అలబామాలోని హంట్స్‌విల్లేకు తరలిస్తున్నట్టు ప్రకటించిన సందర్భంగా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. మరోవైపు తన ఆరోగ్యంపై వస్తున్న వార్తలపై కూడా ట్రంప్ స్పందించారు.'సుంకాలు ఓ మాయా చర్చల సాధనం. సుంకాలు పెంపు అమెరికా ఆర్థిక వ్యవస్థకే కాకుండా ఏడు యుద్ధాలను పరిష్కరించడానికి సహాయపడింది. అమెరికా చాలా పెద్ది, అలాగే శక్తిమంతమైన దేశం. అమెరికా లేకపోతే ప్రపంచంలో ఏది ఉండదు. మొదటి నాలుగు సంవత్సరాల్లో అమెరికా శక్తిమంతమైన దేశంగా చేశా. కానీ ఆ తర్వాత వచ్చిన జో బైడెన్ సర్కార్‌తో క్షీణించడం ప్రారంభమైంది. టారిఫ్‌లు మా



దేశాన్ని ఆర్థికంగా అత్యంత శక్తివంతంగా మార్చాయి. మేం ఇప్పటి వరకు ఊహించని స్థాయికి చేర్చాం. ప్రపంచంలో మేం ఉత్తమం. అలాగే వేగంగా ఎదుగుతున్న దేశం. టారిఫ్‌ల వల్లనే ఇది సాధ్యమైంది. నేను ఏడు యుద్ధాలను పరిష్కరించా. వాటిలో చాలా యుద్ధాలు వాణిజ్యం కారణంగానే జరిగాయి.' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ఆ ముగ్గురూ కుట్ర పన్నుతున్నారు..

కాగా చైనా విక్టరీ పరేడ్ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తరకొరియా నాయకుడు కిమ్‌జోంగ్ ఉన్ ఒకే వేదిక పంచుకోవడంపైనా ట్రంప్ నోరుపారేసుకున్నారు. ఆ ముగ్గురు యూఎస్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్ వేదికగా ఆయన ఓ పోస్టు పెట్టారు. రెండో ప్రపంచ యుద్ధంలో చైనా కోసం పోరాడిన అమెరికా సైనికుల త్యాగాలను గుర్తించాలన్నారు. నాటి పోరాటంలో ఎంతోమంది యూఎస్ సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. వారి ధైర్యం, త్యాగాలను జిన్‌పింగ్ గుర్తించి, గౌరవిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, చైనా ప్రజలకు ట్రంప్ శుభాకాంక్షలు తెలిపారు. కిమ్ , పుతిన్‌లకు అభినందనలు తెలుపుతూనే వారు అమెరికాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని ట్రంప్ ఆరోపించారు.

ఉత్తరాదిన వర్ష బీభత్సం

- డ్యాం కూలి ముగ్గురు, కొండచరియలు విరిగి ఆరుగురు మృతి
- ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి :రాహుల్ గాంధీ డిమాండ్

మండి : ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఆకస్మిక వరదల కారణంగా పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో అకస్మాత్తుగా కొండచరియలు విరిగిపడి ఆరుగురు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లోనూ ఆకస్మిక వరదలు కారణంగా నలుగురు మరణించారు. ముగ్గురు గల్లంతయ్యారు. ఇక జమ్మూకాశ్మీర్‌లోనూ భారీ వర్షాల కారణంగా నదులు పొంగిపొర్లుతున్నాయి. నీటి మట్టాలు పెరగడం వల్ల అనేక ఇండ్లు నీట మునిగాయి. ఢిల్లీలోని యమునా నది ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తుండటంతో సమీపంలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోవైపు వరద బాధిత రాష్ట్రాలకు ప్రత్యేక సహాయ ప్యాకేజీని ప్రకటించాలని లోక్‌సభ విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హిమాచల్‌లో విరిగిపడిన కొండచరియలు

కుండపోత వర్షాల కారణంగా మండి జిల్లా సుందర్‌నగర్ పట్టణంలో మంగళవారం సాయంత్రం కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో రెండిండ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు ఆరుగురు మృతి చెందారు. ఈ విషయం గురించి సమాచారం అందు కున్న భారత్ సైన్యం, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద చిక్కుకున్న ఒక మహిళ, ఓ బాలికను రక్షించి ఆస్పత్రికి తరలించాయి. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించారు. శిథిలాల కిందే ఇంకా కొంతమంది ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇంకా



ఢిల్లీలో ముంపు ప్రాంతాల్లోని ప్రజలను పడవల ద్వారా రక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న సహాయక సిబ్బంది

సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సమీపంలోని 15 ఇండ్లను ఖాళీ చేయించినట్టు పోలీసులు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో నలుగురు మృతి

మరోవైపు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బలరాంపూర్‌లో మంగళవారం రాత్రి ఆనకట్ట కూలిపోవడంతో ఆకస్మిక వరదలు సంభవించాయి. దీంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు గల్లంతయ్యారు. 1980లో నిర్మించిన ఈ ఆనకట్ట కూలడంతో వరద నీరు సమీపంలోని ఇండ్లు, పంటల పొలాల్లోకి ప్రవేశించాయి. మిగిలిన వారి కోసం రెస్క్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

ఉప్పొంగుతున్న నదులు

జమ్మూకాశ్మీర్‌లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. నదుల నీటి మట్టం కూడా గణనీయంగా పెరిగింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పలు జిల్లాలను వరదలు ముంచెత్తాయి. ఈ వర్షాలు కారణంగా కొండ చరియలు, క్లౌడ్ బరస్ట్ సంభవించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటిలో నుంచి ఎవరు బయటకు రావొద్దని సూచించారు. ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలకు సెలవు ప్రకటించారు. ప్రస్తుతం పరిస్థితులపై సమీక్షించేందుకు సీఎం ఒమర్ అబ్దుల్లా అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తక్షణ సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. అధికారుల సలహాలను పాటిస్తూ సురక్షితంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

తక్షణమే ఆదుకోండి

- కేంద్రానికి ఎఐకెఎస్ డిమాండ్

న్యూఢిల్లీ : భారీ వర్షాలకు వ్యవసాయ రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో పరిస్థితి దారుణంగా ఉందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ వరదల కారణంగా లక్షలాది ఎకరాల్లోని పంటలు నాశనమయ్యాయని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేసింది. హిమాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వివిధ ఆనకట్టల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారని దీంతో బియాస్, సట్లైజ్ నదులు పొంగిపొర్లుతున్నాయని, ఫలితంగా వచ్చిన వరదలు చేతికి అంది వచ్చిన పంటలకు విస్తృత నష్టాన్ని కలిగించాయని ఎఐకెఎస్ తెలిపింది. భారీ వర్షాలకు నాలుగురాష్ట్రాల్లోనూ 320 మందికిపైగా మరణించారని, వందలాది పశువులు మృతి చెందాయని తెలిపింది.

పంజాబ్‌లో సుమారు 3 లక్షల ఎకరాల్లో పంటలు పూర్తిగా లేదా పాక్షికంగా మునిగిపోయాయని, 3.5 లక్షలకు పైగా ప్రజలు వరదలకు ప్రభావితమయ్యారని తెలిపింది. హర్యానాలోని 12 జిల్లాల్లో దాదాపు 2.5 లక్షల ఎకరాల పంట నాశమైనట్లు తెలిపింది. హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకాశ్మీర్‌ల్లో దాదాపు 25 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలు నష్టపోయాయని తెలిపింది. ఈ రాష్ట్రాలకు కేంద్రం సమగ్ర సహాయ ప్యాకేజీని వెంటనే విడుదల చేయాలని కోరింది. అలాగే, ఈ నాలుగు రాష్ట్రాల ప్రజలకు ఎఐకెఎస్ సంఘీభావాన్ని ప్రకటించింది. సహాయ నిధికి విరాళాలు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ప్రకృతి విపత్తుతో పోరాడుతున్న శ్రామిక ప్రజలకు సహాయం చేయడానికి పెద్ద ఎత్తున కదలిరావాలని ఎఐకెఎస్ పిలుపునిచ్చింది.

న్యాయాన్ని అపహాస్యం చేయడమే

- ఉమర్ ఖలీద్, షార్జిల్ ఇమామ్‌కు బెయిల్ తిరస్కృతిపై సిపిఎం విచారం

న్యూఢిల్లీ : ఢిల్లీ అల్లర్ల కేసులో ఉమర్ ఖలీద్, షార్జిల్ ఇమామ్‌లతో సహా పది మందికి ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించడంపై సిపిఎం తీవ్రంగా విచారం వ్యక్తం చేసింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. 2020 ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగిన మత ఘర్షణల వెనుక కుట్రలో పాత్ర వుందంటూ నిరంకుశ యుఎపిఎ కింద వీరందరినీ ఐదేళ్ళుగా నిర్బంధంలో వుంచారు. గత ఐదేళ్ళలో వారి బెయిల్ దరఖాస్తులను తిరస్కరించడం ఇది ఐదవసారి. గత ఐదేళ్ళ కాలంలో వారిపై కనీసం అభియోగాలు కూడా మోపకపోవడం మరింత ఆందోళన కలిగించే అంశమని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఢిల్లీ హైకోర్టు తీసుకున్న నిర్ణయం న్యాయాన్ని అపహాస్యం చేసేలా వుందని పేర్కొంది. "బెయిల్ మంజూరు చేయడం నిబంధన, తిరస్కరించడం మినహాయింపు" అన్న సూత్రాన్ని కూడా ఇది తిరస్కరిస్తోందని పొలిట్‌బ్యూరో ప్రకటన పేర్కొంది.

నేరం చేశారని నిరూపితమవకుండా కనీసం అందుకు రుజువులు కూడా లేకుండానే ఐదేళ్ళకు పైగా ఈ పది మంది యువకులు ఒకపక్క జైలులో మగ్గుతుంటే, కపిల్ మిశ్రా, అనురాగ్ థాకూర్ వంటి బిజెపి నేతలు మాత్రం అదే ఢిల్లీ మత ఘర్షణలకు ఆజ్యం పోసేలా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి బయట స్వేచ్ఛగా తిరుగుతున్న విషయాన్ని ఇక్కడ గమనించాలని కోరింది. మాలెగావ్ బాంబు పేలుళ్ళ కేసులో నిందితులు ప్రజ్ఞా సింగ్ థాకూర్, కల్నల్ ప్రసాద్ పురోహిత్ తదితరులను నిర్దోషులుగా విడిచిపెడితే, ఉమర్ ఖలీద్, షార్జిల్ ఇమామ్ ప్రభృతులను ఐదేళ్ళకు పైగా జైళ్ళలో మగ్గేలా చేయడం తీవ్రమైన న్యాయ విరుద్ధమని పొలిట్‌బ్యూరో విమర్శించింది.

ఇఫ్‌టిఎతో భారత్ స్వేచ్ఛా వాణిజ్యం

- అక్టోబర్ నుంచి అమల్లోకి..

న్యూఢిల్లీ : యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఇఎఫ్‌టిఎ)తో భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అక్టోబర్ ఒక్కటో తేది నుంచి అమల్లోకి రానుందని స్విట్జర్లాండ్ బుధవారం ప్రకటించింది. ఇది భాగస్వామ్యం దేశాల సమాగ్రాభివృద్ధికి దోహదం చేయడంతో పాటుగా చట్టబద్ధమైన నిబంధనలను కలిగి ఉందని పేర్కొంది. ఇఫ్‌టిఎ బ్లాక్‌లో ఐస్‌లాండ్, లీచ్టెన్‌స్టీన్, నార్వే, స్విట్జర్లాండ్ దేశాలున్నాయి. 2024 మార్చిలో ఇరు పక్షాలు ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందంలో భాగంగా భారత్‌లో వచ్చే 15 సంవత్సరాలలో ఇఫ్‌టిఎ 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. మొదటి 10 సంవత్సరాలలో 50 బిలియన్ డాలర్లు, తదుపరి 5 సంవత్సరాలలో మరో 50 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా రానున్నాయి. ఈ పెట్టుబడితో భారత్‌లో 10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టిస్తుందని అంచనా. ఈ తరహా నిబంధన భారతదేశ వాణిజ్య ఒప్పందాలలో తొలిసారి చోటు చేసుకుంది. దీనికి బదులుగా భారతదేశం స్విస్ వాచీలు, చాక్లెట్లు, కట్ అండ్ పాలిష్డ్ డైమండ్స్ తదితర ఇఫ్‌టిఎ ఎగుమతులపై సుంకాలను తగ్గించడం లేదా తొలగించడానికి అంగీకరించింది. "ఇది స్విస్ వస్తువులు, సేవలకు భారతీయ మార్కెట్‌కు మెరుగైన ప్రవేశాన్ని అందిస్తుంది. మా ఉత్పత్తులకు భారత్ మెరుగైన మార్కెట్ అవకాశాలను కలిపిస్తుంది. తమ ఎగుమతులలో ఔషధ ఉత్పత్తులు, యంత్రాలు, ఆప్టికల్ ఇన్‌స్ట్రుమెంట్‌లు, వాచీలు, ప్రాసెస్ చేసిన వ్యవసాయ ఉత్పత్తులు ఉన్నాయి." అని స్విట్జర్లాండ్ తెలిపింది. "ఈ ఒప్పందంతో సంబంధం ఉన్న భాగస్వామ్య దేశాల పర్యావరణ, కార్మిక చట్టాలు లేదా అంతర్జాతీయ పర్యావరణ, సామాజిక చట్టాలు ఉల్లంఘించకుండా చూస్తుంది." అని స్విట్జర్లాండ్ తెలిపింది.

మానవ గౌరవం రాజ్యాంగం ఆత్మ

- సిజెఐ బిఆర్ గవాయ్

న్యూఢిల్లీ : మానవ గౌరవాన్ని (హ్యూమన్ డిగ్నిటీ) రాజ్యాంగం యొక్క ఆత్మగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ అభివర్ణించారు. వ్యక్తిగత స్వేచ్ఛ, ఎంచుకునే అవకాశం, సమానత్వం, సోదరభావం వంటి ప్రధాన విలువలకు మూలం మానవ గౌరవమేనని తెలిపారు. బుధవారం డాక్టర్ ఎల్‌ఎం సింఘ్వీ 11వ స్మారక ఉపన్యాసంలో జస్టిస్ గవాయ్ కీలక ప్రసంగం చేశారు. మహిళలు, ఖైదీలు, సాధారణ కార్మికులు, వికలాంగులు, అణగారిన-మైనార్టీల జీవితాలను మెరుగుపర్చడానికి వివిధ తీర్పుల ద్వారా మానవ గౌరవ హక్కును సుప్రీంకోర్టు సమర్థించిందని గుర్తుచేశారు. రాజ్యాంగం తన ప్రాథమిక విలువలకు లోబడుతూనే అధునిక సామాజిక సవాళ్లకు ప్రతిస్పందిస్తుందని తెలిపారు. న్యాయమైన, సమానత్వ సమాజం అనే వారి దార్శనికతకు మానవ గౌరవం ముడిపడి ఉందని అన్నారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల అధ్యాయంలో 'మానవ గౌరవం' అనే పదాన్ని నిర్వచించనప్పటికీ సుప్రీంకోర్టు తన తీర్పుల ద్వారా ఈ పదం అర్థాన్ని విస్తరించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి ప్రసంగించారు.

గవర్నర్లు కేవలం ప్రతీకాత్మకమే

(మొదటిపేజీ తరువాయి)

ఆ సభలు కూడా ఉన్నత రాజ్యాంగ వ్యవస్థలేనని వాదించాయి. రాష్ట్రపతి పంపిన ప్రస్తావనపై సుప్రీంకోర్టులో ఏడవరోజైన బుధవారం కూడా ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ కొనసాగించింది.

గవర్నర్లకు బిల్లులు పంపేది ఆమోదించడానికే : కపిల్ సిబల్

ఈ విచారణలో భాగంగా పశ్చిమ బెంగాల్ తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ..చట్ట సభలు బిల్లులను గవర్నర్లకు పంపేది ఆమోదించడానికేనని నొక్కి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కావాలంటే రాష్ట్ర చట్టాన్ని రద్దు చేయవచ్చని లేదా కోర్టుల్లో సవాలు చేయవచ్చన్నారు. కానీ గవర్నర్లు బిల్లులను తొక్కిపట్టరాదని పేర్కొన్నారు. కేంద్రం కూడా ప్రజల సంకల్పాన్ని, వారి అభీష్టాన్ని గౌరవించాల్సిందేనని తెలిపారు. హిమాచల్ ప్రదేశ్ తరపున వాదనలు వినిపిస్తున్న కేంద్ర మాజీ మంత్రి, న్యాయవాది ఆనంద్ శర్మ మాట్లాడుతూ, రాష్ట్రపతి లేదా గవర్నర్లు కనీసం పార్లమెంట్‌ను లేదా అసెంబ్లీలను సమావేశపరచడం కూడా చేయరని అన్నారు. ఆ ప్రక్రియ అంతా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. కర్ణాటక తరపున గోపాల్ సుబ్రమణియం మాట్లాడుతూ, ఒకే రాష్ట్రంలో ద్వంద్వ పాలన (గవర్నర్ మరియు రాష్ట్ర ప్రభుత్వం) వుండరాదంటూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉటంకించారు.

నష్ట పరిహారంపై స్పష్టత లేదు

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతుందని భావిస్తున్నారు. అయితే ఇవి ప్రధాని మోడీ ప్రకటించిన సంస్కరణలు కాబట్టి, బిజెపి పాలిత రాష్ట్రాలు వాటిని బహిరంగంగా వ్యతిరేకించటం లేదు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఉన్న ఆంధ్రప్రదేశ్ కూడా సంస్కరణలకు తన మద్దతును ప్రకటించింది.

జిఎస్‌టి సంస్కరణలకు మద్దతు : మంత్రి పయ్యావుల కేశవ్

జిఎస్‌టి సంస్కరణలకు మద్దతు ఇస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం ప్రతిపాదిస్తున్న జిఎస్‌టి సంస్కరణలను సమర్థిస్తుందని, ఇవి "పేదల్లోని పేదల ప్రయోజనాల కోసం" ఉద్దేశించబడ్డాయని ఆయన చెప్పారు. ఈ సంస్కరణలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ "దీపావళి బహుమతి" ప్రకటనకు అనుగుణంగా ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా ఆహారం, విద్య, ఆరోగ్యం, ఉక్కు, సిమెంట్, వస్త్ర రంగాలకు సంబంధించిన సంస్కరణలను స్వాగతిస్తున్నట్లు చెప్పారు.

యూరియాకు ఇ-క్రాప్ లింక్

(మొదటిపేజీ తరువాయి)

స్మగ్లింగ్ చేయడం వంటి పనులను వైసిపి తన మనుషుల చేత చేయిస్తూ గొడవలు చేస్తోందని మండిపడ్డారు. కృష్ణా జిల్లాకు చెందిన వైసిపి కార్యకర్తలు వాసు, రామ్మూర్తి, వెంకటేశ్వరరావు, ఈశ్వరరావు యూరియా లారీ హైజాక్ చేశారని తెలిపారు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి పక్కదారి పట్టించడం, స్మగ్లింగ్ చేయడం, ఇతర వాటికోసం యూరియాను ఉపయోగిస్తే చాలా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అసెంబ్లీలో సమస్యలపై చర్చించమంటే ప్రతిపక్షహోదా అడుగుతున్నారని తెలిపారు. ప్రతిపక్ష హోదాకు తగరనే ప్రజలు వైసిపికి 11 సీట్లు ఇచ్చారని చెప్పారు. ప్రతిపక్షం కావాలంటే అసెంబ్లీలో సంఖ్యాబలం 19 ఉండాలని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అని ఎవరు చెప్పారు?

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తారని ఎవరు చెప్పారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమర్థతను పెంచేందుకు ప్రభుత్వాలు కచ్చితంగా కొన్ని సర్వీసులను అవుట్‌సోర్సింగ్ చేస్తారని, ఈ నెపంతో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు, ఆ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

వివిధ జిల్లాల్లో ఎరువుల కోసం రైతులు బారులుతీరి నిల్చున్న ఫొటోలు మీడియాలో వస్తున్నా రాష్ట్రంలో యూరియా కొరత లేదని ముఖ్యమంత్రి చెప్పడం గమనార్హం.

జీవన సౌరభం

సక్సెస్ స్టోరీల్లో మెసేజ్‌లు మాత్రమే ఉంటాయి. ఫెయిల్యూర్ స్టోరీల్లో విజయానికి కావాల్సిన ఐడియాలు దొరుకుతాయి.

మీ కోసం

కొద్దిగా నిమ్మరసం, గుడ్డులోని తెల్లసొన కలిపి, తలకు పట్టించి అరగంట తర్వాత తలస్నానం చేస్తే జుట్టు బాగా పెరగడమే కాకుండా, ఎంతో మృదువుగా ఉంటుంది.



JEEVANA జీవన the family

గురువు

బాలలందరిని ఓర్పుగా
లాలించు వారు
పిల్లలందరిని నేర్పుగా
పాలించు వారు,
పిన్నలకు పెద్దలకు దారి
చూపే దీపం,
జ్ఞాన కాంతులందించు
దివ్య రూపం,
విశ్వ వెలుగులు నింపిన
నిండైన మూర్తి,
లోకమంతా నిండిన
చైతన్య మూర్తి
అతని తోడిదే ఈ సుగతి
జగతి అంతా నిల్పె ప్రగతి
బడులలో జ్యోతి గురువు
కళాశాలల కళలు గురువు
విశ్వ విద్యలెల్ల తానై గురువు
గుడులన్నిట వెలిగే గురువు
దేశమే నినదించు నేడు
మన సర్వేపల్లి గురువు
ఎందరెందరో వన్నె తెచ్చిన
నేటి మేటి గురువులు
గురువులనెపుడు మదిన గౌరవించు!
గురు పూజోత్సవం నాడు పూజించు!

– బెహరా ఉమామహేశ్వరరావు,
92900 61336.

జ్ఞానమిచ్చే వెలుగు

చదువులో మెళకువలు నేర్పేవాడు
పాఠాలను కథలుగా చెప్పేవాడు

మెదళ్లలో మేథస్సుని నింపేవాడు
జ్ఞానాన్ని వర్షంలా కురిపించేవాడు

భవిష్యత్తుకు బాటలు వేసేవాడు
సత్యం మార్గంలో నడిపించేవాడు

మీరు లేనిదే విద్య లేదు
మిమ్మల్ని గౌరవించని జీవితం లేదు

జ్ఞానమిచ్చే వెలుగు మీరు
గమ్యం చూపే దారి మీరు
ఓ గురువా, మీకు వందనం!

– చిత్రాడ కిషోర్ కుమార్,
98669 12906.

నేను గీసిన బొమ్మ





ఎస్ భార్గవి,
7వ తరగతి,
ఎపి మోడల్ స్కూల్,
రొంపిచర్ల గ్రామం,
పల్నాడు జిల్లా.





ఎం.అఖిల్, 7వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
పోతారెడ్డిపేట, అక్బర్ పేట,
సిద్ధిపేట జిలా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నేత్రదానంతో కొత్త చూపు


సెప్టెంబర్ 8 వరకూ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

ఒక మనిషి మరణించినా మరొకరి ద్వారా లోకాన్ని చూడొచ్చు. ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించొచ్చు. జీవితం చీకటిమయంగా మారిందని బాధపడేవారి జీవితాల్లో వెలుగులు నింపొచ్చు. ఈ అవకాశం ఒక్క నేత్రదానంతోనే సాధ్యమవుతుంది. అందుకే సర్వేంద్రియానం నయనం ప్రధానం అంటారు పెద్దలు. కళ్లకు ఉన్న ప్రాధాన్యం అమూల్యం. నేత్రదానంతో పలువురు జీవితాల్లో వెలుగులు నింపొచ్చు.

ఒకరి నేత్రదానం. ఇద్దరికి చూపునిస్తుంది. దేశంలో ఏటా 20 వేలమంది అంధత్వానికి లోనవుతున్నారు. విటమిన్–ఏ లోపం, కంటి గాయాలు, కంటి వ్యాధులు ఇందుకు కారణం. కార్నియా మార్పిడి ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. రాష్ట్ర జనాభాలో దాదాపు 5 నుంచి 6 శాతం మంది అంధత్వ లోపంతో బాధపడుతున్న వారు ఉన్నారని నివారణ సంస్థ సర్వే చెబుతోంది. ఈ లోపాన్ని అధిగమించేందుకు ప్రజలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు కొనసాగనున్నాయి. దీనిపై ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ అంగీకరించేలా చొరవ తీసుకోవడంతో పాటు అంధత్వ లోపాన్ని అధిగమించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రస్థాయిలో అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఇతర స్వచ్ఛంద సంస్థలు అవగాహనా కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నాయి. సదస్సుల్లో అంగీకారం మేరకు పత్రాలను తీసుకుంటున్నారు. సహజ మరణం, దీర్ఘకాలిక వ్యాధులతో మృతి చెందిన వారి నేత్రాలను దానం చేయొచ్చు. ఏ వయసు వారి కళ్లయినా ఇవ్వొచ్చు. క్యాన్సర్, హెచ్ఐవీ, కామెర్లు, పిచ్చి కుక్కకాటుతో మృత్యువాత పడిన వారి నేత్రాలను సేకరించరు. నేత్రదానం చేయాలనుకునే వారు ఆయా జిల్లాల్లోని జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయాల్లో అంగీకారపత్రాలను అందజేయాలి. హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితులు మినహాయించి మిగతా ఎలాంటి కారణంతో చనిపోయినా నేత్రాలను దానం చేయొచ్చని సంబంధిత వైద్య నిపుణులు చెబుతున్నారు. మరణించినా చూపు బతుకుతుందని, ఇద్దరు వ్యక్తులు అంధత్వ లోపం నుంచి బయటపడతారంటున్నారు.

మూఢ నమ్మకాలు కారణమే!

రాష్ట్రప్రభుత్వంతోపాటుగా ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ప్రతినిత్యం దీనికి సంబంధించిన



అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా చాలామంది ముందుకు రావడం లేదు. ఎందుకంటే కొన్ని మూఢనమ్మకాల కారణంగా ఇది జరుగుతోంది. నేత్రదానం చేస్తే చెడు జరుగుతుందనే ప్రచారాలు కూడా ఉన్నాయి. అందుకనే ఎక్కువమంది ముందుకు రావటం లేదు. ప్రమాదాలు, అనారోగ్య సమస్యలతో భారీగా మరణిస్తున్నా నేత్రదానాలు చేసింది అంతంత మాత్రమే అని అంధత్వ నియంత్రణ సంస్థ చెబుతోంది. చాలా కుటుంబాల్లో నేత్రదానం చేయాలని ఉన్నా సమయానికి ఎవరిని సంప్రదించాలో తెలియక వదిలేస్తున్నారు. వీటి కోసం ఎదురుచూస్తున్న బాధితులకు ఆలస్య మవుతోంది. దానంపై అంగీకారపత్రాన్ని జిల్లాలోని ఏ ఆరోగ్య కేంద్రంలోనైనా ఇవ్వొచ్చని నియంత్రణ సంస్థ అధికారులు చెబుతున్నారు. మరణించిన వ్యక్తుల బంధువులు వెంటనే స్థానిక ఆసుపత్రి, స్వచ్ఛంద సంస్థలైన లయన్స్‌క్లబ్, రెడ్‌క్రాస్, ఇతర స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు సమాచారం ఇస్తే నేరుగా వచ్చి సేకరిస్తారని సూచిస్తున్నారు.

అవగాహన ముఖ్యం

నేత్రదానం ఆవశ్యకతపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. మరణించిన ఆరు గంటల్లోగా మృతుల కంటి నుంచి కార్నియాను తీయాలి. దీనిపై సమీప ఆసుపత్రి వైద్యులకు సమాచారాన్ని తెలియజేసేలా ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కార్నియా పొరలు దెబ్బతిని కంటి చూపులేనివారు ఎంతో మంది ఉన్నారు. వారికి చూపు రావాలంటే మరణానంతరం ఎవరైనా కార్నియాలను దానం చేయాలి. అలా చేస్తే వారిలో 75 శాతం మందికి కళ్లు కనిపించే అవకాశం ఉంటుంది. పోషకాహార లోపం, ఇన్ఫెక్షన్లు, రసాయనాలు దగ్ధమైన పొగ, పుట్టుకతో వచ్చిన లోపాలు, ప్రమాదాల కారణంగా కంట్లోని నల్లగుడ్డుపై పొర దెబ్బతినడం.. ఇలాంటి సమస్యలతో బాధపడేవారికి నేత్రదానం ద్వారా కార్నియా పొరలు సేకరించి శస్త్రచికిత్స చేస్తే చూపు వస్తుంది.

ముందుకు రావాలి

నేత్రదానానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. దీనిపై అవగాహన లేకపోవడంతో అవకాశం ఉన్నా ఎంతో మంది చూపులేకుండానే ఉండిపోతున్నారు. నేత్రదాన అంగీకార పత్రం ఇచ్చినవారు వారి కుటుంబ సభ్యులకు తప్పనిసరిగా విషయాన్ని తెలియ జేయాలి. అందుకోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌పిసిబి నేషనల్ ప్రోగ్రాం ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైన్డ్నెస్, నేత్రదానం గురించి ప్రజలందరూ, ముఖ్యంగా యువత తెలుసుకొని నల్ల గుడు (కార్నియా). బ్లైండ్ నెస్ తీవ్రత తెలుసుకొని ప్రజల్లోకి నేత్రదాన అవగాహన తీసుకెళ్తే చాలా బాగుంటుంది.

నేత్రదానం ఎలా చేయాలి..

- స్వచ్ఛంద సంస్థలు గాని దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో గానీ, నేత్రదాన ప్రతిజ్ఞ పత్రాలు అందుబాటులో ఉంటాయి.
- పూర్తి చేసి కుటుంబ సభ్యుల సంతకాలు చేయించి సంబంధిత అధికారులకు అందజేయాలి.
- మరణానంతరం మన కళ్ళను ప్రభుత్వ నేత్ర వైద్య నిపుణులు సేకరించి కావాల్సిన వాళ్లకు అమరుస్తారు.
- నేత్రదాన అంగీకార పత్రం ఇచ్చిన వ్యక్తి మరణించి వెంటనే అక్కడ ఉన్న ఫ్యాన్లు ఏసీలు ఆఫ్ చేయాలి.
- చనిపోయిన వ్యక్తి తల కింద ఎత్తైన తలగడ ఉంచాలి. నీళ్లలో తడిపిన దూదిని రెండు కళ్ళ పైన ఉంచాలి. దగ్గరలో, అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య శాలకు లేదా నేత్రదానం సంబంధించిన స్వచ్ఛంద సంస్థలకు సమాచారం అందించాలి.

ఒక వ్యక్తి మరణించిన తర్వాత 4 గంటల్లోపు అతని కార్నియా పొరను శస్త్రచికిత్స ద్వారా సేకరించి సక్రమంగా భద్రపరిస్తే ఇతరులకు చూపు ప్రసాదించవచ్చు.

నేత్రదానానికి ఎవరైనా వాగ్దానపత్రం ఇచ్చినా వారి సమీప బంధువు ఆమోదం కూడా అవసరం అవుతుంది.

ఎలా దరఖాస్తు చేయాలంటే...

- నేత్రాలు దానం చేయాలనుకొనే వారు దరఖాస్తు పత్రాన్ని భర్తీ చేసి ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పనిచేస్తున్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ కార్యాలయాల్లో అందజేయాలి.
- 18 సంవత్సరాల వయసు నిండిన వారి నుంచి మాత్రమే దాన పత్రం స్వీకరిస్తారు.
- మృతి చెందిన వ్యక్తి నుంచి ఆరు గంటలలోపు కార్నియాను సేకరించి సక్రమంగా భద్రపరిస్తే ఇతరులకు చూపు ప్రసాదించొచ్చు.
- 18 ఏళ్లు నిండినవారు.. సహజ మరణం పొందినవారు, ప్రమాదవశాత్తూ మృతిచెందిన ఆరోగ్యవంతులు దానం చేయొచ్చు. మధుమేహం, రక్తపోటు ఉన్నా.. గుండె జబ్బులు, దీర్ఘకాలిక వ్యాధులతో చనిపోయినా.. ఎవరివైనా నేత్రాలు దానం చేయొచ్చు.
- క్యాన్సర్, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, నల్లగుడ్డు దెబ్బతిన్న వారు, కామెర్లు, పిచ్చికుక్క కాటుతో మృతిచెందినవారు దానం చేయడానికి అనర్హులు.
- నేత్రదానం 15–20 నిమిషాల్లో పూర్తయ్యే సాధారణ ప్రక్రియ.
- దాత మృతిచెందిన ఆరు గంటల్లోపు కార్నియాలు తీయాలి.
- అంధులకు కార్నియాను మాత్రమే అమరుస్తారు. మొత్తం కంటిని కాదు.
- నేత్రదానానికి ఎవరైనా అంగీకార పత్రం ఇచ్చినా వారి కుటుంబ సభ్యుల ఆమోదం కూడా అవసరం.
- నేత్రదానం చేయాలనుకునేవారు దరఖాస్తు పత్రాన్ని నింపి, ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పనిచేస్తున్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ కార్యాలయాల్లో అందజేయాలి. 18 ఏళ్లు నిండిన వారినుంచి మాత్రమే పత్రం స్వీకరిస్తారు.




– డాక్టర్ జి.భానుమూర్తి,
ఎంబిబిఎస్, ఎంఎస్,
కంటి వైద్య నిపుణులు, ఉప పర్యవేక్షణ అధికారి, ప్రభుత్వ సర్వజన వైద్యశాల,
మచిలీపట్నం,
సెల్ : 94404 23178

అనుష్కకు గుర్తింపు తెచ్చే సినిమా 'ఘాటి' : క్రిష్




'ఘాటి' కథ పూర్తిగా ఫిక్షనల్. గంజాయి అనేది ఒక సోషల్ ఇష్యూ. ప్రభుత్వాలు ఉక్కు పాదంతో అణిచి వేయాలని ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే అవన్నీ దాటి గంజాయి అనేది సమాజంలోకి వస్తుంది. సర్వైవల్ కోసం చేసినప్పటికీ పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయి. ఐడెంటిటీ, సర్వైవల్ థీమ్స్‌తో వస్తున్న సినిమా ఇది. మనందరం ఎదుర్కొంటున్న ఒక సమస్య నిర్మూలనకి ఊతమిస్తుంది. కానీ గ్లోరీఫై చేసేలా ఉండదు. రచయిత డాక్టర్ చింతకింది శ్రీనివాసరావు 'ఘాటి' ఆలోచన చెప్పారు. ఆంధ్ర, ఒరిస్సా బోర్డర్‌లో శిలావతి గాంజా రకం పెరుగుతుంది. దీనికి ప్రపంచ వ్యాప్తంగా చాలా డిమాండ్ ఉంది. వేల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంటుంది. దానికోసం ఒక వ్యవస్థ పని చేస్తుంటుంది. గంజాయి బస్తాలను మోయడానికి కొంతమంది కూలీలు ఉంటారు. వారిని ఘాటీలని పిలుస్తారు. వాళ్ళ నేపథ్యం గురించి చెప్పినప్పుడు చాలా ఎక్సైటింగ్‌గా అనిపించింది. ఆ ఘాటీల ప్రపంచాన్ని, కల్చర్‌ని చూపించే ఆస్కారం ఉండటంతో ఈ చిత్రాన్ని మొదలుపెట్టాం.' అని దర్శకుడు క్రిష్ జాగర్లమూడి చెప్పారు. అనుష్క శెట్టి ప్రధాన పాత్రధారిణిగా నటించిన యాక్షన్ డ్రామా 'ఘాటి'. విక్రమ్ ప్రభు మేల్‌లీడ్‌గా నటించారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్‌రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు. ఈనెల 5న ఈ సినిమా విడుదల కానుంది. మీడియాతో ఆయన పై విధంగా మాట్లాడారు.

120 దేశాల్లో విడుదలవుతోంది..



మహేష్ బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న 'ఎస్–ఎస్ఎంబి–29' చిత్రం 120 దేశాల్లో విడుదల కానుంది. ఈ విషయాన్ని కెన్యా మంత్రి ట్విట్టర్‌లో ప్రకటించారు. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ కెన్యాలో జరుగుతున్నట్లు ఆ దేశ మంత్రి ముసాలియా ముదావాది ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. మూవీ టీమ్‌ని కలిసి ఫొటోలు షేర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. 'దర్శకధీరుడు రాజమౌళి గత రెండు దశాబ్దాలుగా సినీ ఇండస్ట్రీలో ఉన్నారు. చాలా శక్తివంతమైన కథలు, విజువల్స్‌ను లోతైన సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పడంలో ఆయన ఎంతో ప్రసిద్ధి చెందారు. 120 మంది సిబ్బందితో కూడిన అతని బృందం తూర్పు ఆఫ్రికా అంతటా విస్తృతమైన స్కౌటింగ్ పర్యటన తర్వాత కెన్యాను ఎంచుకుంది. మసాయి మరా మైదానాల నుంచి మొదలు సుందరమైన నైవాషా, ఐకానిక్ అంబోసెలి వంటి ప్రాంతాలు ఆసియాలోని అతిపెద్ద చలనచిత్రంగా తెరకెక్కుతున్న ఈ మూవీలో భాగం కాబోతున్నాయి. ఈ సినిమాను మూవీ టీమ్ ఏకంగా 120 దేశాల్లో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు మాకు చెప్పారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మందికిపైనే చేరువవుతుందని నేను అనుకుంటున్నా. కెన్యాలో షూటింగ్ చేయడం ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. మా దేశ అందాలను, ఆతిథ్యాన్ని సుందర దృశ్యాలను చూపడంలో ఈ సినిమా శక్తవంతంగా పనిచేయనుంది. ఈ విషయంలో నాకు చాలా గర్వంగా అనిపిస్తుంది' అని ముసాలియా సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు.

'కిష్కింధపురి' ట్రైలర్ విడుదల



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ప్రధానపాత్రల్లో తెరకెక్కిన 'కిష్కింధపురి' చిత్రం నుండి బుధవారం తాజాగా ట్రైలర్ విడుదలచేశారు. కౌశిక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సెప్టెంబర్ 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా రిలీజ్ చేసిన ట్రైలర్‌ని ఊరికి ఉత్తరాన.. దారికి దక్షిణాన.. పశ్చిమ దిక్కున ఉన్న' అంటూ గంభీరమైన బ్యాగ్రౌండ్ వాయిస్‌తో ప్రారంభించారు. ఘోస్ట్ వాకింగ్ టూర్ అంటూ ఓ పాడుపడ్డ ఇంటి చుట్టూ తిప్పుతూ దాని వెనక స్టోరీ చెప్పే జంటగా సాయి, అనుపమ కనిపించారు.

అంబికగా శ్రియ శరణ్



కథానాయకుడు తేజ సజ్జా నటించిన చిత్రం 'మిరాయ్' ఈనెల 12న విడుదల కానుంది. సూపర్ యోధగా అతడు నటించాడు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. శ్రియ శరణ్ అంబికగా తల్లిపాత్ర పోషిస్తున్నారు. ఈ పాత్రను పరిచయం చేస్తూ ఒక ప్రత్యేక పోస్టర్‌ను నిర్మాతలు విడుదలు చేశారు. ఈ చిత్రంలో తేజ సజ్జ సరసన రితికా నాయక్ కథానాయిక. జయరామ్, జగపతిబాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సుజిత్‌కుమార్ కొల్లి, సంగీతం గౌర హరి. కథానాయకుడు రజనీకాంత్ 'మిరాయ్' చిత్ర ట్రైలర్‌ను వీక్షించారు. చాలా బాగుందంటూ చిత్ర బృందాన్ని అభినందించారు. గ్రాండ్ స్కేల్‌లో మూవీ మేకింగ్‌తోపాటు మనోజ్ క్యారెక్టర్ పవర్‌ఫుల్‌గా ఉందన్నారు.

'గ్రాస్ రూట్' నుండి ఇక సినిమాలు రావు



దర్శకుడిగా కొనసాగడం చాలా సులభమని, నిర్మాతగా రాణించడం ఎంతో కష్టమని ప్రముఖ దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ పేర్కొన్నారు. ఆయన నిర్మాతగా 'గ్రాస్ రూట్ కంపెనీ' పతాకంపై నిర్మించిన చిత్రం 'బ్యాడ్ గర్ల్'. ఈ చిత్ర నిర్మాణం ఎప్పుడో పూర్తి చేసుకున్నప్పటికీ సెన్సార్ సమస్యల్లో చిక్కుకుంది. దీంతో వెట్రిమారన్ న్యాయ పోరాటం చేసి, సెన్సార్ సర్టిఫికెట్ పొందారు. ఈ నేపథ్యంలో ఆ చిత్ర బృందం ఇటీవల ఓ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా వెట్రిమారన్ మాట్లాడుతూ.. 'దర్శకుడిగా ఉండటం చాలా సులభం. కానీ, నిర్మాతగా వ్యవహరించడం ఎంతో కఠినం. నేను నిర్మించిన 'మనుషి', 'బ్యాడ్ గర్ల్' సినిమాలు సెన్సార్ సమస్యల్లో చిక్కుకున్నాయి. వాటి నుంచి గట్టెక్కేందుకు న్యాయ పోరాటం చేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో చిత్రాలు నిర్మించడం చాలా కష్టం. అందుకే మా నిర్మాణ సంస్థపై ఇక సినిమాలు నిర్మించను. 'బ్యాడ్ గర్ల్' చివరి చిత్రం. 'గ్రాస్ రూట్ కంపెనీ' మూసి వేస్తున్నాం' అని ప్రకటించారు.

మన్‌దీప్ మ్యాజిక్

- కొరియాతో సూపర్–4 మ్యాచ్ డ్రా
- నేడు మలేషియాతో భారత్ కీలకపోరు
- ఆసియాకప్ హాకీ



రాజ్‌గిరి(బీహార్): ఆసియాకప్ హాకీలో భారతజట్టు పటిష్ట కొరియాను నిలువరించింది. బుధవారం జరిగిన సూపర్–4 తొలి మ్యాచ్ డ్రా అయ్యింది. ఇరుజట్లు నిర్ణీత 4 క్వార్టర్ల ఆట ముగిసేసరికి 2–2గోల్స్‌తో సమంగా నిలిచాయి. తొలి అర్ధభాగంలో భారత్ ఒక గోల్ చేయగా.. కొరియా రెండు గోల్స్ చేసింది. ఆ తర్వాత 2, 3 క్వార్టర్లలో ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫల మయ్యాయి. దీంతో భారత అభిమానులు నిరాశకు గురయ్యారు. నాల్గో క్వార్టర్‌లో సగభాగం ముగిసే సరికి భారతజట్టు 1–2గోల్స్‌తో వెనుకబడి ఉంది. కానీ మరో 4 నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా భారత్ గోల్ చేసింది. దీంతో భారత అభిమానులంతా ఊపిరి పీల్చుకున్నారు. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో భారతజట్టు కొరియాను నిలువరించడం విశేషం. ఇక చివర్లో భారత్‌కు మరోసారి గోల్ చేసే అద్భుత అవకాశం లభించింది. సుఖ్‌జీత్ బంతిని కొరియా గోల్ పోస్ట్ దగ్గరికి తీసుకెళ్లి చివర్లో గోల్ కొట్టడంలో విఫలమయ్యాడు. దీంతో భారత ఆటగాళ్లంతా నిరాశకు గురయ్యారు. కొరియా తరఫున యాంగ్ 12, 14 నిమిషాల్లో రెండు గోల్స్ కొట్టగా... భారత్ తరఫున తొలి అర్ధభాగంలో హార్దిక్ 8వ ని.లో చేశాడు. చివర్లో 53వ ని.లో మన్‌దీప్ గోల్ కొట్టి భారతజట్టు ఓటమిపాలుకాకుండా అడ్డుకున్నాడు. అంతకుముందు జరిగిన తొలి సూపర్–4 మ్యాచ్‌లో మలేషియా జట్టు 2–0తో చైనాను చిత్తుచేసింది. ఇక 5–8 స్థానాలకు జరిగిన మ్యాచ్‌లో జపాన్ జట్టు 2–0తేడాతో చైనీస్ తైపేని చిత్తుచేసింది.



పుణేరి, హర్యానా గెలుపు

ప్రొ కబడ్డీ సీజన్–12

విశాఖపట్నం: ప్రొ కబడ్డీ సీజన్–12లో భాగంగా బుధవార జరిగిన లీగ్ మ్యాచుల్లో పుణేరి పల్టన్స్, హర్యానా స్టీలర్స్ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్‌లో బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో పుణేరి జట్టు 45–36పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌ను చిత్తుచేసింది. పుణేరి జట్టులో అస్లామ్ 11, ఆదిత్య 11 రైడ్ పాయింట్లు సాధించగా.. విశాల్ భరద్వాజ్ డిఫెన్స్‌లో రాణించాడు. ఇక బెంగాల్ వారియర్స్ జట్టులో రైడర్ దేవాంక్ ఒంటరిపోరాటం చేశాడు. అతడు ఏకంగా 17 రైడ్ పాయింట్లతో సత్తా చాటినా.. మిగిలిన వారంతా నిరాశపరిచారు. ఇక హర్యానా స్టీలర్స్ యు ముంబ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో తొలి అర్ధభాగం ముగిసేసరికి యు ముంబ జట్టు 14–8పాయింట్ల ఆధిక్యతలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరుజట్లు 36–36పాయింట్లతో నిలిచాయి. దీంతో ఈ మ్యాచ్ డ్రా అయ్యింది. టై బ్రేకర్‌లో హర్యానా స్టీలర్ 7–6పాయింట్ల తేడాతో యు ముంబాను ఓడించింది.

ప్రొ కబడ్డీలో నేడు...

జైపూర్ పింక్ ప్యాంథర్స్ × తెలుగు టైటాన్స్(రాత్రి 8.00గం॥లకు)

పుణేరి పల్టన్స్ × దబాంగ్ ఢిల్లీ(రాత్రి 9.00గం॥లకు)


సెమీస్‌కు అల్కరాజ్, జకోవిచ్

యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత, 7వ సీడ్ నొవాక్ జకోవిచ్‌తోపాటు 2వ సీడ్, స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కరాజ్ ప్రవేశించారు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో జకోవిచ్ 6–3, 7–5, 3–6, 6–4తో 4వ సీడ్, అమెరికాకు చెందిన టేలర్ ఫ్రిట్జ్‌ను చిత్తుచేశాడు. తొలి రెండు సెట్‌లను చేజిక్కించుకున్న జకోవిచ్‌కు మూడో సెట్‌లో ఫ్రిట్జ్ గట్టి పోటీని ఇచ్చాడు. ఆ సెట్‌ను చేజార్చుకున్నా.. నాలో సెట్‌ను గెలిచి మ్యాచ్‌ను ముగించాడు. మరో క్వార్టర్‌ఫైనల్లో 2వ సీడ్ కార్లోస్ అల్కరాజ్ 6–4, 6–2, 6–4తో 20వ సీడ్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన లెహెక్కాను ఓడించాడు. సెమీస్‌లో అల్కరాజ్‌తో జకోవిచ్ తలపడనున్నాడు.

సబలెంక సునాయాసంగా..



మహిళల సింగిల్స్‌లో టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంక మ్యాచ్ ఆడకుండానే సెమీస్‌కు చేరింది. ప్రత్యర్థి, చెక్‌రిపబ్లిక్‌కు చెందిన వోంద్రుసోవా క్వార్టర్‌ఫైనల్‌ను వైదొలగడమే ఇందుకు కారణం. మరో మ్యాచ్‌లో పెగూలా(అమెరికా) క్రేజికోవాను చిత్తుచేసి సెమీస్‌కు చేరిన సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68